కవిభల్లట విరచిత

# బేతాళ పంచవింశతి

సంపాదక పరిష్కరణ

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి**

పరిష్కర్త

**ఆచార్య రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రి**

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2024**

**KAVIBHALLATA VIRACHITA**
**BETHALA PANCHAVIMSATHI**

Editor
**Sri Veturi Prabhakara Sastry**

Edited By
**Prof. R.V.R.Krishna Sastry**

**Dr. Akella Vibhishana Sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No.1461
©All Rights Reserved

First Print: 2024

*Copies :* 250

*Published by*

**Sri J. Syamala Rao,** IAS.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

*D.T.P:*
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati.

# ముందుమాట

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామిపై భక్తిభావనతో రచనలు చేసినవారెందరో ఉన్నారు. వారిలో అన్నమయ్య అద్వితీయుడు. అన్నమయ్య రచించిన సంకీర్తనల రాగిరేకులను, తాళపత్రగ్రంథాలనేగాక ప్రాచీనకవుల తాళపత్రగ్రంథాలను కూడా సేకరించి, పరిష్కరించి, అచ్చువేసిన పరిశోధకులలో శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అగ్రగణ్యులు.


కీ.శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సంస్కృతాంధ్రభాషల్లో మహాపండితులు. యోగివర్యులు, ఉత్తమపరిశోధకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి, ఆత్మదర్శనులు. శ్రీ శాస్త్రిగారి సాహిత్యసేవను గుర్తించి తి.తి.దేవస్థానంవారు "శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం" స్థాపించారు. ఈ పీఠం స్థాపించిన నాటినుండి శాస్త్రిగారు పరిష్కరించి రచించిన గ్రంథాలను ముద్రించి, ఆంధ్రసాహితీలోకానికి తి.తి.దే. అందిస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుత గ్రంథం 'బేతాళ పంచవింశతి'.

కవిభల్లటుడు రచించిన "బేతాళ పంచవింశతి" తెలుగువారి కథా కథన నైపుణ్యానికి నిదర్శనం. తెలుగులో పద్యకావ్యంగా వెలువరించిన బేతాళ పంచవింశతి కావ్యాన్ని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించి చక్కని పీఠికనందించారు. ప్రాచీన భారతీయవాఙ్మయంలో కథాసాహిత్యానికి విశేషమైన స్థానమున్నది. సమాజానికి తెలియజేయవలసిన విషయాన్ని కథాకథనరీతిలో తెలియజేస్తే అది సమాజానికి త్వరగా చేరుతుంది. ఇట్టి కథాసాహిత్యాలు అనేకమున్నా వాటిలో బేతాళ పంచవింశతి విశేష ఆదరణను పొందింది.

పంచవింశతి అంటే 25. తనను వశము చేసుకోవాలని ప్రయత్నించిన విక్రమార్కమహారాజుతో బేతాళుడు అనే రాక్షసుడు 25 రాత్రులు చెప్పిన సమస్యాత్మక కథలే ఈ 'బేతాళ పంచవింశతి' ఈ కథలన్నీ ఉత్కంఠభరితంగా సాగుతూ చివరకు చిక్కుముడిగల ప్రశ్నలతో ముగుస్తాయి. ఆ ప్రశ్నలకు విక్రమార్కమహారాజు తన తెలివితేటలను నిరూపించుకొంటూ ధర్మబద్ధమైన, తర్కబద్ధమైన సమాధానాలను తెలియజేయడం ఇందులోని విశేషం. ఈ గ్రంథాన్ని తెలుగు సాహిత్యాభిమానులందరు తప్పక ఆదరించి పఠించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంథాన్ని పరిశీలించి ముద్రింపజేయడంలో విశేషంగా కృషి చేసిన ప్రచురణల విభాగ ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి అభినందనలు.

సదా శ్రీవారి సేవలో...



**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# పీఠిక

శ్రోతలకు, పఠితలకు ఆనందాన్ని కలుగజేసేది కావ్యం. కీర్తి, ధనం, వ్యవహారజ్ఞానం, అమంగళనాశం, ఉపదేశం, అలౌకికానందం – ఈ ఆరు కావ్యప్రయోజనాలుగా చెప్పబడినా, ఆనందమే ముఖ్య ప్రయోజనంగా చెప్పబడింది. మానవుని మనుగడకు ఆనందమూ, విజ్ఞానమూ రెండూ అవసరమే. ఆనందం హృదయస్పర్శి. విజ్ఞానం బుద్ధి స్పర్శి. కాబట్టి ఆనందంతోపాటు ఉపదేశం కూడా కావ్యప్రయోజనాలలో ముఖ్యమైందిగా భావింపబడుతోంది.

భారతీయవాఙ్మయం వేదాలతో ప్రారంభమైంది. ఆ తరువాత పురాణాలు, కావ్యాలు ఇలా క్రమంగా వికాసాన్ని పొందింది. ఈ వాఙ్మయమంతా సంస్కృతంలోనే ఉంది. ఆలంకారికులు స్వరూపాన్నిబట్టి గద్య, పద్య, ఉభయాత్మకంగా కావ్యాన్ని విభజించారు. ఇందులో గద్య ప్రక్రియకు సంబంధించినవే కథాకావ్యాలు. కాని కొన్ని కథాకావ్యాలు పద్యకావ్యాలుగా కూడ వచ్చాయి.

భారతదేశం కథలకు పుట్టినిల్లు. ఈ కథల ద్వారా విజ్ఞాన, నీతి, ధర్మ, రాజనీతి వ్యవహారజ్ఞానాలను అందించడం అతి ప్రాచీనకాలంలోనే భారతీయులు నేర్చారు. వేదాలలో, పురాణాలలో, భారతరామాయణాది ఇతిహాసాలలో ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. అవన్నీ 'కథ'కు ప్రాథమికరూపాలు.

కథాసాహిత్యాన్ని నాలుగు రకాలుగా విభజించవచ్చు. 1. ఆలంకారిక శైలిలో రచింపబడిన కథాకావ్యాలు. సుబంధుని వాసవదత్త, దండి దశకుమారచరిత్ర, బాణభట్టుని కాదంబరి ఈకోవకు చెందినవి. 2. సాహసాద్భుతకథలు: ఇవి కాల్పనిక కథలు, బృహత్కథ, శుకసప్తతి, విక్రమార్కునికథలు వంటివి ఈ విభాగానికి చెందినవి. 3. రాజనీతిని

వ్యవహారజ్ఞానాన్ని బోధించే కథలు. పంచతంత్రం హితోపదేశం మున్నగునవి ఈ కోవకు చెందినవి. 4. ధర్మబోధప్రధానంగా సాగిన కథలు. పురాణాంతర్గతంగా ఉన్నవి. బౌద్ధజాతకథలు ఈ కోవకు చెందినవి.

కథాసాహిత్యంలో ముందుగా పేర్కొనదగినది గుణాఢ్యుని బృహత్కథ. ఇది పైశాచీభాషలో రచింపబడినది. దీనినే సోమదేవసూరి కథా సరిత్సాగరంగా సంస్కృతంలో రచించాడు. ఇది చాలా ప్రసిద్ధికెక్కిన బృహత్కథానువాదం. ఇందులో 124 తరంగాలు (లంబకాలు) ఉన్నాయి. ఇందులో బేతాళపంచవింశతి కథలున్నాయి.

'బేతాళ పంచవింశతి' (బేతాళుని 25 కథలు)లోని కథలు క్షేమేంద్రుని బృహత్కథామంజరిలో, సోమదేవుని కథాసరిత్సాగరంలోను ఉన్నాయి. ఈ కథలు కాశ్మీరప్రాంత 'బృహత్కథ'లో కూడా ఉన్నాయని 'వింటర్ నిట్స్' అభిప్రాయపడ్డాడు. కాని ఆ ప్రతి లభింపకపోవటంవల్ల దాన్ని నిర్ధారించలేం. ఈ బేతాళపంచవింశతి మూలగ్రంథం మనకిపుడు లభ్యం కావటం లేదు. క్రీ.శ. 12వ శతాబ్దివాడైన 'శివదాసు' ఈ కథలను గద్యపద్యాత్మకంగా సంస్కృతంలో రచించాడు. ఈ బేతాళపంచవింశతి కథల పుట్టుక చాలా ప్రాచీనమైనదని, తర్వాతి కాలంలో ఇవి గ్రంథస్థం చేయబడినవని విమర్శకుల అభిప్రాయం.

బేతాళుడు అతిమానుషశక్తులుగల దయ్యం. ఈ దయ్యం శ్మశాన భూమిలోని శవాలతో నివాసం ఏర్పచుకొంటుంది. ఏ రూపమంటే ఆ రూపాన్ని ధరించగలశక్తి దానికుంటుంది. ఈ బేతాళసంప్రదాయం శైవతాంత్రికమతంలో పుట్టి బౌద్ధుల తాంత్రికమతంలో కూడా ప్రవేశించింది. తాంత్రికులు బేతాళుని వశపరచుకొని తమకు సేవలు చేయించుకుంటారు. బేతాళుడు చెప్పిన 25 కథలు కాబట్టి దీనికి 'బేతాళ పంచవింశతి' అనే పేరు వచ్చింది. ప్రతికథ ఒక చిక్కుప్రశ్నతో ముగుస్తుంది.

విక్రమసేనుడనే రాజుదగ్గరకు ఒక యోగి వచ్చి ఒక పండు ఇస్తాడు. ఆ పండులో మణి ఉంటుంది. తనకు సిద్ధికావాలంటే బేతాళుని సహాయం కావాలని, బేతాళుని స్మశానం నుండి తీసుకొనిరాగల ధైర్యసాహసాలు ఆ రాజులోనే ఉన్నాయని, బేతాళుని తనకప్పగిస్తే మణి రాజుకిస్తానని చెప్తాడు. అప్పుడు విక్రమసేనుడు అర్ధరాత్రి స్మశానానికి వెళ్ళి బేతాళుని మోసుకువస్తుంటే బేతాళుడు తనకొక చిక్కు ప్రశ్న ఉందని, దానికి సమాధానం తెలియకపోతే నీతో వస్తానని, తెలిసి చెప్పకపోతే నీతల పగిలిచస్తావని రాజుతో అంటాడు. అలా ఒక కథ చెప్పడం, చిక్కు ప్రశ్నవేయడం, దానికి సమాధానం తెలిసి రాజు చెప్పడం, తిరిగి బేతాళుడు స్మశానానికి పోవడం ఇలా 25 రాత్రులు 25 కథలు చెప్పడం జరుగుతుంది. చివరి కథకు రాజు సమాధానం చెప్పలేకపోతాడు.

ఈ కథలలోని రాజు విక్రమసేనుడు. విక్రమసేనుడని ప్రాచీనులు చెప్పగా, దేశభాషలలో అతడు విక్రమాదిత్యునిగా చెప్పబడ్డాడు. ఈ కథలన్నీ శ్రోతలకు కుతూహలాన్ని కలిగించేటట్లుగా ఉంటాయి. ఇవి భారతీయుల కథనకౌశలానికి నిదర్శనం.

ఈ కావ్యకర్త కవిభల్లటుడు. ఇతడు 12వ శతాబ్ది ఉత్తరార్ధంలో జీవించాడు. ఇంతకంటె ఇతనిగూర్చి వివరాలు లభించలేదు.

ఇది పద్యగద్యాలలో ఉన్నా కథాకావ్యాల కుండవలసిన ప్రసన్న మాధుర్యమైన రచనతో సాగింది. ప్రబంధధోరణిలో విస్తృతవర్ణనలు, శబ్దార్థాలంకారభూయిష్ఠరచనము, దీర్ఘసమాససంఘటనము లేక, చదువరులకు సులభగ్రాహ్యంగా ఉంది. చాలా మితంగా అలంకార వర్ణనాదులు ఉన్నా, అవి కథానందానికి విఘాతుకంగా లేవు.

ఇందులోని కథలన్నీ ఉత్కంఠభరితంగా సాగడం, చివరిలో చిక్కుముడి గల ప్రశ్నవేయడం, ఆ ప్రశ్నకు విక్రమసేనుడు సమాధానం చెప్పడం,

తిరిగి బేతాళుడు చెట్టెక్కడం ఇవి సామాన్యల లక్షణాలు. ఈ ప్రశ్నలకి సమాధానాలు రాజు తెలివితేటలన్ని నిరూపించేవే కాక, ప్రాచీన భారతీయ ధర్మశాస్త్రబద్ధంగా తర్కబద్ధంగా కూడ ఉండటాన్ని గమనించ గలం. ఇందుకు ఒకటిరెండు ఉదాహరణలు చూద్దాం.

ఏడవకథ (మదనసుందరికథ)లో గౌరీదేవిఆలయంలో భర్త, సోదరుడు శిరచ్ఛేదనం చేసికొని, ఆత్మార్పణం గావిస్తారు. అది చూసిన మదనసుందరి తాను మరణింప నిశ్చయించుకొని, కాత్యాయని ప్రార్థింపగా, ఆమె ప్రత్యక్షమై పతిసోదరుల శిరస్సులను వారి శరీరాలకు చేర్చమని చెపుతుంది. ఆ తొట్రుబాటులో ఆమె పతి శిరస్సును సోదరుని శరీరమునకు, సోదరుని శిరమును పతిశరీరమునకు చేరుస్తుంది. వారిని దేవి పునరుజ్జీవితులను చేస్తుంది. ఇపుడు ఆమె ఎవరికి పతిగా వహించాలని బేతాళుడు ప్రశ్నిస్తాడు. అప్పుడు రాజు –

**తే.** **పతిశిరంబు ధరించి సప్రాణుండై**
**యతఁడు కాదగు నిక్కమవ్వనిత వరుఁడు**
**తలఁప సర్వాంగములకు నాధారమైన**
**శిరము ముఖ్యంబు నరదేవ! జీవితతికి.**

ఇందులో జీవులకు శిరస్సు ప్రధానమనే విషయాన్ని ప్రమాణంగా చూపి, సమాధానం చెప్పాడు.

ఇదే విధంగా పదవకథ (ధర్మదత్త – సముద్రదత్త)లో ధర్మదత్తుడు మదనసేనను మోహించాడు. అయితే ఆమె తండ్రి ఆమెను సముద్ర దత్తునికి వివాహం చేస్తానని మాటిచ్చాడు. ధర్మదత్తుడు ఆమెతో నీవు లేనిదే జీవించలేనని బలాత్కరింపబోతాడు. అపుడామె 'ముందు నా వివాహం జరిగి, నా తండ్రికి కన్యాదానఫలం దక్కనీ అటుపై నాభర్త అనుమతితో నిన్ను కలుస్తానని చెప్పి ఆమె అతనినుండి బయట పడుతుంది. వివాహం

అయిన మొదటిరాత్రి భర్తతో తాను ధర్మదత్తునికిచ్చిన మాటగురించి చెపుతుంది. అందుకు సముద్రదత్తుడు అంగీకరిస్తాడు. ఆ రాత్రి మదనసేన ధర్మదత్తుని కలవడానికి బయలుదేరుతుంది. దారిలో ఒక దొంగ ఆమె నడ్డగించి, ఆమె సౌందర్యానికి ఆకర్షితుడై, నీ నగలవసరంలేదు, నీ పొందు కావాలని కోరతాడు. అపుడామె తన కథ చెప్పి ముందుగా ధర్మదత్తుని కలిసాక నీ వద్దకు వస్తానంది. ఆమె సత్యసంధురాలని గ్రహించి ఆ దొంగ అంగీకరిస్తాడు. ఆమె ధర్మదత్తుని వద్దకు వెళుతుంది. అతడు నీవు పరస్త్రీవి, నీతో నాకు పొందుతగదని పంపేస్తాడు. ఆమె దొంగ దగ్గరకు వస్తుంది. ధర్మదత్తుడామెను విడిచిన సంగతి గ్రహించి, ఆమె సత్యసంధతనుమెచ్చి, నగలతో సహా ఆమెను విడిచిపెడతాడు. అపుడామె సముద్రదత్తుని దగ్గరకి వస్తుంది. ఆమెలో సంభోగ చిహ్నాలు లేకపోవటాన్ని గ్రహించి, ఆమె శీలవతి అని ఆమెను భార్యగా స్వీకరిస్తాడు.

ఈ కథలో ఎవరు గొప్పత్యాగి – అని బేతాళుడు ప్రశ్నిస్తాడు. దానికి సమాధానంగా రాజు – దొంగయే త్యాగి. అనాసక్తురాలైన భార్యను వదిలిపెట్టాడు కాబట్టి సముద్రదత్తుడు త్యాగి కాదు. ధర్మదత్తుడు కాలాంతరంలో రాజువల్ల ఇబ్బందులొస్తాయేమోననే భయంతో వదిలిపెట్టాడు. కనుక అతడు త్యాగికాడు. దొంగ రహస్యంగా పనులు చేస్తాడు. పాపం చేయడానికి వెనుకాడడు. ప్రాణాలకు తెగించి దొంగతనం చేస్తాడు. అటువంటి దొంగ తనవద్దకు వచ్చిన స్త్రీరత్నాన్ని, నగలతో సహా విడిచిపెట్టడమే గొప్ప విషయం. కాబట్టి అతడే త్యాగి అని అంటాడు. ఇందులో చక్కని ధర్మసూక్ష్మం ఇమిడి ఉంది. తను పెండ్లాడిన భార్యను వదలకూడదు. అలాగని అనాసక్తురాలిని స్వీకరించకూడదు. కాబట్టి సముద్రదత్తుడు త్యాగం చేసాడు. వివాహిత – పరస్త్రీ – ఆమెను పొందుట అధర్మం. కాబట్టి ధర్మదత్తుడు త్యాగం చేసాడు. పరస్త్రీ సాంగత్యం

మహాపాపమని దాని ద్వారా సూచించాడు. దీనివల్ల సత్యవాక్యపరిపాలన విశిష్టత కూడ తెలుస్తోంది.

ఇలా కథల చివరి ప్రశ్న సమాధానాలలో ధర్మసూక్ష్మం , తర్కబద్ధత ఇమిడి ఉన్నాయి.

కవితాసంబంధంగా ఒకటిరెండు వర్ణనాదులను పరికిద్దాం –

10వ కథలో (పేజీ.63) సూర్యాస్తమయ, చంద్రోదయాలను ఒకేపద్యంలో ఇలా వర్ణించాడు.

**ఉ. అంత దినాధినాథుఁడపరాబ్ధికి జేరగ సాంధ్యరాగ వి**
**క్రాంతి నభంబు బెంపొనరగా నరుణచ్ఛవి దాట దిక్కులన్**
**సంతమసచ్ఛటావలి వెసం బ్రసరిపఁ జకోరబంధుఁడ**
**త్యంత నితాంతకాంతి నుదయంబొనరించె సుధాకరుండొగిన్.**

సూర్యుడు అస్తమించాడు. సంధ్యాకాలం. ఎర్రనికాంతి ఆకాశమంతా వ్యాపించింది. ఇంతలో దిక్కులన్నింట చీకటి ముసురుకుంది. అపుడు చంద్రోదయమయింది. ఇక్కడ సూర్యాస్తమయ, సంధ్యాకాల, తమోవ్యాపన, చంద్రోదయాల క్రమగతిని కవి చక్కగా ఒకే పద్యంలా వర్ణించాడు.

16వ కథ (జీమూతవాహనుని)లో గరుత్మంతుని రాకను ఓజోగుణంతో స్రగ్ధరావృత్తంలో ఇలా వర్ణించాడు.

**మ. పక్షద్వంద్వాగ్ర పర్ణప్రసృమర కిరణోపాంత చండాంశు తేజుం**
**దక్షీణోద్దండవేగాయత లయ పవనోగ్రానిలోద్ధూత సప్తా**
**బ్ధి క్షోభాక్షుద్రనాదోత్థితభయకలితార్తి త్రిలోకుండు లీలన్**
**పక్షీంద్రుండేగుదెంచెన్ ప్రసృమర రవి విభ్రాజుడై వ్యోమవీథిన్.**

ఆకాశంలో సూర్యునిలా ప్రకాశిస్తూ గరుత్మంతుడు వచ్చాడు. బంగారువన్నెగల ఱెక్కలు కలవాడు కాబట్టి అతడెగురుతూంటే ఆ ఱెక్కల

కాంతితో సూర్యుడిలా ప్రకాశిస్తున్నాడు. చాలా వేగంతో ఎగురుతూండడం వల్ల ఆతని రెక్కలవల్ల వెలువడే గాలిచేత సముద్రాలు అల్లకల్లోలమై భయంకరమైన ధ్వనిచే ముల్లోకాలు భయపడ్డాయి. గరుత్మంతుని రాకను, అతని వేగాన్ని సూచించడానికి కవి స్రగ్ధరావృత్తాన్ని స్వీకరించి దీర్ఘసమాస భూయిష్ఠమైన ఓజోగుణంతో పద్యరచన చేసాడు.

10వ కథలో ధనదత్తుడు మదనసేననుజూచి మరులుగొని విరహబాధాకరమైన సందర్భంలో –

**ఉ. ఆరని రౌద్రవహ్నిగల యంగభవుండు మనంబులోపలన్**
**దూరినయట్ల యెంతయును దుస్తర బాహ్యవియోగవేదనన్**
**దాని యనన్యవృత్తి ధనవంతుఁడు చిత్తములో ప్రియాంగనన్**
**జారగనీక మేని వివశత్వమునన్వెడ నిద్ర బొందుచున్.**

సాధారణంగా ప్రియావియోగంలో విరహబాధాగ్నిని భరిస్తున్నట్లుగా వర్ణిస్తారు. దానికి కారణం మన్మథుడు. అతడే మనోభవుడు. ఇక్కడ మన్మథుడు శివుడు తనను కాల్చిననాటి శివాగ్ని ఇంకా చల్లారకుండానే, ఇతడి మనస్సులో ప్రవేశించినట్లుందని కవి ఉత్ప్రేక్షించడం సహృదయ మనోరంజకంగా ఉంది.

16వ కథలో చంద్రోదయవర్ణనం ప్రాబంధికశైలిలో హృదయంగమంగా ఉంది –

**శా. చోరగ్రామ గజాంకుశంబు నళినీశుంభన్మదేభంబు ది**
**జ్నారీ మౌక్తికదర్పణంబు రజనీకాంతా మనోహారి య**
**ప్పారావార తరంగకారి గిరిజాప్రాణేశ భాస్వజ్జటా**
**శ్రీరమ్యాభరణంబు చంద్రుడుదయించెన్ సుప్రభాభాసియై.**

ఇది మరొక అందమైన చంద్రోదయవర్ణన – చంద్రుడు దొంగల గుంపనే ఏనుగుపాలిట అంకుశమట. కలువల పాలిట మత్తగజము. దిక్కులనే

స్త్రీలకు ముత్యాల దర్పణం. చీకటి అనే కాంతకు మనోహరుడు. సముద్రాలకు ఉత్తుంగతరంగాలు కలిగించేవాడు. పార్వతీప్రాణనాథుని (శివుని) జటాజూటానికి అందమైన ఆభరణం. అటువంటి చంద్రుడు చక్కని కాంతితో ఉదయించాడు.

ఈ చక్కని ప్రకృతి వర్ణన శృంగార రసోద్దీపన విభావంగా ఇక్కడ చేయబడింది.

20వ కథలో మరొక చంద్రోదయవర్ణన

**ఉ. అంగజవైరి శేఖర మనంగుని కంటెను నుబ్బు జారకో**
**త్తుంగ దవాగ్ని పాంథజనదుస్తరతా భయవేధ మానినీ**
**సంగమకారి సంతమసజాల విజృంభ నిరాకరుండు ది**
**వ్యాంగుఁడు రోహిణీశుఁ డుదయాద్రిపయిన్విలసిల్లె నెంతయున్.**

ఇది మరొక అందమైన చంద్రవర్ణన – చంద్రుడు మన్మథుని శత్రువగు శివుని శిరోభూషణం. మన్మథునికంటె అందమైనవాడు. జారులపాలిట దావాగ్ని. బాటసారుల భయాన్ని పోగొట్టేవాడు. స్త్రీలతో సంగమాన్ని కలిగించేవాడు. చిమ్మచీకట్లను పారద్రోలేవాడు, దివ్యాంగుడు, రోహిణీ హృదయేశుడు.

12వ కథలో యశఃకేతువు మృగాంకవతిని చూసిన సందర్భంలో ఇలా వర్ణించారు.

**మ. సలిలస్తంభము మీద హేమమయ వృక్షస్కంధభాగంబునన్**
**విలసన్నూతన రత్నతల్పము పయి న్వీణారవైకాంత మం**
**జుల గానంబును బాడుచున్న తరుణిం జూచెన్ జగన్మోహనా**
**లలితోదార విలాస విభ్రమ విభాలంకార శాతోదరిన్.**

ఇది ఈ కథలో కథానాయిక వర్ణన. సముద్రమధ్యంలో జలస్తంభం. దాని మీద బంగారు వృక్షం. దాని స్కంధం (కొమ్మమొదలుభాగం)మీద

రత్నతల్పం. దానిమీద అందంగా వీణాగానం చేస్తూన్న యువతి. ఆమె జగన్మోహనమైన మిక్కిలి మృదువైన విలాస విభ్రమాల కాంతితో విలసిల్లే సన్నని నడుముతో అందంగా ఉంది. అటువంటి ఆమెను నాయకుడు చూచాడు. ఇక్కడ జలస్థంభం – బంగారు వృక్ష స్కంధం – రత్నతల్పం– దానిపై వీణాగానం చేస్తున్న సుందరీమణి – ఇలా నాయిక ఉనికిని లలితరమణీయంగా వర్ణించాడు.

ప్రాబంధికశైలిలో రచన చేయగల సామర్థ్యం ఉన్నా, కథాకావ్యమవడంవల్ల దీర్ఘవర్ణనలు, ఆలంకారిక రచనజోలికి వెళ్ళకుండ, సముచిత రీతిలో కావ్యాన్ని రచించాడు. పాఠపరిష్కరణలో అర్థానుగుణంగా ఉన్న పాఠాన్ని స్వీకరించి, ఇతర పాఠాలను, అధోజ్ఞాపికలో ఇవ్వడం జరిగింది. తాళపత్రాలు శిథిలమైన కారణంగా, మరొక ప్రతి లభింపని కారణంగా అక్కడక్కడ రిక్తస్థలాలు ఉన్నాయి. ముఖ్యంగా 24వ కథలో సుమారు 11 పద్యాలలో ఈ స్ఖాలిత్యాలు కనబడతాయి. చిన్న చిన్న గణభంగ, యతిదోషాలను సవరించడం జరిగింది.

ఈ 'బేతాళ పంచవింశతి' కథలు వచనరూపంలో లభిస్తున్నాయే కాని పద్యకావ్యంగా ఇదొక్కటి మాత్రమే లభించడం విశేషం. వచనరూప కావ్యాలలోని కథల క్రమానికి ఈ పద్యకావ్యంలోని కథల క్రమానికి కొంచెం భేదం కూడా కనిపిస్తోంది. పాత్రల పేర్లలో కూడ కొంత భేదం ఉంది. ఇది కథాకావ్యమవడం చేత కాబోలు కథావిభాగమే కాని, ఆశ్వాస విభాగం గాని, ఆశ్వాసాంతగద్యకాని లేదు.

* * *

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | పీఠిక | v |
| 1. | పద్మావతి కథ | 12 |
| 2. | మందాకిని కథ | 20 |
| 3. | వసుమతీ ధనవంతుల కథ | 24 |
| 4. | వీరవరశూద్రకుల కథ | 35 |
| 5. | భోజన నారీశయ్యాసంగుల కథ | 44 |
| 6. | సోమప్రభ కథ | 47 |
| 7. | మదనసుందరి కథ | 50 |
| 8. | చండసింహకార్పటికుల కథ | 54 |
| 9. | అనంగలత కథ | 61 |
| 10. | ధర్మవైశ్యమదనసేనల కథ | 63 |
| 11. | ఇందురేఖాతారావతీమృగాంకదాత్రుల కథ | 72 |
| 12. | దీర్ఘదర్శి కథ | 74 |
| 13. | హరిస్వామి కథ | 83 |
| 14. | వీరవతి కథ | 86 |
| 15. | మనుస్వామి కథ | 89 |
| 16. | శంఖచూడ జీమూతవాహనుల కథ | 96 |
| 17. | యశోధనసేనాధ్యక్షుల కథ | 114 |

| | | |
|---|---|---|
| 18. | చంద్రస్వామి కథ | 118 |
| 19. | సూర్యప్రభ చంద్రప్రభల కథ | 122 |
| 20. | చంద్రావలోక విప్రకుమారుల కథ | 128 |
| 21. | అనంగమంజరి మణికర్ణుల కథ | 133 |
| 22. | విప్రకుమారుల కథ | 137 |
| 23. | దేవస్వామి కథ | 140 |
| 24. | వృషకేతు కందుకావతుల కథ | 142 |
| 25. | చండసింహుని కథ | 154 |


* * *

# బేతాళ పంచవింశతి

కII భువిగల సరసులు వినుఁడీ
వివరము బేతాళపంచవింశతి కథలన్
ప్రవిమలముగ విరచించెద
నవరసికులు భావమునను నర్మిలి మెచ్చన్ ॥ 1

సీII రజతాద్రి నేకాంత రమ్యహర్మ్యమునందు
బసిఁడి యుయ్యేలపయిఁ బవ్వళించి
సురతాంతమున నాథుఁజూచి [1]వేడ్క దలిర్ప
[2]నాదరంబున నిట్టులనియె గౌరి
కడు విస్మయంబైన కథ లానతిమ్మని
[3]యడుగుటయును చెప్ప నాత్మ[4]దలఁచి
[5]యెరిగి మున్నెవ్వరు నెరుగకుండెడునట్టి
యుపకథల్ గాని [6]నే నొల్లననిన

ఆII నల్లనగుచు నభవుఁడౌ గాక నే నీకుఁ
జెప్పువాఁడ నాత్మ కొప్పుగాఁగ
ననుచుఁ జెప్ప దొడఁగె [7]నంతలోననఁ బుష్ప
[8]దంతుఁడచటఁ బొంచి దాఁగియుండె. 2

కII హరునకుఁ బువ్వులు గొని తా
వెరవారగ వచ్చి కథలు వినియెడి కొఱకై
కరమర్థి గోడమీఁదను
పరికింపగరాని పసిఁడి బల్లైయుండెన్. 3

వII ఇట్లు పుష్పదంతుండు విస్మయకరంబైన విధంబునం బార్వతియు హరుండును నెరుంగకుండ కృత్రిమ భావంబునం గథలు వినుచుండం

1. రక్తి యొసంగ. 2. నానందము 3. యడిగియాయన. 4. దలఁచు. 5. తిరిగి. 6. యేనొల్ల.
7. నా సమయంబున. 8. పుష్పదంతుఁడనెడు పురుషుఁడొకఁడు.

బరమేశ్వరుండు రుద్రాణికిం బ్రియంబు వుట్టునట్లుగా నిరువదేను కథలు సాధించి మహాచోద్యంబుగాఁ జెప్పుటయు విని మనంబున నత్యాశ్చర్యంబంది మాయోపాయంబున నిజనివాసంబున కరిగి భార్యకుందన యున్న తెఱంగు వివరించి చెప్పిన మరునాఁడు [1]రేపటి యవసరంబునకు నభిరామ సౌరభంబులు గలుగు పారిజాతకుసుమదామంబులుంగొని వచ్చి యా దేవి పాదారవిందంబులకొరగి పుష్పదంతుని భార్యయయిన సైరంధ్రి [2]భామ యవధరింపుమని కరంబులు మొగిడ్చి యిట్లనియె. 4

కII విన నింపు వుట్టు నట్లుగ
వినుపింపఁగనేర్తు కథలు వివరముతోడన్
వినుమనుచు బుష్పలావక
యనుపమ[3]మతితోడ గౌరికన్నియు జెప్పెన్. 5

కII విని గిరిజ మనసులోపల
ఘనమగు రోషంబునొంది కరకంఠుని దా
గనుగొని యా తనకథలీ
యన్న చెప్పుటెల్ల నడకించుటకే. 6

వII అని యిట్లు భవాని నెయ్యంపుటలుకంజేసి పరమేశ్వరునితో బలుకకుండిన హరుండు తన దివ్యదృష్టింజింతించి.... ఓరీ దురాత్మా! నీవు మమ్ము మొరంగి కృత్రిమోపాయంబున కథలు విని పోయి సతికింజెప్పి మమ్ము నెడలుసేతువే? యని యుద్రేకంబున బలికి నీవు నీ సతిం బాసి బేతాళభూతంబవై.... వృక్షంబుననుండుమని శాపంబిచ్చిన భయంబంది వడంకుచు కరంబులు మొగిడ్చి యయ్యా! శాపమోక్షంబానతీయవే యనుటయు నమ్మహాదేవుండు వారిం గనుంగొని– 7

కII మనమున రోషము కృపయుం
బెనగొనుచుండంగ హరుడు ప్రీతుండగుచున్
నిను బాసిన సతిగనుటయు
మునుపటిరూపంబు గల్గు ముదమొప్పారన్. 8

1. రేపకడ. 2. జగజ్జనని. 3. ములు గాగ.

వ॥ అని ఈశ్వరుండు పుష్పదంతునకు శాపమోక్షణం బానతిచ్చిన సాష్టాంగ దండప్రణామంబులు చేసి కరంబులు మొగిడ్చి శిరంబునంజేర్చి వినతుండై యిట్లనియె, 9

క॥ అలిగియు నను రక్షించితి
కలగవు నా మీఁదను దయ గౌరీనాథా!
తలుపుము ప్రియమెపుడిటు మీ
రలు పలుకుల క్రియలు నే పరామర్శింతున్. 10

వ॥ అనవుడు నప్పరమేశ్వరుండానందభరితమానసుండయ్యె, నంత పుష్ప దంతుండును దన నివాసంబునకుం జని భార్యతో తనకైన వృత్తాంతం బంతయుంజెప్పి యిది దైవయోగంబు తప్పరాదు. దీనికి వగువం బనిలేదు. గావున, ననుగలయ విచారించి కూడునది యది వేర్పునకుం గల [1]పరియంబు [2]తెఱంగు చెప్పి యప్పు డదృశ్యుండై నర్మదాతీరంబునం గల మహారణ్యంబున నొక్క వటశాఖయందు వ్రేలుచున్నం గొన్ని సంవత్సరంబులు చనియె నంతట, 11

సీ॥ నాగపాశంబున నాడెంతయును శ్రమ
బొంది తోచినయట్టు బోయి, [3]పోవు
[4]ఎడబడి మూర్ఛిలి యెట్టకేనియు దేరి
యురుజ్జయినీ పురి కొయ్యజేరి
యతి తృష్ణకోర్వక యలసి పుష్కరిణి తీ
రమునకు వచ్చి నిర్మలజలముల
దోఁగియచ్చోట మృతుఁడుగా దలపోయు
నెడ నొక్క బ్రాహ్మణుం దేఁగుదెంచి

ఆ.వె॥ ప్రీతొనర్ప మహిత విషవేద[5]నాత్ముడై
యా సరోవరంబునందు మునిఁగి
తనువు విడుతుననుచు దలచుచు నతి భయ
[6]భ్రాంతుఁడౌ మహీశు భయము వాపి 12

1.కర్జంబు. 2.తెఱంగని 3.యొక్క 4.యెడఁబడి. 5.నార్తుడై. 6. భ్రాంతుడైన మహీశు భయము దాటి.

వ॥ గారుడంబైన విద్యంజేసి యవ్విప్రుండు రక్షించి మహాత్మా! నీవు కేవలుండవు గావు. దివ్యపురుషుండవు. నా యందు బేతాళోత్పాదినియగు విద్యగలదు నీ కిచ్చెదcబరిగ్రహింపుమనవుడు విప్రుండిట్లనియె. 13

కు॥ ఈ విద్య నీ [1]కవిషయము
గావించును సర్వమును జగన్నుత! నీ మి
తావాప్తి యగుట యంత య
నావిలమతి యతివిశుద్ధమై సిద్ధించున్. 14

వ॥ అది యెట్లంటేని, దత్తావధా[2]నంబై యాకర్ణింపుమని యిట్లని[3]చెప్పె. తొల్లి ప్రతిష్ఠానపురంబునందు విక్రమసేనుండను వాcడు ప్రఖ్యాతుండై యశస్తేజంబులం జంద్రాదిత్య తుల్యుండయిన రాజు గలండు. అతండు రాజ్యంబు సేయుచుండ నొక్కనాcడు [4]క్షాంతిశీలుండను శ్రవణభిక్షుండు సీతాగ్రహణార్థంబు వచ్చిన రావణుండునుం బోలె రాజసభకు వచ్చి యొక్క ఫలంబు దర్శనంబిచ్చినం బుచ్చుకొని కోశాధికారి చేతికిచ్చి మాయాభిక్షుతో [5]వినోదింపుచుం బ్రొద్దు [6]పుచ్చు చుండ, 15

కు॥ అది మొదలుగాcగ నిచ్చలు
సదమల ఫలమొకటి దెచ్చి [7]జగతీ పతికిన్
ముదమొదవగ [8]దగనిచ్చుచుc
బదియేం[9]డ్లుం గొలిచె నధికభక్తి యుతుండై. 16

వ॥ ఆ రాజతండు నిచ్చలు దెచ్చుఫలంబులు కోశాధికారి చేతికినిచ్చుచు నొక్క నాcటి పండుపుచ్చుకొని క్రీడావానరంబున కిచ్చిన నది దానిం గఱచి వ్రచ్చిన నందొక్క దివ్యరత్నంబు వెడలిన తత్ప్రభాజాలంబునంజేసి యాస్థానం బెల్ల ప్రజ్వరిల్లుచున్న యాశ్చర్యంబంది భాండాగారంబునకుంజని యందున్న [10]ఫలరాశి గలితంబులైన దివ్యరత్నంబులం జూచి, మరునాcడు యెప్పటి యట్ల సేవింప వచ్చిన భిక్షునకు నా రాజిట్లనియె. 17

1. విభీష్ట. 2. ధానుండవై. 3. చెప్పందొఁణంగె. 4. క్షాంతి. 5. వినోదభాషణంబులం. 6. పుచ్చి పంచెడెనంత. 7. జనపతికి మనో. 8. నిచ్చుచు నటు. 9. యేcడులు. 10. జలరాశి.

తే॥ ధర నమూల్యములైన రత్నములు దెచ్చి
యిచ్చి యింతకు మిక్కిలి యేమి వడయ
దలఁచి కొలిచెదు నీదు యత్నంబు బహు వి
చిత్రమై యున్న దిది యేమి చెప్పుమనుడు. 18

వ. తన కార్యసిద్ధియందు [1]గృతాదరుండైన యా రాజునకు భిక్షుం
డిట్లనియె. 19

చ॥ అనఘ[2]చరిత్ర! మాదృశుల యాపదమాన్చి యభీష్ట వస్తువుల్
[3]దనరఁగ నిచ్చి శౌర్యమును ధర్మము సత్యముగల్గి లోకమున్
మనుఁపగ [4]బుట్టియున్న ధృతిమంతుల [5]నాశ్రితధర్మవృద్ధి స
జ్జనయుతులన్ నృపోత్తముల సత్యసమేతుల వేఁడుటొప్పదే. 20

సీ॥ క్షితినాథ [6]వినుము యీ కృష్ణచతుర్దశి
నాఁటి [7]రేయి శ్మశానంబు నందు
శక్తి [8]మై [9]నొకమంత్ర సాధన[10]మేఁజేయఁ
గణఁగిన వాఁడ నక్కార్యమునకు
నాకుఁదో[11]డైవచ్చి నరవర! రెండవ
సాధకుండవు గా[12]ను సత్య[13]మెసగ
[14]నా ప్రదేశమున మహావట[15]వృక్షంబు
[16]మొదట నేనుండెద [17]మున్నె పోయి

ఆ॥ నీవు రాత్రిరమ్ము నిర్మల [18]ఖడ్గంబు
కరము నొడిసిపట్టి కడు రయమున
నొక్క[19]రుండవును సముజ్వలాకృతి తోడ
ననిన నియ్యకొనియె నవని విభుఁడు. 21

వ॥ అంత, 22

---

1.గృపారతుం. 2. భవాదృశుల్ పరుల. 3. దనియఁగ. 4. బుద్ధి. 5. లలంఘ్యవినీతి కర్మ సంజనితులన న్నృ. 6. వినవె. 7. రేయిని. 8. కై. 9.యొక. 10. సేయంగ. 11. దోడె తెమ్ము నరవీరుఁడవు నీవు. 12.న. 13.చరిత. 14.యా. 15.ప్రాంతంబు. 16. నందాశ్రయిం చెద. 17. ముందు. 18. తీవ్రఖడ్గమ్ము వెరికి. 19. రుడువు వెడలి యు.

కు॥ ఆ కృష్ణ చతుర్దశి నాఁ
దేకాంతమ భిక్షుఁడచటి కేఁగుటయును ధా
త్రీకాంతుఁడు సాయంసం
ధ్యాకాలము లోన దీర్చి యత్యు[1]త్సుకుఁడై. 23

సీ॥ యక్షకర్దమ యుక్తమైన భస్మాంగంబు
పెలుపొందఁగా నెరపూఁతపూసి
భూరి[2]ప్రకాశిత పూత విభూతి [3]పౌం
డ్రకముపై రోచన రచన బెరయ
విమలారుణ[4]ప్రభావములైనట్టి సం
ధ్యారాగవస్త్రంబు లమరఁగట్టి
రక్షాకరంబులు రమణీయములు నైన
[5]పృథులనీలంబుల పేర్లు వేసి

ఆ॥ వీరరసము పొంగి [6]వెలివచ్చెనాంగ స
మున్నతాంగ కాంతి యుజ్వలముగ
విక్రమాంబునిధి త్రివిక్రమసేనుఁ డొ
క్కరుఁడు పితృవనంబు కడకు గదలె. 24

వ. మఱియు నతండు మేరునగంబునుంబోలె వజ్రకటాకృతుండై మధుసమయం బునుంబోలె పుష్పోల్లసిత వనమాలాలంకృతుండై సముద్రుండునుంబోలె ప్రభూత సత్వ నివాసుండై గోపవేషధారుండైన కృష్ణుండునుంబోలె మయూర పింఛోల్లసిత శిరోవేష్టకుండై ప్రళయకాలు నాలుకయుంబోలె నాభీలంబైన కరవాలంబు కేలంబ్రజ్వరిల్ల నీరంధ్రంబైన యంధకారంబునందు [7]మణిమండలప్రభలు మార్గదర్శనంబులుగా వెడలి స్మశాన క్రీడారతుండయిన రుద్రుండునుంబోలె తత్ప్ర దేశంబునకుంబోయె నదియు ధూమాంధకార [8]మేదుర ధ్వాంతంబును, సకల భూధర వ్రాతకలకలా

1. గ్రుండై. 2. ప్రభాజాల. 3. పుండ్రంబుపై గోరోచనంబు పెట్టి. 4. న్వితములైనట్టి సం. 5. ప్రకటరుద్రాక్ష మాలికలుదాల్చి. 6. వెల్లివిసరెనాఁగ. 7. మణికుండల ప్రభాపుంజంబులు. 8. బంధురంబును.

కులితంబునుం, సమిధానల ప్రకాశితంబును, పిండాస్థానంబును, బహుపిశాచ నిశాచర దారుణంబును, గరతలోల్లోలగాయత్పిశాచ జీవాక్రాంతా[1]నంద శిలాతలంబును ప్రతివృక్ష ప్రవిష్టబ్రహ్మరాక్షస హుంకారభయంకరంబును యాతాయాతాప్రవృత్తోత్తాల [2]భేతాడగణసమేతంబును, ఘూకభీకర ఘూత్కార పూరితంబును నిరంతర ప్రవర్తిత మృగ ధూర్తధ్వాన [3]తుశిత దిగంతరంబున [4]దిగంతరబకాకారంబై భైరవమారణప్రకల్పిత చండాకాండంబును రక్తాసక్త నృత్త ఢాకినీ నికాయంబునునై మఱియు శరీరంబునుం బోలె సర్వావయువ మయంబై [5]వినిపాదిత హాసాస్ఫుటితంబైన దేశంబునుంబోలె [6]నిజవృక్షా వృత్తిందనరి కౌశిక సవనంబునుంబోలె మారీచరణరుధిరస్రావంబై కర్ణ శల్యోత్థితరవంబై గదాయుద్ధంబునుంబోలె రుధిరపూరిత వృకోదరంబై వృకోదరుచిత్తంబునుం బోలె దుశ్శాసన హృదయా కంపితంబై దండకారణ్యం బునుంబోలె మారీచ రుచిరాశ్రమంబై అవివేకి హృదయంబునుంబోలె శంకా తంక నికేతనంబై భ్రాంతకంబయ్యును నిరంతరంబై శివాభి వ్యాప్తంబయ్యును నశివంబైన శ్మశానంబు నిశ్శంకుండై చొచ్చి వటమూలంబునందు విజిత మండల మండనుండైయున్న యొప్పుచున్న క్షాంతిశీలునివాసంబుచేరి యతనిం గని నమస్కరించి నేఁ జేయంగల కార్యంబేమి యని యడిగిన నతండును నరేంద్రుం జూచి [7]హర్షవ్యాకోచనుండై యిట్లనియె. 25

శా॥ వీరాగ్రేసర నీదు [8]పూనుపుధరన్ వీరత్వ ధీరత్వ గం
భీరత్వంబున నెన్న [9]బోలుపురుషుల్ పెంపున్ యశంబు న్మహో
దారత్వంబును దేజమున్ [10]జయము సత్యంబెన్న నీకుందగున్
శ్రీ [11]రామాధిపమూర్తి సర్వజన సంసేవ్య ప్రభావోదయా. 26

వ. అని యన్నరేంద్రు గుణకీర్తనంబు చేసి మఱియు నిట్లనియె. 27

క॥ ఇచటకొక యేరు[12]మేలను
ప్రచురమహాశాఖి శింశుపావృక్షము భూ

1.నంత. 2. బేతాళ. 3. పూరిత. 4. దిగంత భారాకార మారి(హర) గణ కల్పిత చండ తాండవంబును. 5. వినిహతసాల ప్రదేశంబునుంబోలె. 6. ద్విజవరా. 7. హర్షోత్ఫుల్లనయనుండై విక్రమసేనున కిట్లనియె. 8. సమానులె. 9. నెట్టి. 10. న్విజయమున్ దత్వంబు. 11. రామాంశజ. 12. నే.

తచయాత్రయ మున్నది నీ
వచటికి [1]బోవలయు దక్షిణాభి ముఖుఁడవై. 28

వ॥ ఆ వృక్షంబునందొక్క నరుండు వ్రేలుచున్నవాఁడు. వాని దేవలయు ననిన నట్లసేయుదునని ప్రవృద్ధంబైన తమకంబున ప్రకాశార్థంబొక కొరవి వట్టుకొని నీచుండునుం బోలె కుంఠితుండై దరిద్రుండునుంబోలె విచ్ఛాయంబై కుకవి కావ్యంబునుంబోలె నవిస్పష్టంబై పిశాచంబునుంబోలె విషణ్ణంబైన విశాలంబైన యా వృక్షంబునొద్దకుం బోయి 29

తే॥ దాని కొమ్మల నగ్రపాదము దగల్చి
దీర్ఘబాహులు రెండును [2]దిశలఁజాచి
యవుడు గఱచి యధో[3]ముఖుండైన ఘోర
శవము గనుగొని నృపతి నిశ్శంకుఁడగుచు. 30

వ. యా వృక్షంబు నెక్కి శవంబు కరంబులందున్న పాశంబులుం గోసి నేలంబడఁద్రోచిన హాహా రావంబులెసగ నాక్రోశింపుచు నాకరంబులు భగ్నం[4]బయ్యెనని యేడ్చుచున్న నిక్కువంబుగా వగచి యన్నరేంద్రుండు వృక్షంబు డిగ్గి వచ్చి కరుణాకలితచిత్తుండై వాని శరీరంబు దోముచున్న యప్పుడవాఁడు వికటాకారుండై, 31

క॥ భూతములకైన [5]యప్పుడు
భీతి జనింపంగ నెగసి బిట్టుగ నగుచున్
భూతలపతికి నదృశ్యుం
డై తీగలనడుమ దూరె నతిరభసమునన్. 32

వ. అన్నరేంద్రుండును వాని పిఱుంద జొంపంబు దూరి యెప్పటియట్ల వృక్షంబు మీఁదికింబోయి పాశంబులు మెడదగిలిచికొనియున్న వానింజూచి బేతాడ మాయగా నెఱింగి క్రమ్మరను వృక్షంబునెక్కి బేతాడ రూపధరుండైన వాని నా లతాపాశంబులం[6]గట్టుకుని డిగివచ్చి భుజశిఖరంబులపైఁ బెట్టుకొని వచ్చుచున్నయెడ నన్నరేశ్వరునకు బేతాళుండిట్లనియె. 33

---

1.వెసబోయి. 2.దెస. 3. ముఖంబై. 4. భగ్నంబులయ్యె. 5. మిక్కిలి. 6. గట్టిపట్టు.

క॥ నీకొక కథ చెప్పెద సు
శ్లోక వినోదము [1]వినగ జోద్యంబదియున్
శ్రీకర [2]మెల్లను బొందును
[3]యాకర్ణింపుము సుబుద్ధి[4]నని యిట్లనియెన్. 34

క॥ వారాణసి యను పేరం
గౌరీకృతమైన పురము గలదు హిమాద్రి
స్ఫారస్ఫాటిక విమలా
[5]గారంబున ధరణియందు గడుబెడగడరన్. 35

క॥ అందులకుఁ బ్రతాపమకుటుఁడ
[6]నందగి తొలిగలఁడు, రాజు నరవినుతుఁడు స
త్సుందర నిజప్రతాప రు
చిం దనరు నభంబు[7]నరవిచెందిర భంగిన్. 36

క॥ ఆ మనుజేశ్వరు కులసతి
సోమప్రభ గలదు వినుత సోమప్రభ యు
ద్దామమతి వారి కొడుకు ర
మామహితుఁడు గలఁడు వజ్రమకుటుండనఁగన్. 37

క॥ కందర్పయాదవేంద్రుల
సౌందర్యము [8]చెప్పనతని సౌందర్యము [9]చే
బొందు పడుననుచు ధరఁజె
[10]ప్పందగి యలరురూపమహిమఁ బరగునతండున్. 38

క॥ ఆ రాజకుమారునకును
దారుఁడు సఖుఁడయ్యె మంత్రి తనయుండు గళా

---

1. వినంగ. 2. మల్లన పోవుద. 3. మా. 4. నది యెట్లనినన్. 5. కారంబున. 6. నందొల్లి గలండు 7. నుద్ది చెందిన. 8. చెప్పి యతని. 9. చెప్పందగు ననిజనులు నుతిం. 10. పందగిన స్వ(సు).

[1]పారగ సమ్మతి బుద్ధిశ
రీరుండను నతఁడు గరము ప్రియకరుఁడగుచున్. 39

వ॥ ఆ రాజపుత్రుండొక్కనాఁడు మంత్రిపుత్రుందోడ్కొని మృగయా వినోదార్థం బరిగి [2]శార్దూలసింహశరభ కురంగభల్లూక వరాహ వనలులాయాకులంబైన యరణ్యంబు చొచ్చి [3]వారు క్రేంకారవంబు సహింపఁజాలక తమపై బరతెంచు వాలు [4]మృగంబులం జంపి పుష్పలతావళీ వేల్లితంబైన వనమధ్యంబు చొచ్చి దాని కనతిదూరంబునం బరి[5]స్ఫుటోజ్వల ప్రభాభాసితంబై వనదేవతా విభ్రమ దర్పణంబును బోలె నొప్పు సరోవరంబునకు వచ్చి యక్కొలని తీరంబు నందు కీడార్థంబు [6]డాసి సహస్రావృతయై కువలయచ్ఛాయాపహాసైకకటాక్ష విక్షేపం బులు వనస్థలు లలంకరింపుచుండ మఱియును, 40

క॥ పద్మరాగ బింబ బంధూకముల చుట్ట
మైన యట్టి సురుచిరాధరమున
లలితరుచులు దన విలాసాబ్ధి బవడంపు
తీగలెనయునట్లు దీటుకొనఁగ. 41

వ॥ మఱియు ముఖపద్మవిలాసంబును నయనకహ్లార సౌంధర్యంబును కుటిలకుంతలభ్రమరవిభ్రమంబును పయోధరరథాంగబాహుమృణాల లావణ్యంబును నాభిగాంభీర్యజల భ్రమంబును పృథుకటీపులినంబును మణి నూపురక్రేంకార హంసనాదంబులు కలిగి యనంతకాంతినివాసంబై యా కొలనితోడం జెలిమిసేయ వచ్చిన జంగమకమలినియుంబోలె, నయనానందం బొలయ నొప్పుచున్న యక్కన్యంజూచి యుల్లసితమానసుండై నరేంద్ర నందనుండచ్చోటుంగదలకయుండె నంత, 42

క॥ ఆ లీలావతి కాంచెను
బాలార్క ప్రతిమతేజు ప్రద్యుమ్ననిభున్
[7]మాలాలంకృత కంధరుఁ
[8]బోలన్ తన దిక్కు చూచుభూపాలసుతున్. 43

1. పారంగతుండు. 2. శరభసింహకరిశార్దూల భల్లూక వలనలులాయ కురంగాకులంబైన. 3. చాప. 4. మెకం. 5. ఫుల్లాబ్జ. 6. దాసీ. 7. జ్యాలంకృత చాపధరున్. 8. బోలగ.

క॥ బాలానిలమున మెల్లన
తూలెడు మృదులతిక వోలె తోయజముఖి యా
లీలావతి బలుమారును
లోలమతింజూచె[1]దడిత లోలేక్షణయై. 44

వ॥ తదనంతరంబ, 45

సీ॥ రాజపుత్రుఁడు చూడ రమణీయ [2]తత్సర
సోవృతంబైన నీలోత్పలంబు
కర్ణంబులందిడి క్రమ్మర నద్దాని
నమరంగ దంత రత్నముల మోపి
ఖండించి పాద[5]యుగ్మముపైని సవిలాస
ముగ వైచి లీలతో [4]మగుడి బుచ్చి
ఘన కుచంబుల మీఁద గదియించి [5]కుప్పించి
[6]తలఁపులు సూటించి తడయకపుడ

ఆ॥ [7]అచటు వాసిచనియె నానందమూర్తి[8]తో
వనిత లలితవదన వనరుహమున
విభ్రమిత కటాక్షవిక్షేపమున రాజ
తనయు చూడ్కులకు ముదంబు [9]వొదుమ 46

క॥ తన మందిరంబునకు జని
మనుజేశ్వరసుతుని నెపుడు మది దలపుచు మ
ర్వని[10]కామ తాపమున నం
గన డస్సెను తూర్పుచంద్ర[11]కళయుంబోలెన్ 47

వ. అట వజ్రమకుటుండును నిజనగరంబునకుంబోయి యనన్యకార్యుండై యయ్యింతినిం [12]దలంపుచు ప్రతిదిన ప్రవర్ధమాన మనోభవానల [13]తాద్య మాన

1. లలిత. 2. మణీ యచట నుజ్వలంబైన రక్తో. 3. యుగ్మంబుపైన విలాస. 4. మగుడ. 5. కప్పించి. 6. వంచన తలఁపు సూచించి తడయ. 7. కచటు. 8. యై. 9. వొదల. 10. కామా నల. 11. రేఖయు. 12. దలంచుచు. 13. బాధ్య.

మానసుండగుచు బాలప్రవాళ శయ్యా[1]స్థుండయి యున్న నెరింగి మంత్రి సుతుండైన బుద్ధిశరీరుండు వచ్చి దేవా! ధైర్యసాగరుండవైన నీ ధైర్యంబునకిది యేమి యపాయంబు పుట్టెనని [2]యిట్లనియె. 48

కII ఆ చెలువ యెచటిదో యని
యీ చింతానలముబొంద నేటికి నీకున్
సూచించె నపుడు సర్వము
నా చే నెరుగంగబడియె నా క్రమమెల్లన్. 49

వII ఆ యింతికర్ణంబుల నుత్పలంబు వెట్టుకొనుటంజేసి కర్ణోత్పలుండను రాజు కళింగదేశాధీశ్వరుండనం బ్రసిద్ధుండైయుండు, ఆ పుష్పంబుదంతంబుల ఖండింపుటంజేసి రాజునకు సచివుండైన దంతఘట్టకుని కూఁతుర ననుటయు దాని పాదపద్మంబుల మీఁదంబెట్టుకొనుట తన పేరు పద్మావతి యనుటయు ఆ యుత్పలంబు తన హృదయంబున నదిమికొనుట నీవు తన హృదయే శ్వరుండ వని యెరింగించుటయు ఇందు సందేహంబు లేదు. మృగయా ఛలంబున క్రమ్మరంబోవలయుననిన నా రాజకుమారుండపుడు యతనిందోడ్కొని,50

ఆII రాగియై నిరంతరంబును [3]ప్రియజనా
యత్తచిత్తుఁ[4]డగుచు నతిరయమున
కదలె దూరమనక కామాంధులకు [5]నల
భ్యంబు కలదె యెంత గహనమైన. 51

వII ఇట్లిరువురునుం గళింగ నగరంబునకుంబోయి యుందొక్క వృద్ధాంగనంబొందు చేసుకొని దాని [6]యింట విడిదిచేసి యేకాంతంబున నక్కాంత తోడ దంత ఘాటకుని నెరుంగుదువే యని యడిగిన నెరుంగుదు నతండీ రాజునకు సచివుం డతని కూతురు పద్మావతి యనంగలదని చెప్పి వెండియు నిట్లనియె. 52

కII వారలకు గర్భదాసిని
[7]వారాశ్రయమందు నెపుడు వర్తింతు సదా

---

1. శయ్యాశ్రయుం. 2. పలికి మఱియుని. 3. తత్ప్రియా. 4. డగుట. 5. నశక్యంబు. 6. విడిది యందుండి. 7. వారలనే యాశ్రయించి వర్తింతు సమా.

చారంబు కులము నెరుఁగుదు
మీరెవ్వ రిదేమి కార్యమెరిఁగింపు డొగిన్. 53

వ॥ అనిన దాని వలన సంతోషించి యాప్తీకరించి తమ వచ్చిన కార్యంబు సర్వంబును నెఱిఁగించి దానిన దూతికం [1]జేసి పద్మావతి యున్నచోటికిం [2]బంపిన నదిపోయి కొలనికడకు వచ్చిన రాజకుమారుండు వచ్చియున్న వాఁడని పద్మావతికిం జెప్పిన దానిం జింతింపనిదియునుంబోలె మిథ్యాకోపంబు దెచ్చుకొని దానికిట్లనియె. 54

క॥ నా కిట్టి మాట చెప్పఁగ
నీకుఁ దగునె ముదుక వరుసనీతియె యిది యా
హా! కదు దుశ్శీలవు నను
[3]పోకులఁబుచ్చంగఁ దగునె పురుషు[4]లని మదిన్. 55

వ॥ అని యాగ్రహించి కర్పూరరజోమిళితంబైన హస్తపల్లవంబులు రెండు గండస్థలంబుల వ్రేసిన దుఃఖింపుచు గృహంబునకు వచ్చి [5]తన చెప్పిన [6]కార్యంబున కయ్యింతి కోపించి తన్ను వ్రేసిన చందంబిరువురకుం జెప్పిన విని రాజపుత్రుండు దుఃఖితుండయి నిశ్వాసముఖుండగుచు మంత్రి పుత్రున కిట్లనియె. 56

ఉ॥ అక్కట మందభాగ్యకృత యత్నములేల ఫలించు నెచ్చటన్
నిక్కము దైవతోపహతి నీకు మరల్పఁగ[7]రాదు యింక నీ
విక్కడ [8]వాసినన్విడిచి యేఁగుము భూమికి దీని యందు నా
మక్కువ [9]చిక్కియున్నయది మాన్పఁగఁ బోలదు దుశ్చికిత్సలన్. 57

వ॥ ఎటయేనియుం బోయెదననిన నమ్మసలిది వినకుండ మంత్రిపుత్రుం డిట్లనియె. 57

క॥ ఆర్య! [10]హితమతివి, కడు నీ
ధైర్యము దిగవిడచి యింత తగునే యడలన్

1. గావించి. 2. బంచిన. 3. పోకలఁ. 4. దని. 5. తా. 6. వాక్యంబు. 7. లావె. 8. నుండి. 9. యెక్కి. 10. స్తుతమతి.

కార్యముఖ మెరుఁగవలదే
కార్యంబిది నీకు సిద్ధకల్పంబయ్యెన్. 59

వ॥ అది [1]యట్లుండనిమ్ము యిమ్ముసలిగండస్థలంబులయందు కర్పూర రజస్సహితం బైన యయ్యింతి హస్తాంగుళంబులు [2]పదియునికింజేసి శుక్లపక్షంబింక పదిదినంబులు గల [3]విటమీఁద కృష్ణపక్షంబునకు సమా[4]గమంబు గలుగునని చెప్పుటయన విని యతని వచనంబులకుం బ్రహృష్టహృదయుండై యా పదిదినంబులు యెట్టకేనియుం బుచ్చి మరునాఁడు యమ్ముసలిం [5]బుచ్చినం బద్మావతియు దాని పలుకుల [6]నాదరింపక కుంకుమాంకితం[7]బులైన హస్తంబున నమ్ముసలి యురంబునందుం ద్రిపుండ్రంబుగా వ్రేసినం [8]దదంకి తయై గృహంబునకు వచ్చి యక్కన్య గినిసి తన్నువ్రేసిన చందంబు చెప్పిన మంత్రిపుత్రుండు సోత్కంఠుండై దానిని వసదనంబున ననునయించి శోకోత్కంఠుండైన రాజకుమారునకు నేకాంతంబున నిట్లనియె. 60

క॥ తానిపుడు రజస్వలనని
దీని [9]యుదరంబునను వ్రేసి తెలుపుట గాదే
మానైన మూఁడురేఖలు
[10]మానిని నిలువంగ చెప్పె మానుగ నీకున్. 61

ఆ॥ [11]ఆ యమాత్యతనయు డట్లెరింగించిన,
నతి [12]దినంబుఁ బొంది యధిపసుతుఁడు
నాఁడు మొదలుగాఁగ మూఁడుదినంబులు
[13]గడపె నేండ్లుమూఁడు గడపినట్లు 62

వ॥ నాలవదినంబున నెప్పటియట్ల దానింబుచ్చినంబోయి యక్కన్య దన మాట లాదరించి చేసిన సత్కారంబుచెప్పి రాజగజంబు మదించి గవని వెలుపల నున్నయది యందు బోరాదు యిందువొమ్మని యొక్క రజ్జువుగట్టి మేడ దించి పుత్తెంచెనని

1.ట్లంటేని. 2. యుండుట. 3. దట. 4. బని. 5. బంచిన. 6. నాలకింప. 7. బైన. 8. దుఃఖితయై. 9. రము వ్రేసి నీకు. 10. పూని నిలుపు మనియె మూఁడు ప్రొద్దులు నిన్నున్. 11. అని. 12. ముదంబు. 13. కడఁగి యేండ్ల యట్లు గడపె మరియు.

చెప్పిన విని మంత్రి పుత్రుండు సంతుష్టుండై రాజపుత్రు మొగంబు చూచి నిన్నారజ్జువెక్కి రమ్మన్న యది నీ వచ్చోటికిం బొమ్మ[1]నిన నతని యనుమతంబున, 63

కః ఆ రజ్జువు నెక్కి ప్రియా
గారమునకుఁ జనియె చేటికలు దిగిచికొనం
గా రాత్రి విశేష ప్రే
మారూఢ మనస్కుఁడగుచు నతిరభసమునన్. 64

వ. ఇట్లరిగి సుప్త[2]జన పరివృతంబయిన యంతఃపురంబు సొచ్చి, 65

కః సుందరనవరత్నప్రభ
నిందు శిలాకుట్టిమమున నింపగు లీలా
మందిరమున మణిశయనము
నందున్న లతాంగి గాంచె నక్కన్యకయున్. 66

వః శయ్యాతలంబు వాసి లజ్జావనత వదనయుం గంపమాన పయోధర విన్యస్త హస్తయుం బరిస్ఫురిత విభ్రమ [3]విలాసితముఖియునై, తొలంగి నిలిచినం జేర నరిగి యా [4]రాజునిట్లనియె, 67

కః నా మానస దుగ్ధాబ్ధికి
సోమప్రభయగుచు నీదు చూడ్కులు వొలయం
గా మొగమెత్తి సలలిత వ
చో మాధుర్యంబు చెవులఁ జొనుపవె దయతోన్. 68

ఆః అనుచు రత్నపాత్ర [5]యందున్న సురభి గం
[6]ధంబుదానిమేని కనునయముగఁ
[7]దనియ నిచ్చి వేడ్కఁ దాను నాస్వాదించి
[8]మదనమద విలోల మానసమున. 69

1. నుటయు రాజకుమారుండు. 2. పరిజనంబయిన. 3. విలాసయునై. 4. రాజకుమారుండి. 5. మందున్న. 6. ధావసంబు దాని కననుయంబు. 7. దనర. 8. మధుసమద.

ఆ॥ కౌఁగిలింప నతని [1]కరమహాగ్రహణని
మీలి[2]తాంతరంగయై లతాంగి
మధుమదానురక్త మధు[3]కరంబొలుచు చుం
బన విధిప్రయోగమున[4]ను సొగసి. 70

వ॥ అంత నా కృత్రిమ విలాసంబును అశిక్షిత కళాక్రమంబును [5]అవిభాంగాంగాను భవంబునునైన సంభోగంబునం[6] బ్రవృద్ధయై రాజకుమారు చిత్తవృత్తాపహారి యగుచుండె, నవ్విధంబునంబెక్కు రాత్రులు నిరువురి కతిగూఢంబయిన సమాగమంబయ్యె. నంత నొక్కనాడు రాజపుత్రుండు [7]వెలినున్న మంత్రి పుత్రుందలంచి, 71

తే॥ తల్లిదండ్రుల సకల బాంధవుల నెల్లఁ
దొరఁగి పరదేశమునకు నాతోడ వచ్చి
యొక్కరుఁడు మంత్రి సుతుడెటులున్న వాఁడొ
యనుచు జింతించి మిన్నక యధిపుఁడున్న 72

వ. అన్యమనస్కుండగుట యెరింగి యిదియేమి? చింతించెదవని యడిగి యక్కథయంతయుం జెప్పించుకొని యిట్లనియె, 73

క॥ నీకు మనఃప్రియుండై
వీకను నా యింగితంబు వివరించి తగం
జేకొని చెప్పగనేర్చు వి
వేకముగల సఖుని [8]కింత విముఖుఁడ వగుదే. 74

వ. అతండు నాకు మాన్యుండ తనకిష్టంబైన శిష్టభోజనంబు వెట్టుమని పంచిన గొనివచ్చి వివిధంబులైన [9]భక్ష్యమాల్యాను తాంబూలాది పదార్థంబులు, మంత్రి పుత్రునకిచ్చి తమ యిద్దరి సల్లాపంబులు నెరింగించిన నతండు భక్ష్యంబులు చూచి రాజపుత్రునకిట్లనియె. 75

---

1. కంఠగ్రహానంద. 2. తా ర్ధనయన మెలతయపుడు. 3. మధురతంబొలచు. 4. కు. 5. భాగ శుద్ధాంగంబు. 6. దువృద్ధ. 7. వెలుపటనున్న. 8. యిట్లు విడుతువె యకటా! 9. భక్ష్యంబులిచ్చి పంచిన నవిగొని వచ్చి.

కII నను దలచి నీవు పొగడం
జనునే? యా దయిత యెదుర జనవల్లభ నం
దన! యింత జడుఁడవగుదే?
వినవే భక్ష్యంబులివియు విషదిగ్ధంబుల్. 76

వII [1]రాజపత్నులయిన స్త్రీలు భర్తలకు ప్రేమమూలంబులయిన వారి కలిమి సహింపరు నీవు నమ్మవేనిం జూడుమని యా భక్ష్యంబు యొక్క శునకంబునకుం బెట్టిన భక్షించి యది యప్పుడ ప్రాణంబులు విడిచినం జూచి యా రాజపుత్రుఁడా యింతివలన నెంతయుం గోపించి నిలిచె నట్టి యవసరంబున తత్పురేశ్వరుండైన కర్ణోత్పలుని ప్రియతనయుండు కాలనియోగంబునంజేసి [2]కాలాంతరంగుండై నందత్కలకలంబు విని మంత్రిపుత్రుండు రాజపుత్రున కిట్లనియె. 77

కII మతి గినుక వలదు పద్మా
వతి దెస నీ రాత్రివోయి వరమధు మదసం
యుతజేసి యెరుఁగకుండగ
నతిరయమున నపహరిం[3]చు మా భూషణముల్. 78

వII [4]ఆ తొడవులు పుచ్చుకొని త్రిశూలాంకంబు [5]లాంఛనంబు గోరవ్రాసి వచ్చునది యనిన నట్ల సేయుదునని పోయి మధుపానమత్తయైన దాని లోతొడ ద్రిశూలాకారంబొనరించి యా తొడవులన్నియుం గొని వచ్చినం జూచి యిద్దరును సిద్ధవేషంబులు ధరియించి యందొక్క హారంబు విపణి వీథికిం గొంపోయి యమ్ముమని రాజపుత్రుని చేతికిచ్చి. 79

కII ఈ హారంబమ్మెదనని
బేహారుల కెల్ల జూపు [6]ప్రియమున విలువన్
[7]దోహలులై వచ్చుటయున్ (ను)
నిహితమతి [8]దెగునీకు మెవ్వరికైనన్. 80

---

1.రాగవతు. 2. లోకాంతరగతుండైన కల. 3. హరింపుమప్పుడు తొడవుల్. 4. పదంపడి దాని లోదొడ. 5.గాంఛ. 6. వడి గొనగా. 7. మోహితులై. 8. దెగువయాడు(నీకు).

ఆ॥ హారమెవ్వరి [1]దని యడిగిరేనియునట
భిక్షుఁడమ్మె[2]దునని (నుచునా) పేరు చెప్పి
[3]యతని దెత్తుగాకయని ప్రీతి వనమున
[4]కరిగెమంత్రిసుతుఁడు నంతబతియు. 81

వ॥ వేరొండు రూపంబు చేకొని మౌక్తికవలయంబు గొనిపోయి విపణివీథిం జూపునెడ కొందఱు రాజపురుషులిది యెవ్వరి హారంబని యతని రూపంబు జూచి శంకించి యడిగిన నతండు ఈ హారంబు భిక్షునిదని చెప్పిన నతండెచ్చట నున్నవాఁడో మాకు జూపుమనుచు వారు తర్జనాపూర్వకంబుగా నడిగిన నతండు వారిందోడ్కొని [5]వచ్చి విప్రవేషధరుండయిన మంత్రిపుత్రుం జూపిన (వీరు మా గురువులు వీరి యర్థంబిదియని చెప్పిన) వారలా భిక్షునకిట్లనిరి. 82

క॥ మీ రె[6]వరీ మణిహారము
చేరిన తెఱఁగేమి మాకు చెప్పరె యనినన్
మీ రాజువచ్చి యడిగెడు
మీరడుగగ వలదు పొండు మీ పతికడకున్. 83

ఆ॥ అనిన వారు పోయి యట్ల జెప్పుటయు గ
ర్ణోత్పలుండు భిక్షునొద్దకరిగి
భక్తియుక్తుఁడగుచు బ్రణ[7]మిల్ల నతని దీ
వించి యిట్టులనియె వికృతవేషి. 84

క॥ భూనాథ! [8]నీ పురంబున
మానవు లొరు లెరుఁగకుండ మరుపడి యొకచో
దానవి యున్నది యెరుఁగవొ
కో? నిక్కము దంతఘాతకుని [9]కూఁతనుచున్. 85

వ॥ అది రాత్రియెల్లను దిగంబరియై వచ్చి శిశువుల వధింపునది మొన్న నీ పుత్రునకపాయంబు చేసినం గోపించి త్రిశూలంబున వ్రేసి దాని హారంబు

1. దనుచు నిన్నడిగిరేని. 2. ననుచు పేరు చెప్పు. 3. మనినియోగించి తా ప్రేతవనముజేర. 4. నరిగె. 5. పోయి యతి. 6. వ్వారీ హారము. 7. మిల్లుటయును. 8. యీ. 9. కూఁతురన్.

పుచ్చుకుంటి నది స్త్రీ యగుటంజేసి వథార్హురాలు గాదు. నీ పురంబు వెడలం ద్రోపించుమనిన కర్ణోత్పలుండు కోపానలకళంకితుండై పద్మావతి నప్పుడ బట్టి తెప్పించి యూరువందున్న త్రిశూలాంకంబు పరిచారుల చేతం జూపించి [1]భిక్షుండు జెప్పిన త్రిశూలాంకంబని తలంచి, యప్పుడ తన నగరంబు వెడలం ద్రోపించి యంత కర్ణోత్పలుండునుం గృతకభిక్షుని వీడ్కొని పోయె నంత, 86

కు॥ ఆ పడతియు [2]గడువంబడి
వాపోవుచు వెడలుచుండ వా[3]రటనిజమౌ
రూపములు [4]దాల్చిరి
భూపతితనయుండు మంత్రిపుత్రుండంతన్. 87

వ॥ ఇట్లరుదెంచి రోదనాకులితయైన దానిననునయించి తోడ్కొని వారణాసి పురంబునకు వచ్చి వజ్రమకుటుండయ్యింతి యందనురక్తుండై సుఖం బనుభవింపు చుండె. నిట దంతఘాతకుండుం దన కూఁతురు తనుంబాసిన తెరంగునకు తలంకుచు ప్రాణంబులు విడిచె, నతని భార్యయుందదను గమనంబు [5]చేసెనని కథచెప్పి బేతాళుండు వెండియు నిట్లనియె. 88

కు॥ తన కూఁతురు తనుబాసిన
ననిశంబును నడలి యడలి యా దుఃఖభరం
బున దంత[6]ఘాటకుఁడు చ
చ్చిన పాపంబెవరి దాఁకు జెప్పఁగవలయున్. 89

ఆ॥ ఎఱిఁగి చెప్పకున్న [7]నీ యాయుధమున నీ
[8]తలవగుల్చు జువ్వె ధర్మశాస్త్ర
[9]విదుఁడవౌట నీ వివేకత దప్పక
చెప్పవలయు నాదు చిత్తమలర. 90

వ॥ అనిన బేతాళునకమ్మానవేశ్వరుం డిద్ధ విచారుండై యిట్లనియె. 91

---

1. భిక్షుని మాట నిక్కమని తలంచి. 2. కడుతడ. 3. చటికి సత్. 4. వచ్చిరి. 5. తలంచుచు. 6. ఘాతకుఁడు. 7. నింద్రాయుధము తల. 8. దాకునంద్రు సు. 9. విదులు గావునను వివేకజ్ఞ.

సీ॥ ఆ॥రాజ[1]పుత్రునకు రమణికి నెగ్గు లే
దంగజరాగాత్ము లగుటజేసి
పతిభక్తి నిరతుఁడౌ పటుబుద్ధి గావున
మంత్రిపుత్రునకు గల్మషములేదు
.........................................
................................
కర్ణోత్పలుఁడు వివేకముదప్పి యెద్దినె
ననిన గొందిని గట్టు మనిన యట్టు

ఆ॥ లసురయనిన యంత నరయక వెడలంగ
నడఁచె సచివు కూఁతు నా క్షణంబ
దానజేసి దాని తండ్రి మృతుండయ్యె
గాన యతఁడు పాపకర్ముఁ[2]డనియె 92

క॥ శోధించి చేయవలయు ధ
రాధిపతులు కార్యములను [3]యాగములు మణుల్
శోధింపక చేసిన దు
[3]ర్యోధునకుం బాదిదగిలి యుండిన భంగిన్. 93

## కథ 2

క॥ అని మౌనమెడలి పలికిన
మనుజేశ్వరు మూపుడిగ్గి మసలక వేగం
బున బేతాళుఁడు వృక్షం
బునకుంజని తగిలియుండె ముందటిభంగిన్. 94

ఆ॥ వాని వెనుకబోయి వదలక యా వృక్ష
మెక్కి పట్టుకొని యహీనబలుఁడు

1.నందనునకు. 2. డరయ. 3. మ సరణిన్. 4. ర్యేధునకు నిహంబు పరము మైకొనదు తగన్.

గురుభుజంబునందు గొనివచ్చు [1]నెడవాఁడు
అవనిపతికి నిట్టులనియె మఱియు. 95

సీ॥ ధరణీశ! వినుము దత్తావధానుండవై
చెప్పెద నొక కథ చిత్తమలర
కాళింది తటమున గలదు బ్రహ్మ[2]స్థలం
[3]బనగల యగ్రహారమందు
యనఘుఁ డగ్నిస్వామియను బ్రాహ్మణుఁడు శ్రుతా
ధ్యయన సంపన్నుఁడుత్తముఁడుగలఁడు
తత్పుత్రిగలదు మందాకినీ కన్యక
మందారమాలికా మధురగాత్రి

ఆ॥ మహితరూప కులాచార మహిమ[4]యందు
పేరుగల యది గావున పృథివి యందు
తగిన వారలు బ్రాహ్మణోత్తములు వత్తు
రర్థి కన్య గొడుకుల కడుగవేఁడి. 96

వ॥ అంత నొక్కనాఁడు 97

క॥ మూవురు విప్రకుమారులు
[5]భావజతను గుణ, వయో విభవరూప సమా
నా[6]వయవు లొక్కచందము
భావింపగరాదు వీడు [7]పరపగ వచ్చున్ 98

క॥ ఆ కన్యక నర్థింపగ
నా [8]కొమరులు మువ్వురును మహౌత్సుక్యముతో
నా కన్య తండ్రి పాలికి
వీకను జని యడుగుటయును విస్మితుఁడగుచున్. 99

1. నెడనువాఁడ. 2. స్థాన. 3. మనగ బేర్కల యగ్రహారమందు 4. ములకు. 5. తుల్యులు. 6. వయసు. 7. పరుపగ వారిన్. 8. కొములు.

వ. దర్పక ప్రతిరూపంబులుంబోని యమ్మువ్వురంజూచి విచారింపుచుండె నంత వార లా యగ్నిస్వామికిట్లనిరి. 100

ఆ॥ అనఘ! నీవు ముపుర యందొక్కనికి గూఁతు
నిచ్చెదేని యున్న యిద్దరమును
ప్రాణముల్ త్యజించ ప్రతిన పూనితిమన
బాల నీగ నోడె బ్రాహ్మణుండు. 101

వ. వారును నయనానందకారియైన యక్కన్య నిచ్చలుం జూచుచు బాసిపోవంజాలక యప్పురంబునందు కృతాశ్రయులై వర్తింపుచుండి రంత సద్గుణసముదాయ పరాఙ్ముఖుండైన విధి చేతంజేసి యక్కన్య కాలప్రాప్తంబైన నమ్మువ్వురు నత్యంత శోకాకులితులై రోదనంబు సేయుచున్న నందొక్కరుండు దుఃఖాతిశయంబున జటాభస్మధారియై దేశాంతరంబున కరిగె. మరియు నొక్కరుండు నక్కన్య [1]యస్థులుం గొని వారణాసికింబోయె. మరియు నొక్కరుండు దాని దహించిన భస్మంబు నాశ్రయించి స్మశానంబిల్లుగానుండె, 102

తే॥ అట్టి మతిమంతులైన ధరామరోత్త
ములు పొలఁతికై యిట్టి దుర్బుద్ధి [2]పుట్టె
రాగులయ్యును యిష్టవియోగవంతు
లైన వారలు సేయని యవియుగలవె. 103

వ. జటాభస్మధారుండై మున్ను వోయిన వాఁడు దేశభ్రమణంబుసేయుచు నొక్క యగ్రహారంబునందు రుద్రశర్మయను విప్రుండు గ్రాసంబిచ్చిన భోజనంబు సేయు నెడ గృహస్థుతోడం [3]గోపించి తద్గృహిణి యేడ్చుచున్న తన కొడుకు నెత్తి యగ్నియందువైచిన తక్షణంబ యబ్బాలుండు మృతుండయ్యెనంత భిక్షుండు భోజనంబుడిగి కోపించి, 104

ఆ॥ మాలకోమ [4]లింటికేల వచ్చితి [5]నన
[6]నలరవేగ నా గృహస్థుఁడపుడు

1. యస్థికలు. 2. పుట్టి. 3. గలహించి. 4. యింటకేల 5. నని. 6. యడలుచున్న.

మంత్రశాస్త్ర విదుఁడు మంత్రకల్పము చూచి
మహితమైన సిద్ధమంత్రమునను, 105

వ॥ తన పుత్రు సజీవితుంజేసిన జటాధరుండతి విస్మితుండై యందు నిలిచి ప్రియా జీవితార్థుండై యా రాత్రి యవ్విప్రు మంత్రకల్పంబపహరించుకొని మగిడి వచ్చు[1]నెడ తీర్థాగతుండైన వానింగని యిరువురుంగూడి [2]మందారవతిని [3]దహించిన భస్మంబుకడకుం జని యచ్చోటనున్న యతనింగాంచి రంత మంత్రసిద్ధుండైన జటాధరుండు ఆ కన్యక భస్మాస్థిపుంజంబభిమంత్రించి సిద్ధమంత్రోదకంబు చల్లిన యా క్షణంబ, 106

క॥ లావణ్య పుణ్యలక్షణ
పావన లలితాంగియట్టె భస్మమునడుమన్
తా వెడలె దుగ్ధవారిధి
లో వెడలిన లచ్చివోలె లోకస్తుతయై. 107

వ॥ [4]ఇట్లుద్భవించి నయనానందంబు బొందింపుచున్న యక్కన్నియం గాంచి విస్మయానందంబుల కందర్ప సంచలిత హృదయులగుచు నొండొరులం గదువ, 108

క॥ ఇది నా వల్లభి యిది నా
హృదయేశ్వరి నాదు దయిత యిది యనుచుం బె
ట్టిదముగ నొండొరువులతో
నదయతమై ద్రోపు ద్రోపులాడుచు మఱియున్. 109

క॥ నే మంత్రసిద్ధి బడసితి
నేమును బహు తీర్థములకు నేఁగితి భస్మం
బేమరకుండితి నేననఁ
గా [5]మూవురకపుడు తగని కలహంబయ్యెన్. 110

వ॥ అని కథ చెప్పి బేతాళుండు వెండియు నిట్లనియె. 111

క॥ అను నా మువ్వురిలో నె
వ్వనియాలగు ధర్మ[6]యుక్తి వనితారత్నం

1. వాడు. 2. మఱల పడతి. 3. చితా. 4. ఇట్లావిర్భ. 5. మూవురికింపు దిగని. 6. వృత్తి.

బన బేతాళునకిట్లని
యనియె నృపవరుండు శాపయంత్రితుఁడగుచున్. 112

ఆ॥ మంత్రశక్తి జేసి మగుడ బుట్టించిన
వాఁడు తండ్రి యస్థివాహుఁడగుచు
తీర్థమరిగినతఁడు [1]తెల్లమిగ గొడుకు
భస్మశయను డింతి పతి నిజంబు. 113

వ. అనిన నదృశ్యుండై బేతాళుండు వృక్షంబునకుం బారినం బట్టుకొని వచ్చునెడ వాఁడు వెండియు నిట్లనియె. 114

## కథ 3

తే॥ అనఘ! విక్రమ కేసరి యనఁగ గలఁడు
[2]రాజపాలి వివృత్త పురంబునందు
సతత లక్ష్మీశుఁడాతని సుతుఁడు ఘనప
రాక్రముఁడు లోకభరిత నిరతయశుండు 115

క॥ ఆ రాజకుమారునకును
కీరముగలదొకటి యది యఖిల శాస్త్రములన్
భూరికళాసంచయమునఁ
బారీణతఁ దాల్చి యొప్పు బహుజననుతమై. 116

వ. మరి[3]యుగాంతా ప్రసాదసేవా యత్నంబులం దత్కళావిదులైన మానవులకంటె వివేకంబుగలిగి యతీతానాగత పరిజ్ఞానంబున విద్వజ్జనుల కంటె భూమియందు పొగడ్తకెక్కి నిజపక్షకాంతి పటంబునంజేసి తనయున్న కనకపంజరంబు మరకత ఖచితంబునుంబోలె నొప్పుచుండ సకలజన[4]సేవ్యంబైయుండు నచ్చిలుక యేమి చెప్పిన నది నిజంబని యపలాపించుచు నొక్కనాఁడు రాజకుమారుండు దాని కిట్లనియె. 117

1.తెల్లంబు కొడుకు తత్. 2. రాజు పాటలిపుత్ర. 3. గగనాంతప్రాసాద ప్రదేశంబుల నర్మవిద్యం. 4. స్తవ్యంబై.

కII నీవు సమస్తము [1]నెరుఁగుదు
నా విమ[2]లత నిన్నునొకటి యడిగెద జెపుమా
యే [3]వసుమతీశు గూఁతురు
భావింపగ భార్యయగు శుభస్థితి నాకున్ 118

వII అనిన చిలుక రాజ[4]కుమారునింజూచి మగధేశ్వరుండైన చంద్రావలోకుండను రాజుకూఁతురు చంద్రప్రభ యను కన్యక నీకుం బత్ని యగునని చెప్పిన విని మనోభవాయత్త చిత్తుండై, 119

కII ఆ [5]మగధేశ్వర తనయుం
డా మగధేశ్వర తనూజ ననిశము నాత్మన్
ప్రేమమున [6]దలపు చుండెను
[7]కాముని సంకల్ప [8]నిహతి కడునిజమరయన్. 120

కII ఆ [9]మగధ కన్యకకును
సోమికయను పెంటి చిలుక సుఖమధురవచో
ద్దామంబు గలదు ప్రియసఖి
యై ముదమొదవించు బహుకళాగమ విధులన్. 121

వII ఒక్కనాఁడక్కన్నియయును నాకుం బురుషుండెవ్వండగునని యచ్చిలుక నడిగినం బరాక్రమ కేసరియను రాజకుమారుండు నీకుం బ్రియుండగునని చెప్పిన విని [10]సంతసించి యతని తలంచుచు [11]మనోజప్రేరిత యగుచుండె నంత కాలక్రమంబున విక్రమకేసరి తన కొడుకునకు నీ కూఁతునిమ్మని మగధేశ్వరు నడుగంబంపిన దైవయోగంబున సంబంధబాంధవ్యంబు సంధించిన [12]నానంద విభవంబెసఁగ సకల మనోహరంబుగా వివాహంబు వర్తించె నంతం బరాక్రమ కేసరి చంద్ర ప్రభాసహితుండై రోహిణీయుతుండైన సుధాకరుండునుం బోలె నత్యంత కాంతి [13]కలితాననుండై. 122

1. నేరుదు. 2. నావిలమతి యొకటి నిన్ను న. 3. వసుమధేశ్వరు. 4. కొమరుం. 5. మనుజేశ్వర. 6. దలచు. 7. కామము. 8. వసతి. 9. మనుజే. 10. సంతోషించుచు న. 11. మనోత్థాపిత. 12. మహేంద్ర. 13. విలాసభాసురుండై.

కII ఆ లలితాంగియు దాను
లీలోద్యానంబులను లలిత హర్మ్యములన్
కేలియొనర్చుచు నుండ [1]గ
నాలంకృతమతి సమున్నతౌత్సుక్యమునన్. 123

వII అంత నొక్కనాఁడు, 124

ఆII [2]ఇద్ధ బుద్ధుల య్యిరువుర చిలుకలు
రమణనొక్క పంజరమున నుండి
రాజతనయు చిలుక రమణి [3]శారికతోడ
[4]ననుభవింపుచుండు మనిన నదియు, 125

కII పూరుషులరయ కృతఘ్నులు
క్రూరులు నానేల నాకు రుచివుట్టదు నీ
తో రతి సేయఁగ ననవుఁడు
[5]శారిక పలుకులకు చిలుక [6]సైపక పలికెన్. 126

కII వనితలు దోషంబుల పు
ట్టిన [7]యిండ్లనుగారె యీ కఠిన భాషలు నె
ట్టన విరసంబుగఁ బలికితి
విన [8]నేరంబయ్యె నవియు విపరీతములై. 127

వII అని తమలో వివాదంబు సేయుచుండ నప్పంజరంబు కడకు వచ్చిన రాజపుత్రు నెదుర దమ యోటమి దాసత్వపణంబుగాఁజేసి పన్నిదంబుచరచిన నా రెండు చిలుకలంజూచి దరహసిత వదనుండగుచు స్త్రీ పురుషుల దోషంబు లేర్పడ విభాగించిచెప్పిన వినిన యటమీఁద న్యాయంబు చెప్పెద[9]మని రాజపుత్రునకు కింశుక ముకుళంబునుంబోని చంచుపుటంబు శోభిల్లుచుండ [10]శారిక మొదలనిట్లనియె. 128

1. గళాలంకృత. 2. ఇష్టబంధులయిన యిరు. 3. కీరము. 4. జించి యుండు. 5. కీరము. 6. కినియుచు. 7. యిండులు. 8. నేరములయ్యె ని. 9. దనిన. 10. పెంటి.

సీ॥ అవంతియను పురి నర్థవంతుండను
వైశ్యుండు బహు[1]ధనవరుఁడు గలఁడు
ధనవంతుఁడనగ నాతని పుత్రుఁడభినవ
యౌవన [2]రూపుఁడై యమరుచుండు
నంతటఁ దండ్రి కాలావసానమున భా
ర్యయు దాను సురలోకమరుగుటయును
[3]నంత ధూర్తులఁ గూడి [4]యతులితమైన యా
ధనమెల్ల నిజకుల ధర్మమెడలి

తే॥ యనుదినంబును ద్యూతవేశ్యానురక్తి
[5]నర్థమంతయుఁ గోల్పోయి యతిదరిద్రుఁ
డైన వదలిరి ధూర్తసహాయులెల్ల
నంత నొక్కఁడు వోయె దేశాంతరంబు. 129

వ॥ దుశ్చారుండై నిరంతరంబు తిరుగుచు సంతాప[6]నివృత్తంబైన చందంబున పురంబుచేర యందు హిరణ్యగుప్తుండను [7]వైశ్యుండని నెరింగి తన కూఁతు నిచ్చి యపుత్రకుండును నతిసమృద్ధుండుంగావున [8]యతని యొద్దన పెట్టుకొని యున్న ధనవంతుండు భార్యాసమేతుండై సుఖింపుచు నందు బెద్ద కాలంబుండి నిజదేశంబునకు పోయెదనని యొక్కనాఁడు మామ కెరింగించిన యతండిట్లనియె. 130

క॥ అల్లుఁడవు [9]కొడుకువన్నను
[10]తెల్లముగా నీవె నాకు ధృతిగూఁతురు నా
యిల్లును సర్వమునిచ్చితి
జెల్లంబో విడిచిపోవఁ జెల్లునె నీకున్. 131

ఆ॥ అనిన మామ పలుకువిని యేఁ గృతఘ్నుఁడఁ
గాను నమ్ము మేడుగడయు నీవ

1. వంతుఁడలరు. 2. శ్రీయుతుండగుచునుండు. 3. వాఁడు. 4. వర్తింపుచును తన. 5. వ్యయము గావించి వేగంబ. 6. పీడితుండై యురగంబు చందనవనంబు జేరునట్లు. 7. వైశ్యుండతని. 8. యందన. 9. నీవె కొడుకవు. 10. తెల్లంబుగ.

మాకు దల్లి జూచి [1]మానిని మ్రొక్కించి
మగుడ దోడితెత్తు మసల ననిన. 132

కం॥ చల్లని మాటలకెంతయు
నుల్లంబున మామ నమ్మియును జాలధనం
బల్లునకు కూఁతునకు శో
భిల్లెడు తొడవులు నొసంగి ప్రియమొనరంగన్. 133

ఆ॥ దాసినొక్కతె నిచ్చి తడయక యనిచిన
తోడుకొనుచు బోయి దుష్టబుద్ధి
యగుటజేసి యొక్క యడవిలో దెరువున
నూయిగుంటఁ జేరఁబోయి నిలచి. 134

కం॥ వాపోవఁగ తొడవులు గొని
పాపాత్ముడు క్రూరలతల భార్యను దాసిం
జేపట్టి కట్టి త్రోచెను
కాపురుషుల కేల గల్గు కరుణాదరముల్. 135

కం॥ ఇరువుర నిట్లు కృతఘ్నుఁడు
బొరినూతంద్రోచి శంకబొందక యరిగెన్
తెరవరు[2]లంతట తనుగన
పరిదేవనరవము వినుచు బారి రయమునన్. 136

వ॥ భయభ్రాంతులై నలుదిక్కులంజూచుచు హాహారవంబు లెసంగ నేడ్చుచున్న యన్నారీమణులంజూచి యోడకోడకుమని నుయ్యిజొచ్చి వెడలందిగిచి రంత, 137

కం॥ తరళాక్షి బ్రదికె నాయుః
పరిశేషము కలిమిజేసి బానిస భూతా
హరణమున జచ్చె జనులకు
మరణంబులు కర్మ భిన్నమార్గములెందున్. 138

1.నీ కూఁతు. 2. లు నంత నంగన.

కII తెరువరు లొయ్యన దోడ్కొని
యరుగఁగ బురిజనులెరింగి యా యంగన నా
దరమున యప్పుడ నిజమం
దిరమున గల తండ్రికడకు దెచ్చిరి యంతన్. 139

వII తండ్రియు భయసంభ్రమంబులు హృదయంబునం గదుర నెదురు వచ్చి కూతుందోడ్కొనిపోయి యుత్సంగంబుపై బెట్టుకొని నీవొక్కతెవు మగనింబాసి యిట్లు వచ్చిన తెరంగేమి యని యడిగిన నయ్యింతి భయకంపిత శరీరయ్యై యిట్లనియె. 140

మII అడవిన్ ముచ్చులువచ్చి పట్టుకొని నీ యల్లున్ పెడంగేలు క
ట్టిడి నీ విచ్చిన సొమ్ము బుచ్చికొని నన్నెంతేని గారించి నా
[1]తొడవెల్లంగొని నూతద్రోచి యతనిందోడ్కొంచు నక్కానలో
వెడలంబారి రటంచు నేడ్చుచును నిర్వేదింపుచుం[2]బల్కగన్ 141

ఆII కూఁతుగారవించి గొనకొని క్రమ్ము క
న్నీరు దుడిచి యమ్మ! నీకు దొడవు
లేమి[3]భాతి నివియె యిచ్చెద నీ పతి
నేమి చేసిరొక్కొ? యెట్టులొక్కొ? 142

కII అని తలఁచుచుండ నయ్యం
గనయును సంతతము తన మగని రాకయె నె
మ్మనమున గోరుచు నడలుచు
దినములు గడపుచుఁ జరించె దీనాననయై. 143

వII మఱియు కొంతకాలంబునకు ధనవంతుండును మామ యిచ్చిన యర్థంబును భార్యతొడవులు [4]వ్యయించి కృతఘ్నుండు గావున నిశ్శంకుండై మామ యింటికింబోయి తన భార్య మరణంబెరింగించి పునర్వివాహంబునకు ధనంబడిగెదనని తలంచి చందనపురంబున కరిగి మామ యింటికింబోయి తన భార్యంజూచి యులికిపడి భయభ్రాంతుండై వజ్రహతుండునుంబోలె నుండిన నయ్యింతి యెరిగి పరతెంచి యతని చెవిం జేరి యిట్లనియె. 144

1. తొడలెల్లం. 2. బల్కుడున్. 3. భ్రాంతి యిదియె. 4. వ్యజించి.

క॥ నీ చేసిన యపకారము
నాచే మా తండ్రి వినడు నమ్ముము భీతిన్
ద్రోచి గృహాంతరమున సుఖి
వై చరియించునది యనుచు ననురాగమునన్ 145

తే॥ అతి రహస్యమైన యట్టి గృహంబున
నతని నునిచి యభిమతార్థసమితి
దెచ్చిపెట్టివాని దృప్తుని జేయుచు
నుల్లమలర బొం[1]గి యుండెనంత. 146

వ॥ ఎట్టకేనియుం గొన్ని దినంబులుండి యతండు జూదంబునందు తద్దయు లోలుండు గావున నర్థంబు వలసి యొక్కనాఁటి రాత్రి భార్యంజంపి తొడవులన్నియుంగొని యతిసాహసుండై యెటకేనియుం బోయె గావున, 147

క॥ ఇటువంటి పాపచరితుల
కుటిలాత్ములఁబొందఁ దగదు క్రూరుల నెపుడున్
పటుబుద్ధులైన వారికి
కుటిలత భామినులు నమ్మగూడునె యెందున్. 148

క॥ అనవుడు కీరము పలుకులు
విని రాజకుమారవరుఁడు విస్మిత మతియై
తన [2]చిల్కఁజూచి నవ్వుచు
వినుత కళాభిజ్ఞ చెప్పవే నీ వనుడున్. 149

వ॥ రాజపుత్రునకు క్రీడాశుకంబిట్లని చెప్పందొడంగె తొల్లి హర్షవతియను పురంబున ధర్ముండను రాజు పాలించుచుండ నా రాజ్యంబున కుబేరనిభుండు ధనవంతుం డను వైశ్యుండుకలం డతని కూఁతురు వసుమతియను కన్య రూపలావణ్య నిలయంబై తారుణ్యమంజరియైయున్న దానిందామ్రలిప్త వాసుండైన సముద్ర గుప్తుండను వైశ్యకుమారునకిచ్చి యపుత్రుకుండు గావున నతనిం దన

1. బొంది. 2. దిక్కు.

యొద్దం బెట్టుకొనియుండ నతండు దమవారిం జూచు వేడుక తన యూరికి గమనోన్ముఖుండై తన పత్ని ననుపు మనిన నతండనుపక తన యొద్దన యుండ నియమించిన నతండు చనియె నంత నొక్కనాఁడు, 150

సీ॥ ఆ యింతి హర్మ్యవాతాయనంబునఁ జూచె
 బురుషు మార్గంబున బోవుచున్న
వాని సన్మానితు వరరూపసౌందర్య
 మందిరు విప్రకుమారు నొకని
కని కడు కామించి తన మనంబతనిపై
 నిలిపి కామానల నిహత హృదయ
కమలయై యెంతయు గలగి తానొక ప్రియ
 సఖి కేకతమున నిష్టంబు జెప్పి

తే॥ యితని బ్రత్యక్ష మన్మథు నెల్లభంగి
గవయకుండితినేని సుఖంబు గలదె?
ప్రకట యౌవన సౌభాగ్యఫలము గలదె?
తలఁప నిల్లును కులమును దయ్యమెరుఁగు. 151

క॥ అని యచ్చెలికత్తెను నా
తని దెమ్మని పంచి గూఢతరకామ సుఖం
బున బొందుచుండె ననిశము
వనితల రాగంబు దుర్నివార్యంబొందున్. 152

క॥ ఆ రమణి యిట్లు విప్రకు
మారునితో బహుదినములు మన్మథకేళిన్
కూడి చరింపగ వైశ్యకు
మారుఁడు దాని పతివచ్చె మది నుత్సుకుఁడై. 153

వ॥ ఇట్లు తన యల్లుండు వచ్చిన ధనవంతుండు సంతసించి యతిసత్కార గౌరవంబునఁ బూజించె నంత నతం డారాత్రి విమల మాల్యాంబర[1]ధరుండై

1. రాజితుండై.

శయ్యాగృహం బునకు వచ్చి భార్యాసమేతుండై మధుపానంబొనరించి సంభోగ
కుతూహలుండై యాలింగనంబుసేయు నవసరంబున. 154

సీ॥ ఆ యింతి మొదల నన్యాసక్త గావున
పతి భజింపక నిద్రబలువు [1]జేసి
పైవల్వతో గూడ బాహుమూలంబు ల
ఖండితంబుగ స్వస్తికములు జేసి
ఘనపయోధరములు గప్పి కటీతటం
బూరు ప్రదేశంబు మెరయజేసి
చలి దాకినది వోలె చలితాంగియై కర
స్పర్శ సహింపక కదలకుండె

ఆ॥ దాని యాకృతి[2]యును దలఁపు నెరుంగక
మూఢుఁడనునయించి [3]మ్రొక్కుచుండె
మున్ను రాగియైన మోహ మొప్పగనేల?
నెట్టివారికైనఁబుట్టు నాస్థ 155

క॥ జరభి తన తండ్రి యాజ్ఞకు
వెరచి మగనియొద్ద జిచ్చు వేసవి దనపై
[4]జేరువగ నున్న తెరువున
నెరి చెడికొంత తడవుండె నిశ్చేష్టితయై. 156

వ॥ అంత నతండు మధుపానవశుండై కాష్ఠంబునుంబోలెఁ బడియున్న నెఱింగి
సర్వాభరణ భూషితయై యుద్యాన వనంబులోని సంకేత గృహంబు నందున్న
విప్రకుమారు కడకుం బోవునెడ నర్ధరాత్రంబుగావున నొక్క మ్రుచ్చు ప్రచ్ఛన్నుండై
దాని వెనుకం జనుచుండె నక్కులట యొక్కతెయుం బోయి యంతకు మున్న
సర్పదష్టుండై శరీరంబు విడిచియున్న యవ్విప్రకుమారు దగ్గరి, 157

క॥ పిడుగడచి నట్టులచ్చట
బడి హా ప్రియ! హా మదైక బాంధవ! నన్ను

1. జాతి. 2. తలంపును దా. 3. మ్రొక్కు దొణగె. 4. జెరువంగ.

న్విడిచితె నాకై జీవము
విడిచితె సంసారసుఖము విడిచితె యకటా! 158

ఆ॥ అనుచు మీఁద వ్రాలి యౌదలయెత్తి యం
దంద కుచతటముల నదిమి కొనుచు
నచట దడసి రాక నలిగితె నా తోడ
బలుకవేల యనుచు బలికి మఱియు. 159

క॥ తరుణశ్మశ్రులు పుణుకుచు
శిరమున బుష్పముల జక్కజెరుపుచు తాంబూ
ల రసారుణమగు వాతెర
బొరి జుంబించుచు విలాపములు సేయునెడన్. 160

వ॥ అంతకు మున్న నా శవం బాశ్రయించియున్న భూతం బా స్త్రీని శిక్ష సేయునట్లు నాసాగ్రంబు తెగకరచిన నది విలూననాసికయై యప్పుడు నిద్రితుండైన మగని యొద్దకు వచ్చి యతండు తన ముక్కుగోసెనని కూయ నతండు మెల్లనె సంభ్రమం బున లేచి యది యేమి యని యడుగుచుండె. నంత దాని యెలుంగు విని, 161

క॥ ఆ కులట దల్లిదండ్రులు
వీకంజని దాని జూచి విస్మిత హృదయుం
డై కదలకున్న యల్లును
వాకోడక తిట్టుకొనుచు వారాగ్రహులై. 162

వ॥ ఆక్రోశింపుచు రాత్రిశేషంబుగడపి ప్రభాతంబైన యల్లుని గూఁతు సభా స్థానంబునకు తెచ్చి యజ్జరభింజూపి యత్తెరంగు చెప్పిన విని తన్నడిగిన సభ్యుల ముందఱ వైశ్యకుమారుండిట్లనియె. 163

క॥ ఇది నాకెగ్గేమియు జే
యదు మరి నా వలన యిట్టి యన్యాయము బు
ట్టదు నా కృతి గాదనుచు
న్మదిలజ్జితుఁడైన సభ్యమండలి యలుకన్. 164

క॥ నిను బొందియున్న యది య
న్యున కిట్టుల సేయదొరకొనునె ధూర్తత్వం
బున బలికెదు ద్రోహివి నీ
వని రాజునకెఱుఁగఁ జెప్పి రంత నృపతియున్. 165

వ॥ వానిం దండింపుండని తలవరుల కొప్పించిన నా రాత్రి యక్కుటిల వెనకంబోయిన చోరుండెరింగి విగతభయుండై రాజునెదురకు వచ్చి వీనికి నిష్కారణ దండంబు తగదని వైశ్యకూఁతురు సేసిన యన్యాయంబంతయు చెప్పి దానికిం బ్రత్యయంబుగా నుద్యానంబు లోపలి శవంబు పండ్ల జిక్కిన నాసాఖండంబు రాజచారులకుం జూపిన నాగ్రహించి యా రాజు దాని కర్ణచ్ఛేదనంబు సేయించి యా చోరు నాదరించి దండపాలుంగా జేసెం గావున, 166

సీ॥ స్త్రీలు కృత్రిమ పటుప్రేమ బూరుషులకు
ముదముగావింతురు హృదయ మరయ
దోషంబులకు పుట్ట ద్రోహంబులకు దిట్ట
యాత[1]తాయతకు నికేతనంబు
కౌటిల్యమున కూఁట కపటంబునకు నాట
పట్టసత్యమునకు బుట్టినిల్లు
దౌష్ట్యంబునకు నిజస్థానంబు క్రూరత
కలిమికి నెలవు మాయలకు గుదురు

ఆ॥ వారి మాయధైర్యవంతుల బుద్ధియు
మగుడ జేసి తమ్ముదగుల జేయు
సాధుదూషితంబసారంబు సూడి నా
రీ జనంబు సువ్వె రాజతనయ! 167

క॥ అని యిట్లు రాజకీరము
జనపతి తనయునకు జెప్పి జాతిస్మర
భావన బొంది చిత్రసేనుం
డనియెడు గంధర్వుఁడయ్యెనంతన యచటన్! 168

1. తాయి.

ఆ పెంటి చిలుకయు దిలోత్తమ యను నప్సర స్త్రీ యయ్యెనని కథ చెప్పి వెండియు బేతాళుండిట్లనియె. 169

కII స్త్రీ పురుషులలో నెవ్వరు
పాపాత్ము లెఱుంగ జెప్పు భావించి ధరి
త్రీపాల! యనిన నతనికి
భూపతి యిట్లనియె వాక్ప్రభుత్వము దనరన్! 170

ఆII స్త్రీలసృష్టి మున్ను మేలుగా జేసె పా
పముల గూడబెట్టి కమలభవుఁడు
వారి జెప్పనేల కరంబు జెప్పిన
పురుషుఁడధిక పాప[1]పరుఁడు సూవె. 171

## కథ 4

వII అనిన బేతాళుం డెప్పటి యట్ల వృక్షంబునకుం బారిన విక్రమసేనుండును వాని వెనుకొని పోయి యట్టహాసంబుసేయుచున్న వానిం బట్టుకొని వచ్చునెడ వాఁడు నరేంద్రా! లోక నుతుండవగు నీకు నిట్టి యజ్ఞానంబు సంవర్తింపుచున్న యది, యది యట్లుండె నీ దూరంబయిన మార్గంబునందు నభీష్ట కథలంబ్రయాణాయాస శమనంబగు గావున నొక్క కథ చెప్పెద దత్తావ ధానుండవై యాకర్ణింపుము. 172

కII శోభిత సమస్త సంప
త్ప్రాభవమున బొగడువడసి బరగుచునుండున్
శోభావతియను పురము ధ
రాభూషణమగుచు నూత్న రత్నప్రభలన్. 173

వII అప్పురంబున కధీశ్వరుండైన విమలచారుచరిత్ర ధరోత్పాటిత సర్వదోష భూభాగుండును ప్రకటిత ప్రతాపాగ్ని ధూమాయమాన తీవ్రాసి ధారాప్రేరిత శత్రుకళత్రనేత్ర వారి వ్యాకులుండును సకల సద్గుణోపేతుండనం బ్రసిద్ధుండైన వాఁడు శూద్రకుండను మహారాజు కలండు. 174

1. కరుఁడు.

కు॥ సోమప్రభ నా దత్కుల
భామిని రూపవతి గుణవిభాసిత గలదా
భూమీశు చిత్తకైరవ
సోమప్రభయైన యదియు సురుచిరకాంతిన్. 175

వ॥ ఒక్కనాఁడన్నరేంద్రుండు మహేంద్రవిభవంబున గొలువున్నయెడ నొక్క పణిహారి వచ్చి కృతాంజలియై దేవా! మాళవదేశంబువాఁడు మహాసత్త్వుండు వీర వరుండను బ్రాహ్మణుండు దేవర వారినిం గొలువ వచ్చిన వాఁడనిన వానికి భ్రూసంజ్ఞజేసి యనుమతి జేసిన యా ప్రతీహారుండునుం దోడ్తెచ్చిన వచ్చి సభాసముద్రమధ్యంబున విశ్రాంతంబైన మందరనగంబునుం బోలె రత్నకట కాలంకృతుండై తేజోవిరాజితుండైన యా రాజునకు నొక్క ఫలంబు దర్శనంబిచ్చి యుచితాసనంబున నుండి తన దేశంబు పేరు నెఱింగించి సేవార్థియై వచ్చితినని వెండియు నిట్లనియె. 176

కు॥ కరవాల సహాయుఁడనై
బరికింపుచు భక్తితోడ బగలును రే ని
ద్దురలేక కొలువ నోపుదు
ధరణీశ్వర! జీవితంబు తగనీవలయున్. 177

కు॥ నా పత్నియు నా పుత్రియు
నా పుత్రుదు నింతవట్టు నా బృందము ధా
త్రీపాలక! వీరల ర
క్షోపాయము సేయవలయు నూహించి మదిన్. 178

కు॥ ఏనూరు రూపకంబులు
నానాటికి జీవితంబు నా కీవలయున్
భూనాథ! యనిన నాతం
డానందంబంది యతని కట్లన యిచ్చెన్. 179

తే॥ వీరవరున కిట్లు వేడిన యర్థ మిం
పారనిచ్చి యింత వట్టు నర్థ

మేమిసేయఁగలండొ యెరిగెద నని యిష్ట
సఖుల నరయ బంచె జనవిభుండు. 180

వ॥ ఆతండు పంచశతరూపకంబులయందు శతద్వయంబు మహాదేవు పూజసేసి, బ్రాహ్మణులకు, సకలార్థిజనులకు శతద్వయంబిచ్చి యున్నశతంబేమియు మిగలకుండ తన గృహకృత్యంబు నడుపుచు దివారాత్రు లప్రమత్తుండై రాజద్వారంబు గాచుచుండె నట్టి చరిత్రంబెరింగి శూద్రకుం దతివిస్మితుండగుచుండె నంత వర్షాగమంబైన. 181

క॥ నాలుగు దిక్కుల నవ ఘన
జాలంబులు గ్రమ్మె యాకసము సకలంబున్
కాలాంజన పుంజంబులు
బోలె దివారాత్రు లెరుఁగ బోలక యెపుడున్. 182

క॥ మెరుపు లతిభీకరములుగ
నురుములు బ్రహ్మాండమద్రువ నుర్వీమనుజుల్
మిరుపల్ల మెరుఁగకుండగ
గురిసేయంగరాని వాన గురియ దొణంగెన్. 183

వ॥ అట్టి వర్షాగమంబున నొక్కనాఁడు మేఘపటల ధూమాంధకారంబై బలాకాశల్య శకలాకులితంబై, ప్రజ్వలిత విద్యుల్లతాగ్నిజ్వాలాపరీతంబై, నీలమేఘపిశాచాకీర్ణంబై నివృత్తజనప్రచారంబై, శ్మశానంబునుంబోలు నతిభయంకరంబైన రాత్రి సమయంబున శూద్రకనరేంద్రుండు ధవళహర్మ్యంబు మీఁద నిద్రించి యర్ధరాత్రంబున మేల్కని పురంబు వెలుపల నొక్క రోదనధ్వని విని గంభీర ధీరంబైన యుచ్చైర్నాదంబున నగరద్వారంబుననున్న వా రెవ్వరనిన నవ్వీరవరుం డిట్లనియె. 184

క॥ ద్వారమున నప్రమత్తుఁడ
నై రేయింబగలు గదల కవనీశ్వర! నే
వీరవరుండను భృత్యుఁడ
నారయ బనియేమి నాకు నానతి యీవే. 185

వ॥ అనిన నతని భయభక్తి సత్త్వంబులకు బ్రహృష్ట హృదయుండై శూద్రకుం డిట్లనియె. 186

కII వినవయ్యెడు దవ్వుల రో
దన మది నీ వరయ దగుదు నా ననఘుఁడు భో
రున వీరవరుఁడు వెడలెను
ఘనతిమిరమునందు వాన కడువడి గురియన్. 187

కII వీరవరుఁ డెఱుఁగకుండగ
వీరాగ్రణి శూద్రకుండు వెనుకన వెడలెన్
దారుణ ఖడ్గధరుండై
యారగ నాతని మహత్త్వ మరయుదు ననుచున్. 188

వII అంత, 189

సీII హా హా మహారాజ! యఖిల వసుంధరా
భార ధౌరేయక! ప్రకటసత్త్వ!
హా హా నృపోత్తమ! యబ్ధిగంభీర! హా
జలరుహపత్రాభచారునేత్ర!
హా హా సమస్త దిగంతర చందన
చర్చాయమాణ యశఃప్రపూర్ణ!
హా హా ప్రచండ బాహాదండ ఖండిత
వైరి వీరోద్దండ వారణేంద్ర!

ఆII హా గుణైక నిలయ! హా నాథ! హా ప్రియ!
యని ప్రలాపముఖరితారవంబు
నెసగు చక్కటికి యహీన బలుండేఁగి
కానఁడయ్యె నేడ్చు కాంతనచట. 190

వII కనుంగొనకుండియు నయ్యేలుంగు నాలకింపుచు వీరవరుండు తత్ప్రదేశంబున కమలవనతీరంబునం గదలకుండి నీవెవ్వరు? నీ యేడ్పునకుం గారణంబేమి? యని యడిగిన దాని మధ్యంబున నుండి యలక్షితయై యొక్క కన్యక కలహంస

కులంబునకు మాధుర్యంబు గరపుచున్నయదియుం బోలె మధుర వచనంబుల నిట్లనియె. 191

కు॥ వినవయ్య పుత్ర! యే భూ
వనితను శూద్రకుని యగ్రవల్ల[1]భనా రా
జనఘుఁడు మూఁడవ దివసం
బున మృతి బొందుటకు దుఃఖమును బొంది మదిన్. 192

వ॥ ఏడ్చుచున్న దానం దొల్లి వరాహ దంష్ట్రాగ్రంబుననున్న యంత సుఖంబున నీ రాజుభుజంబు నాశ్రయించి పెద్దగాలంబుండి యింక నన్యు నాశ్రయింపం జాలక శోకించెద ననిన వీరవరుండు భయం[2]బంది కరంబులు మొగుడ్చి దేవీ! సకల జనరక్షకుండైన శూద్రకనరేంద్రుండు దీర్ఘాయుష్మంతుండగు నుపాయంబు దలఁచి యానతీవలయు ననిన నద్దేవి కరుణించి యనన్య సాధ్యంబైన యుపాయంబు గలదు నీవు సమర్థుండవేనిం జెప్పెద వినుమని భూదేవి యిట్లనియె. 193

చ॥ నిరుపమ ధైర్య! నీ కొడుకు నీ యసిచే వధియించి భక్తి త
త్పరత వెలుంగ దుర్గకు నుదారముగా నుపహార మిచ్చినం
గరుణ వహించి కాచు త్రిజగన్నుత! తత్కృపజేసి మన్మనో
హరుఁడగు శూద్రకుండు పురుషాయుత జీవియగున్ధరిత్రిలోన్. 194

కు॥ అనిన విని యట్లసేయుదు
నని భోరున నింటికరిగె నటశూద్రకుఁడున్
విని విస్మయమున మరుపడి
వెనువెనుకకు చనియె నంత వీరవరుండున్. 195

కు॥ తన భార్యను శక్తిధరుం
డను కొడుకును మేలుకొలిపి యచలితుఁడయి పె
ల్చన భూవచనము సర్వం
బును జెప్పిన కొడుకు విని సముత్సుకుఁడగుచున్. 196

1. భి. 2. పడి.

ఉ॥ ఏలిన వాని కార్యమిది యెంతయుధన్యుఁడనైతి మున్ను భూ
పాలురగొల్చి సద్భటులు ప్రాణములిత్తురు కాదె భర్తకున్
బోలగ ప్రాణ మీగనిన పూరుషుఁడెప్పుడు పుణ్యకీర్తి ల
క్ష్మీలలనా సమేతుఁడయి మేలుగ నెన్నికకెక్కు ధాత్రిలోన్. 197

వ॥ అని యప్పుడు, 198

ఉ॥ పూతమనంబుతోడ సితభూతి ధరించి[1]యు సంస్థితాననుం
డై తనతండ్రి మ్రోల జగదంబ గృహంబునకేఁగె నంత వి
ఖ్యాత బలుండు వీరవరు డాలిని గూఁతును దోడుకొంచు దా
నాతని గూడ బోయె వసుధాధిపుఁ డచ్చెరువందుచుండగాన్. 199

వ॥ ఇట్లు పోయి రత్న [2]దీపాలంకృతంబై యనేక యోగినీగణ పరివృతంబైన చండికా నికేతనంబు సొచ్చి శూద్రకుం డాయుష్మంతుండై రాజ్యంబు సేయుచుండ వలెనని కొడుకు మస్తకంబు ద్రెంచి దేవి శ్రీ పాదోపాంతంబునం బెట్టిన సమయంబున [3]నాకాశంబువలన నతిమధుర వచనంబుల నద్దేవి యిట్లని యానతిచ్చె. 200

చ॥ నిరుపమధైర్య వీరవర నీ యతిభక్తియు సాహసంబు సు
స్థిరతయు మెచ్చుఁగాదగు నతిస్థిరుఁడై యట శూద్రక క్షమా
వరుఁడు చిరాయురభ్యుదయ వైభవముల్వేలు[4]గంగ నూరువ
త్సరములు సేయు రాజ్యము విశాల యశుండయి నీ కతంబునన్.
201

వ॥ అని యానతిచ్చిన మహాప్రసాదంబని యున్నయెడ ప్రచ్ఛన్నుండై చూచుచున్న శూద్రకుండు అతి విస్మితుండై తనలోన, 202

ఉ॥ ఇట్టిది సాహసంబు గుణమిట్టిది ధీరత యిట్టి దిట్టులం
బుట్టునె భూమి నాదయిన పుణ్యఫలంబున నన్ను జేరె నా
కిట్టి మహోపకారమొక యింతయు వంచన లేక జేసె ని
ప్పట్టున నింక నీతనికి బ్రత్యుపకారము సేయ నేర్తునే. 203

---

1.సు సంస్మి. 2. దీపాంశకలితంబై. 3.నాకాశం. 4. గంద.

అని యతని మాహాత్మ్యంబు వర్ణింపుచుండె నంత వీరవరుని కూఁతురు వీరవతి యను కన్య విభిన్నశిరస్కుండయి యున్న యన్నంజూచి తానును గత ప్రాణయయ్యెనంత, వారి తల్లి సంతానవియోగదుఃఖంబు సహింపం జాలక వారికి వీరవరుండు గల్పించిన యగ్నియందుబడి ప్రాణంబులు విడిచె నంత వీరవరుండును కృతార్థుండనైతినని తలంచి హర్షించి తన శరీరంబు దేవికి నుపహారంబిత్తునని యుద్యోగించి యద్దేవి నిట్లని [1]ప్రస్తుతించె. 204

మ॥ జయ సర్వేశ్వరి! సర్వలోక జననీ! సర్వంకషా సర్వదా
జయ బ్రహ్మేంద్ర! ముకుందవందిత! పదాబ్జాతద్వయా యద్వయా!
జయ దైత్యేంద్రశిర[2]స్స్రగాభరణ భాస్వద్వక్ష దాక్షాయణీ!
జయ నారాయణి! మాయినీ! భగవతీ! స్వాయంభవీ! శాంభవీ! 205

వ॥ అని యనేక ప్రకారంబుల దేవి స్తోత్రంబుసేసి కరవాలంబున శిరంబు దెంచి దేవి శ్రీపాదోపాంతంబునం బడియుండెనంత నా శూద్రకుండెంతయు నమానుషంబైన యా పౌరుషంబు చూచి విస్మయోత్సాహ పూరిత హృదయుండై రోమాంచకంచుకిత శరీరుఁడగుచు నిట్టి భృత్యుండు లేని తన రాజ్యంబును జీవనంబును నిష్ఫలంబు గావున నితని తోడిద లోకంబు బ్రాహ్మణుండు మదర్థంబు ప్రాణంబు లిచ్చియుండ నతని సముద్ధరించుటయు నాకు గార్యంబని తలంచి యాత్మ పరిత్యాగంబునం దుద్యుక్తుండై, 206

క॥ ఓ పార్వతి! పరమేశ్వరి!
శ్రీపతి విధి సురవరేణ్యసేవిత! గిరిజా!
కాపాలిని! నారాయణి!
నా పయి దయనిల్పు చాల నయమొప్పారన్. 207

క॥ ఈ వీరవరు సజీవుం
గావింపు కుటుంబసహితుగా దయతోడన్
నా వాంఛ యిదే యనుచు మ
హా వీరుం డసి గళంబు నందొడ గూర్చెన్. 208

---

1. స్తుతియిం. 2. స్ర.

వ॥ అప్పుడు శూద్రకుని యుత్సాహంబునకు మెచ్చి ప్రత్యక్షంబై యద్దేవి యిట్లని యానతిచ్చె. 209

క॥ నీ సత్యమునకు మెచ్చితి
భాసురయశు వీరవరుని బ్రదికించితి న
త్యాసక్తి నీ సహాయుని
జేసి మహీరాజ్యమొప్ప జేయుము నీవున్ 210

వ॥ అని యానతిచ్చిన దేవియనుగ్రహంబునంజేసి వీరవరుండు కుటుంబ సహితంబుగ సజీవుండయ్యె నంత నత్తెరంగెరుంగకుండ శూద్రకుం దంతః పురంబున కరిగె. నా వీరవరుం డతి విస్మితుండై, దేవికి నమస్కరించి భార్యాసుత పుత్రికలంగొనిపోయి గృహంబున బెట్టి యెప్పటియట్ల ద్వారంబున నుండె. నంత శూద్రకుం డతి విస్మితుండై వీరవరుండు చేసిన సాహసంబు నతని వృత్తాంతంబునుం దన దేవి కెరింగించి యెరుంగనివాఁడు వోలె ద్వారంబున నున్నవాఁరెవ్వరని యడిగిన వీరవరుండు దేవా! నేనున్నవాఁడ నని పలికి మఱియు నిట్లనియె. 211

క॥ దేవర పనిచిన చోటికి
[1]బోవగ నది యేడుపుడిగి పొడచూపదు మా
యావినియో? రాక్షసియో?
ఏ వలనను గాననయితి నీ తిమిరమునన్. 212

క॥ అనవుడు నాతఁడు తను చే
సిన పురుషార్థంబు దనకు జెప్పమికిని య
త్యనుపమ ధైర్యమునకు మె
చ్చి నరేంద్రుఁడు కడు ప్రశంస చేయుచునుండెన్. 213

వ॥ అంత ప్రభాతంబైన ప్రాభాతిక కృత్యంబులు దీర్చి శూద్రకుండు కొలువుండి వీరవరుండు రాత్రి చేసిన పౌరుషంబంతయు మంత్రి సామంత ప్రముఖులకుం జెప్పి వీరవరునకు లాటదేశాధిపత్యంబు సముద్ర సహితంబుగా నిచ్చి మఱియు

1. బోవుడు.

నర్మదాప్రాంతదేశంబును మరుత్సుక దేశంబును నిచ్చి తత్పుత్రుండైన శక్తిధరునకు దక్షిణదేశంబిచ్చి వారు చేసిన యుపకారంబునకు తను చేసిన సత్కారంబు శతాంశంబు బోలదని చింతింపుచుండెనని కథ చెప్పి బేతాళుండు వెండియు విక్రమసేనునితో నిట్లనియె. 214

కII వీరవరుఁడు తత్పుత్రుఁడు
వీరాగ్రణి శూద్రకుండు విదిత [1]యశాంశుల్
వారలయం దెవ్వఁడు పెం
పారిన యధికుండు చెప్పుమని యడుగుటయున్. 215

వII విక్రమసేనుండిట్లనియె. 216

సీII ఇదియేమి యడిగెద విందు సందియ మేమి
తెలియగ నందఱు ధీరమతులు
శౌర్యంబు ధైర్యంబు సాహసంబును వీర
వరునకు సహజంబు లరయ వినుము
పతికి ప్రాణము లీగ భటునకు దగు భృత్య
క్రియ [2]నట ప్రాణవిక్రయము గాదె?
యాతని కొడుకట యధికుఁడాతని యట్ల
యతని సాహసము నద్భుతము గాదు

ఆII రోహణాద్రివలన రూఢ ప్రభాసిత
స్ఫురదనర్ఘ్య మణియ పుట్టుగాక
గాజు పుట్టు[3]నెట్లు? గణుతింప మఱి వాని
తల్లి [4]సత్త్వగుణము తగిన యదియ. 217

కII ప్రాణములు దనకు నిచ్చిన
ప్రాణసమానుఁడని భృత్యు ప్రాణమునకు దా
ప్రాణంబులిచ్చె నట య
క్షీణబలుఁడు శూద్రకుండె శ్రీయధికుఁడిలన్. 218

---

1.యశోంశుల్. 2. మున్ను. 3.కెట్లు. 4. సత్యగుణము.

కII అనుటయు నదృశ్యుఁడై య
మ్మనుజేశ్వరు మూపు డిగ్గి మగుడి మహీజం
బునకు బరచె బేతాళుఁడు
వెనుకన జనపతియు జనియె వృక్షంబునకున్. 219

## కథ 5

వII చని వానింబట్టుకొని వచ్చునెడ నొక్క విచిత్రంబు చెప్పెద వినుమని యిట్లనియె. 220

కII జననాథ! యంగదేశం
బున విష్ణుస్వామి యనఁగ భూసురుఁడు మహా
ధనవంతుఁడు గలఁ డతనికి
తనయులు గల రధికసుఖులు తరుణవయస్కుల్. 221

వII ఆ విష్ణుస్వామి యజ్ఞంబుసేయ నుపక్రమించి దీక్షితుండై యజ్ఞార్థంబు కూర్మంబు దేవలయుం గొనిరండని తనకొడుకుల సముద్రతీరంబునకుం బంచిన నమ్మువ్వురుంబోయి మహాకూర్మంబునుంగాంచి దాని దుర్గంధంబునకు, బరుషంబైన శరీరంబునకు రోసి యందొకరుండు నేను నారీసంగుండ దాని ముట్టంజాలననియె, మఱియొకరుండు నేను భోజనసంగుండనని రోఁత డాయం జాలననియె, మూఁడవయతండు నేను శయ్యాసంగుండ దానిం జూడం జాలననియె నిట్లు మూవురు వివాదంబు చేసి 222

కII మిండలు గావున దమలో
నొండురువులఁ జూచి పట్టనొల్లక తాఁబే
లుండగ [1]దుర్మతులటు లు
ద్దండచరిత్రులకుఁ గలవె ధర్మములెందున్. 223

వII తండ్రికి దీక్షాభంగంబున నధోగతియు నగునని శంకింపక కూర్మంబు నీవె నీవె తేవలయునని పరిత్యజించి తమలో తమరు కలహింపుచు సముద్ర తీరంబు వాసి విటంకనగరేశ్వరుండయిన ప్రథనజిత్తు పాలికింబోయి మేము

1. దుర్మదులటు.

నారీసంగ భోజనసంగ శయ్యాసంగులము మా ముప్వురయందు [1]గౌరవం బెవ్వరిదని యడిగిన వారింజూచి యా రాజిట్లనియె, 224

ఆ॥ ఇంత ప్రొద్దు నిలువు డెల్ల భంగుల ముప్వు
రంతరములు నిశ్చయంబుగాఁగ
నరయువాఁడ నెల్లి ననవుడు వారలు
నచట విశ్రమించి రంత నతఁడు. 225

వ॥ వారిలోన భోజనసంగుం డనువానికి గంధశాలి భోజనంబుఁ బెట్టిన గుడువ నుత్సుకుండై, 226

ఆ॥ కమరు [2]వీచె గూడు గంధంబు గుడువ రా
దంచు డించి ముకుళితాస్యుఁడగుచు
వచ్చు దానిఁ జూచి వసుధేశ్వరుండిది
యేమి కారణంబొ యెరుఁగవలయు. 227

వ॥ అని విచారించి శ్మశానసమీప క్షేత్రంబునందు బండిన ధాన్యంబగుట వైశ్యముఖంబున నెఱింగి తత్తండులదోషంబున నన్నంబు గమరువైచెనని యూహించి యితండు భోజన సంగుండగునని విస్మితుండగుచు నారీసంగు నెఱుంగవేడి రూపవతి యయిన తన దాసింగంధమాల్యాది వస్త్రాభరణంబుల నలంకృతంజేయించి యతనికడకుం బుచ్చిన నతండు శయ్యయందుండి యప్పుడ కరపీడిత నాసికుండై, 228

ఆ॥ మేక కరణి[3]వీచె మిగుల [4]బొంకంబగు
నొడలి గంధమనుచు నుమిసి యుమిసి
యబల దాసియని యథార్థోక్తులాడుచు
వచ్చుదాని మనుజవరుఁడు చూచి. 229

వ॥ యా దాసి దాదింబిలుపించి దీనికి మేక వలపు వచ్చిన కారణం బెట్లనిన నది విచారించి యతని కిట్లనియె. 230

1. గారవం. 2. వచ్చె కూటి. 3.వచ్చె. 4. చొక్కం

ఆ॥ తల్లి సచ్చుటయును తన శైశవమునాఁడు
మేకచన్ను గుడిచి వీక బెరిగె
గాన యిపుడు దీని మేని యందా గంధ
మొలయఁ బోలు ననుచుఁ బలుక నతఁడు. 231

వ॥ ఇతండు నారీసంగుండగునని మఱియు శయ్యాసంగు నరయవేఁడి సప్తాస్తరణం బులు రమణీయంబులుగా శయ్య గావింపంజేసి యతనికిచ్చిన నతండు శయనించె నంత ప్రథమాస్తరణంబు నంటియున్న రోమంబు దాకి వలయా కారంబున రక్తలాంఛనం బతని యొడలం బుట్టిన శరీరవేదన సహింపంజాలక యతండాక్రోశింపుచు వెడలి వచ్చిన నా రోమలాంఛనంబు చూచి వీఁడు శయ్యాసంగుండగునని విస్మితుండై యా రాజువారి యంతరంబు లెరింగి వారికి వలయు ధనంబిచ్చిన వారలా రాజు వీడ్కొని సంభోగతత్పరులై యప్పురంబునంద వర్తింపుచుండి రంత వారితండ్రి యజ్ఞభంగంబయ్యెనని యనశనవ్రతదీక్ష చేసి భార్యయుం దానును స్వర్గంబున కరిగె. 232

క॥ అని చెప్పి యమ్మువుర యం
దు నధికుఁ జెప్పుము యెఱుంగ దుర్ఘటమిది నా
కనవుడు ధరణీశుం డి
ట్లనియెం బేతాళమాయ నంటిన వాఁడై. 233

వ॥ భోజనసంగ నారీసంగులు బుద్ధిబలంబునం జేసి సదసద్వివేకంబునందు సమర్థులు శయ్యాసంగునకు పరుపు క్రింది రోమంబొత్తిన వాని వలయా కారంబు నరాగంబై యుతని శరీరంబునందుఁ గానంబడుటంజేసి శరీర సౌకుమార్యాతిశయంబున సమర్థుండు గావున కఠిన చరమాంగంబైన కూర్మంబు నంట నర్హుండుగాఁ డాతండధికుండు పితృమరణ సంభవంబైన పాతకం బతని కంటె మిక్కిలి యయ్యిరువురం దాకు, 234

క॥ అనవుడు నదృశ్యుఁడై య
మ్మనుజేశ్వరు మూపుడిగ్గి మగుడి మహీజం
బునకుం జనె బేతాళుఁడు
వెనుకన జనపతియుఁ జనియె వృక్షంబునకున్. 235

## కథ 6

వ॥ చని యెప్పటియట్ల పట్టుకొని వచ్చునెడ నరేంద్రా! యొక్కకథ చెప్పెద చిత్తగింపుమని బేతాళుండిట్లనియె. 236

ఆ॥ కుదురు ధర్మమునకు సదనంబు లచ్చికి
సకలసంపదలకు జన్మభూమి
సజ్జనైకవసతి యుజ్జయినీ పురి
స్వర్గజనని గలదు వసుధయందు. 237

సీ॥ ఆ పట్టణంబున కధిపతి పుణ్యసే
నుండన గలఁడు భూనుతుఁడు తొల్లి
యా రాజునకు నిష్టుఁడై కొల్చు ధీమణి
సద్బ్రాహ్మణుఁడు హరిస్వామి యనఁగ
నాయన కొడుకు మహావేదవిదుఁడు దే
వస్వామి యనగ సువ్రతుఁడు గలఁడు
కమలాక్షి కూఁతురు గలదు సోమప్రభ
యంగజాస్త్రము మూర్తియయ్యెననఁగ

తే॥ [1]నట్టె కన్యక తండ్రి కిట్లనియె నన్ను
సదమల జ్ఞానికొండె విజ్ఞానికొండె
శూరునకు నొండె నిమ్ము విశుద్ధ చరిత!
నిజము మఱి [2]యొండునొల్ల నా నియమ మిదియు. 238

వ॥ అనిన నట్లసేయుదునని తండ్రి యొడంబడియె, నంత నొక్కనాఁడు దాక్షిణాత్యుం డైన రాజు పుణ్యసేనుం జయింతునని యుజ్జయిని మీదికెత్తి వచ్చిన పుణ్యసేనుండు నమాత్యసహితుండై యతండు హితమాన్యుండు సర్వ సంపత్స[3]మర్థుండు గావున సామోపాయసాధ్యుండు గాని యన్యోపాయ సాధ్యుండు గాఁడని విచారించి ప్రజ్ఞాదక్షుండయిన వాఁడు హరిస్వామి యని తలంచి యతనిం

1.నట్టి. 2. యన్యుండు. 3. మగ్రుండు.

దదనుసంధానంబునకుం బంచిన నతండు వోయి యా రాజున కుపాయనంబిచ్చి సంధి సంబంధంబుగా జేసి పూజితుండై యా రాజు [1]వెలనంబున నున్న యవసరంబున నొక్క విప్రకుమారుండు వచ్చి కూతు నడిగిన హరిస్వామి యిట్లనియె. 239

కు॥ జ్ఞానివొ? విజ్ఞానివొ? మఱి
మానుగ శూరుఁడవొ? యిట్టి మనుజుని నొకనిం
గాని వరింపదు నా సుత
నా నియమము నదియ సువ్వె నరనుత! యనినన్. 240

వ॥ అతండు దాను జ్ఞానియౌట యెఱుకపఱచిన నతండు దనకూఁతు నిచ్చెదనని నిశ్చయంబుచేసి వివాహంబునకు రమ్మనియె. నంత నొక్క విప్రకుమారుండు దేవస్వామికడకుం బోయి నీ చెలియలి నా కిచ్చునది యని యడిగిన నతం డిట్లనియె. 241

కు॥ జ్ఞానివొ? విజ్ఞానివొ? మఱి
మానుగ శూరుఁడవొ? చెప్పుమా! యెవ్వఁడ వీ
వా నెలతుక యందొకనిం
గాని వరింపదు నిజంబుగా [2]నెఱిఁగి మదిన్. 242

వ॥ అనిన విని యవ్విప్రుండు తన ధనుర్విద్యా కౌశలంబంతయుఁ జూపి యనేక విధ మల్లయుద్ధ సంచారంబుల తన శౌర్యంబు చూపిన దేవస్వామి సంతుష్టుండై శూరుండవగుదువని యతనికిం దనచెలియలి నిచ్చెదనని యెనిమిదవ దినంబున వివాహలగ్నంబని చెప్పి వచ్చెనంతట, 243

ఆ॥ తల్లి తాన దలఁచి తన కూఁతు విజ్ఞాన
శాలియైనయట్టి సద్విజునకు
నివ్వ నమ్మబలికి యిమ్ముగా నతని దా
నింట నునిచి నెమ్మి యెసగుచుండ 244

1.వేల. 2. నెఱుఁగు.

వ॥ అంత హరిస్వామి తన గృహంబునకు వచ్చి లగ్నదినం బాసన్నంబైన కూఁతు నకు మంగళోపచారంబులన్నియుం జేయించి సర్వాభరణభూషితం జేసిన సకలజనమనోహారిణియై యున్న యవసరంబున వేడుకతో జ్ఞానియు విజ్ఞానియు శూరుండును పాణిగ్రహణ సముత్సుకులై వచ్చియుండి రంత నక్కన్య యదృశ్యయైన సంభ్రమించి గృహంబు[1]లెల్ల నరసి కానక దాని తండ్రి యతి దుఃఖితుండై జ్ఞానియగువానిం జూచి నా కూఁతు రెటువోయెం జెప్పుమని యడిగిన నతండిట్లనియె. 245

క॥ రాక్షసుఁ డొకఁడిప్పుడు ధూ
మ్రాక్షుండనువాఁడు జూచి యాసించి జనా
లక్షితుఁడై నీ కూఁతు మృ
గాక్షిం బట్టుకొనివోయె నతిరభసమునన్. 246

వ॥ పోయి వింధ్యాటవి దూరియున్న వాఁడనిన విజ్ఞాని యప్పుడు విచిత్రంబైన రథంబు కల్పించినం బుచ్చుకొని శూరుం డా రథంబెక్కి యతిత్వరితగతింబోయి యా రాక్షసుంజంపి యక్కన్నియ రథంబుపై బెట్టుకొని వచ్చె నంత హరిస్వామి కూఁతుఁగౌఁగిలించుకొని సంతుష్టుండై లగ్నంబు డాయ వచ్చిన పెండ్లి కొడుకుల ముువ్వురం జూచి విభ్రాంత మనస్కుండయ్యె నంత, 247

క॥ మూవురు కృతోపకారుల
యే విధమున బరిహరింతు నిరువుర నిక నిం
దేవెరవని మదిలో చిం
తా వికలత నున్న కన్య తండ్రికి ననియెన్. 248

వ॥ అని కథ చెప్పి బేతాళుండా ముువ్వుర యందు కన్యాలాభం బెవ్వరి కగుననిన నా రాజవరుండిట్లనియె. 249

క॥ అక్కన్య నసుర డిగిచిన
దిక్కెరిగించి నతండు దృఢముగ రథ మా

1. నెల్ల.

దిక్కునకుఁ బోవఁ జేసిన
[1]దిక్కుటుడుం గార్యపద్ధతికి కారణముల్. 250

కII ఆ యరదమెక్కి రయమునఁ
బోయి యసురఁ జంపి తెచ్చె పొలతిని దాన
శ్రీయుతుఁడు శూరుఁడాతడె
యా యింతికి వరుఁడు నిశ్చయంబిది యనినన్. 251

వII అప్పుడు బేతాళుం డెప్పటియట్ల వృక్షంబునకుం బారిన, 252

## కథ 7

ఆII వాని వెనుక బోయి వదలక యా వృక్ష
మెక్కి పట్టుకొని యహీన బలుఁడు
గురుభుజమున మోచుకొని వచ్చునెడను బే
తాళుఁడిట్టులనియె ధరణిపతికి. 253

వII నరేంద్రా! యొక్క కథ చెప్పెద నెట్లన్న శోభావతి యనుపురమున యశః కేతుండను రాజు గలం డతండు గౌరీ సరస్సను కొలనికిం దీర్థంబు వోయి యందు కృతస్నానుండై దేవీ సమారాధనంబు చేసి తీర్థోత్సవం బొనరింపు చున్న యయ్యుత్సవంబునకు నానాదేశంబుల జనులు తత్సరోవరస్నానార్థులై వచ్చుచుండి రంత, 254

సీII లలనలు పెక్కండ్రు విలసిత మణినూపు
రాహూత సారసులగుచు వచ్చి
యందు జలక్రీడలాడుచు నయన క
ల్హారంబులను వదనాంబుజముల
సురుచిరగురుపయోధర రథాంగంబుల
విలసిత భ్రూభంగ వీచితతుల
రమణీయ దోర్మృణాళముల భాసుర హాస
పుండరీక ప్రభ బొలుపు మిగిలి

1.దిక్కుయి.

తే॥ సరసిజనరుద్భవమున విషంబు వాసి
తెలుపు మిగిలిన యమృత దీధితులు వోలె
సలిల ధౌతాంజనామల చారుతర క
టాక్ష విమల ప్రభలు బొలుపారి తనర. 255

వ॥ నఖక్షతసమంచితంబులైన పయోధరభాగంబులు పాండుర డిండీర వస్త్రంబులంగప్పుచు జలక్రీడలు సలుపు నెడం దరుణవయస్సంపన్నుండైన ధవళుండను రాజకుమారుండు స్నానార్థియై వచ్చి మూర్తిమతియైన యిందీవర లక్ష్మియుంబోలె కమలవనవిహారిణియైన యిందిరాసుందరియుంబోలె నుత్పలోత్సాహవర్తినియైన బాలేందురేఖయుంబోలె నతిసౌందర్యంబుగల దాని చక్రవాక శిశువునుంబోలి కుచస్తబక విలాసంబున నుల్లసిల్లు దాని, మదన సుందరియను రాజకన్యకం జూచి, విస్మిత మానసుండగుచు స్నానంబుచేసి దేవికి మ్రొక్కి యో దేవి! యిక్కన్యక నాకు సహధర్మచారిణి యగునట్టు లనుగ్రహించితి వేని మచ్ఛిరంబు దెంచి నీ కుపహారంబిచ్చెదనని పలికి తన గృహంబునకుంబోయి హృదయంబున నయ్యింతిం దలంచి మనోజానల పరితప్తశరీరుండై యున్న కొన్నిదినంబులకు, 256

ఆ॥ అంత వాని తండ్రి యంత వృత్తాంతంబు
విని తనూజుఁడున్న విధమెఱింగి
యపుడు దాని తండ్రియగు శుద్ధవటుని [1]గృ
హమున కరిగి మాటలాడి వేడ్క. 257

వ॥ అక్కన్యకం దన కొడుకునకు బెండిలిసేసి తోడ్కొని వచ్చిన నా ధవళుండు దాని యందనుకూలుండై మనోభవ క్రీడాలోలుండై వర్తింపుచుండె. నంత గొండొక కాలం బరిగిన శుద్ధవటుం డల్లునిం గూఁతుందోడ్కొని రమ్మని తన కొడుకుం బంచిన వాఁడు వచ్చి యయ్యిరువురం దోడ్కొని పోవుచున్న యెడ మహాగౌరి యాశ్రమంబునకుం జని కొంత తడవు నిలిచి ధవళుండద్దేవి గృహంబు సొచ్చి

1. గృహాన.

దేవీ బోధితుండై పూర్వసంకల్పంబు దలంచి కఠోరంబైన కుఠారంబున తన [1]శిరస్సు ద్రెంచి దేవికుపహారం బిచ్చి తత్పాదోపాంతంబునం బడియుండె నంత, 258

కII తన మరఁది రాక కడు దడ
సిన నేమి యొకో యటంచు చెలియలి నచ్చో
ట నునిచి తా జని కాంచెను
వినికృంత శిరస్కుఁడైన వీరుని ధవళున్. 259

ఆII ఇట్లు కాంచి యింక నీ వార్త చెలియలి
కెట్లు చెప్పి యూరి కెట్లు దోడు
కొనుచు బోదునని యకుంఠిత మతి తన
తలయు నిచ్చె దేవతకు ముదమున. 260

ఆII అతని యరయ బోయి యన్నయు రాఁడయ్యె
నిచట నిలువనాకు నేమి గార్య
మనుచు బోయి బాల యయ్యిద్దరను జూచి
విస్మయంబు బొంది విహ్వలించి. 261

వII ధైర్యమతి యగుటంజేసి చిత్తం బొక్కింత చేసుకొని, 262

కII మగఁడన్నయు నిటు సమసిన
[2]తగు వీరడినగుచు బోయి తలిదండ్రుల కీ
మొగమేమని చూపుదునని
మగువయు దెగదలఁచె నతి సమంచిత బుద్ధిన్. 263

వII ఇట్లు తలంచి దేవి గృహద్వారదేశంబునందు రక్తపుష్పోపశోభితం బయిన నిజదుఃఖాగ్ని దహ్యమానంబైన యట్లు ప్రజ్వరిల్లుచున్న యశోకవృక్షంబు క్రిందికి వచ్చి దాని పూర్వ శాఖయందు [3]శిరంబమర్చుకొని మరణోద్యోగంబు [4]సేయ (సమకట్టి) యద్దేవికి నమస్కరించి యిట్లని స్తుతించె. 264

1. శిరంబు 2. తగ. 3. శిరియొనర్చి. 4. సేసి.

శా॥ నీ కారుణ్యకటాక్షలబ్ధతను లానీరేజగర్భాచ్యుతుల్
శ్రీకారామల దివ్యగాత్రములు నీ శృంగారసాంగత్యముల్
లోకాధీశులు నీదుభృత్యులు రమాలోలాక్షి వాణీసతుల్
నీకున్ సఖ్యులు నా తరంబె నినువర్ణింపంగ గాత్యాయనీ. 265

క॥ అని తను స్తుతియించిన య
వ్వనజానన మృదుల మధుర వాక్యంబుల బే
ర్చిన భక్తిం జేకొని యి
ట్లని యానతి యిచ్చె నీశ్వరాంగన కరుణన్ 266

క॥ నీ యచలిత భక్తియు వా
చాయుక్తియు లెస్స వీరి చతురత ప్రాణ
శ్రీయుక్తుల జేసెద నీ
వీ యిర్వుర గూడ జేర్పు మిరువుల తలలన్ 267

ఆ॥ అనిన దేవి పలుకు విని విస్మయంబును
ముదము సంభ్రమంబు నొందగ ముగ్ధ
యన్న శిరము మగని నతని శిరంబన్న
బొందియుండ నపుడు పొందుకొల్పె. 268

వ॥ ఇట్లు దైవయోగంబునంజేసి యొండొరుల శిరంబులు వీడు పడ ధరియింప దేవీ ప్రసాదలబ్ధ ప్రాణులు సతీసమేతులై నిల్చిరంత నయ్యిరువురం జూచి సందేహాకులిత చిత్తయై యత్తన్వి చింతింపు చుండెనని కథచెప్పి బేతాళుండు వెండియు నిట్లనియె. 269

క॥ మగని శిర మన్న యొడలికి
మగని యొడలి కన్న శిరము మానుగనుండెన్
మగ డెవ్వఁడన్న యెవ్వఁడు
మగువకు మనుజేశ చెప్పుమా నిక్కముగాన్! 270

వ॥ అనిన విని యన్నరేంద్రుండిట్లనియె. 271

తే॥ పతిశిరంబు ధరించి సప్రాణుండై
యతఁడు కాదగు నిక్కమవ్వనిత వరుఁడు
తలఁప సర్వాంగములకు నాధారమైన
శిరము ముఖ్యంబు నరదేవ! జీవితతికి. 272

క॥ అని మౌన మెడలి పలికిన
మనుజేశ్వరు మూపుడిగ్గి మగుడి మహీజం
బునకుం జనె బేతాళుఁడు
జనవిభుఁడు న్మరలిపోయి సరభసలీలన్. 273

వ॥ వానిం బట్టుకొని వచ్చునెడ వాఁడొక కథ చెప్పెద చిత్తగింపు మని యిట్లనియె. 274

## కథ 8

క॥ మనుజేశ! తామ్రలిప్తం
బను పురమున చండసింహుఁడనఁ బరగిన రా
జనుపమిత విక్రమార్జిత
ఘనతేజుఁడు వీరవరుఁడు ఘనుఁడధికుడిలన్. 275

క॥ అతనికి హితుఁడై సేవా
గతుఁడై కార్పటికుఁడొకఁడు కడు నధికుఁడు స
న్మతిఁగొలుచు నంగరక్షకుఁ
డతిబలుఁడును సత్యశీలుఁడగు వాఁడెపుడున్. 276

వ॥ మఱియు శీతవాతాతపంబులనక నిరంతరంబును కొలుచుచుండ నొక్కనాఁడా రాజు పవనజవంబైన తురంగంబునెక్కి వేఁటబోయి నిర్మనుష్యంబైన మహాగహనంబుసొచ్చి యతివేగంబున దూరంబరుగుటంజేసి భృత్యులు పరిశ్రాంతులై నిలిచిన యా కార్పటికుండొక్కరుండునుంగూడం జని తృష్ణా తురుండైన రాజుంజూచి నలుదిక్కులంబరికించి శీతోదకస్థలంబుగని యా రాజు నచ్చటికిం దోడ్కొనిపోయి తృష్ణదీర్చి యామలకఫలంబులు రెండు పయోగింప నిచ్చి పరిశ్రమంబు దీర్చి మార్గంబు సూపిన క్రమ్మర తన నగరంబు చొచ్చి యా రాజు కార్పటికు వలన సంతుష్టుండై, 277

తే॥ అతఁడు చేసిన పురుషార్థ మఖిలజనులు
వినగ మంత్రులకెఱిగించి వేడ్కతోడ
సకలసంపద లొసగియు సంతతంబు
నాత్మతుల్యునిగా వాని నాదరించి. 278

వ॥ చండసింహుం డొకనాఁడు కార్పటికుతో నిట్లనియె. 279

ఆ॥ పొలతి సింహళేంద్రు పుత్రిక గలదు మృ
గాంకరేఖ యనఁగ నా మృగాక్షి
వలయు నాకు నడుగ జలనిధిఁ గలమెక్కి
నీవు పోవవయ్య నిపుణమతిని! 280

క॥ అనవుడు విని యక్కార్యం
బునకు సుముఖుఁడైన మెచ్చి భూవిభుఁడు పరీ
జన బహుళసంపదలతో
దనరినఁ గలమిచ్చి యతిముదంబున ననిచెన్. 281

వ॥ ఆ కార్పటికుం డక్కలంబెక్కి యుత్తుంగతరంగాలింగితాంబరంబైన సముద్రంబు లోని సింహళద్వీపంబునకుం బోవుచున్నయెడ మహామహీధర నిభంబైన నీలమేఘంబు నలుదిక్కులంబర్విన తత్సముద్భూత వాతంబునంజేసి సముద్ర జలంబులు ప్రళయకాలావసరైక్య సప్తార్ణవజలంబుల భంగి నాక్రాంతంబులై కలంబు డాసి, 282

క॥ సురగరువలిచే దిర్దిర
దిరుగుటయును గలములో నతివ్యాకులులై
పరిజను లాక్రోశింపుచు
దిరుగంబడి చండసింహుఁ దిట్టిరి పెలుచన్. 283

ఆ॥ స్వామినింద వినగఁజాలక తీవ్ర ఖ
డ్గంబు వెఱికి పట్టి కడిమి మెఱయ
సత్త్వ శీలుఁడుఱికె జలనిధి నప్పుడ
యెల్ల వాతనిహతి నవసెఁ గలము. 284

ఆ॥ దానిలోని జనుల దడయక భక్షించె
జలధి గల మహోగ్ర [1]జలచరములు
దైవబలము కలిమి దత్ప్రమాదంబున
దలగె కార్పటికుఁడు ధర్మపరుఁడు. 285

వ॥ సముద్రంబులో ననుకూలంబై దైవంబిచ్చిన యాయుష్యంబునుం బోలె నున్నదాని నొక్క ధ్వజదండంబు గని దాని నవలంబించి కొంత దవ్వరిగి యొక్కచో మునింగి పాతాళంబునకుంబోయి యందు తోరణశోభితంబైన కాంచన పురంబుగని దానిమధ్యంబున వినూత్నరత్నప్రభామండనాట్టాలకాలం కృతంబైన ధవళహర్మ్యంబునందు సన్నిహితులై నాగామరకన్యకా పరివృతులయిన పార్వతీపరమేశ్వరుల దర్శనంబు చేసి నమస్కరించి యిట్లని స్తుతియించె.

శ్లో॥ జయశ్రీ మహాదేవ సర్వేశకాంతా
జయబ్రహ్మశార్‌జ్యాది సంస్తుత్యనంతా
జయక్రూర దైత్యేంద్ర సంహారకారీ
జయేంద్రాది లోకేశ సంసేవ్యశర్వా.

వ॥ అని స్తుతియించి వెడలి యా ప్రాసాదంబు ముందట దివ్యాంబ రాభరణ శోభితయై చకితహరిణీనిరీక్షణ ప్రతిపక్ష కటాక్షవిక్షేపంబులు ప్రజ్వరిల్ల విభాస లీలాలలితంబై కోమలాంగంబు మన్మథోపవనలతికంబోలె నతిసౌందర్య మందిరంబై యొప్పి దాసీ సహస్రపరివృతయైయున్న దానినొక్క కన్యం జూచి చలితధైర్యుండును మదనముద్రిత [2]హృదయుండునై చిత్రార్పితుండునుం బోలె నిశ్చలాంగుండై తప్పక చూచుచుండె నంత నక్కన్య గిరికన్యాపరమేశ్వరుల బూజించి వెల్వడి నిజమందిరంబునకుం బోయి రత్నపర్యంకంబుపై యుండెఁ గార్పటికుండునుందదీయ కటాక్షాకృష్టుండై దాని వెనుకబోయి తద్గత మానసుండై దాని గృహద్వారసమీపంబున నిలిచి చూచుచుండె నంత, 286

---

1. జల. 2. హరుండు.

క॥ ఆ నలిన నయన పంపునఁ
బూని చెలులు దోడుకొనుచుబోయిరి పుణ్య
స్నానము సేయగ రమ్మని
మానుగ కార్పటకుఁడొక కమలవనమునకున్. 287

స్నానార్థియై మునింగి తామ్రలిప్తపురోపవన మధ్యంబున నెగసి చింతాక్రాంతుండై కన్యానిహిత మానసుండగుచు వనంబులో బడి మనోజ తాపంబునం బొరలుచుండె నంత నుద్యానపాలురతని నెఱింగి పోయి చండసింహున కెఱింగించి రప్పుడు,

క॥ ఆ రాజువచ్చి వివశ శ
రీరుండైయున్న వాని ప్రియుఁ గార్పటకుం
జేరంజని కని తగు నుప
చారంబు లొనర్చి చేసె సప్రాణునిగాన్. 288

ఆ॥ అంత నొడలెఱింగి యాతండు నేలిన
వానిఁ జూచి మంద వచనములను
విస్తరించి తనదు వృత్తాంత మంతయు
దనర జెప్ప నిట్టులనియె నృపతి. 289

క॥ నీ వింత యేల బెదరగ
నే వచ్చెద నిరువురమును నిపుడా పాతా
ళా[1]వివరమునకు [2]బోవుద
[3]మా విలమతి కన్యదెత్తు మదలకు మనుచున్. 290

వ॥ అతని నూరడించి యక్కార్యంబంతయు మంత్రులకెఱింగించి రాజ్యభారంబు నందు వారి నియోగించి గార్పటకుం దోడ్కొని సంభ్రమంబునఁ గలంబెక్కి యతండు చూపిన ధ్వజప్రదేశంబున నిరువురు మునింగి పాతాళంబునకుం జని గౌరి యాశ్రమంబునకు బోవునంత, 291

1. వాస. 2. బోదము. 3. నా.

కం॥ కాముని వనంబులోపలి
కోమల నవలతిక యనగ కొమరగు దానిన్
సామజగామిని కన్య ప్ర
భామందిరఁ గార్పటికుఁడు పతికిం జూపెన్. 292

కం॥ అక్కన్య రూపమహిమకు
నెక్కడ ప్రతిగలుగనేర దిలనని మదిలో
వెక్కసమున భూపతి యా
దిక్కుదగిలి చూచుచుండె ధృతియుతుఁడగుచున్. 293

వ॥ అక్కన్యయు బార్వతీ పరమేశ్వరులబూజించి వెలువడివచ్చి యతి మనోహరా కారుండైన చండసింహునిం జూచుచుం బోయి తన దాసికిట్లనియె. 294

కం॥ అతులిత ధృతి సత్యాశ్రయుఁ
డితడెవ్వఁడొ నెరుగవలయు నీవేగి లస
న్మతి మాటలాడు మభ్యా
గత పూజగ్రహింపుమను సుఖస్థితి ననినన్. 295

కం॥ ఆ దాసి చండసింహ మ
హీదయితుని జేరజని నరేశ్వర! జనతా
హ్లాదక పూజార్హుఁడ వ
త్యాదరమున రమ్ము భద్రహారిక బిలిచెన్. 296

ఆ॥ అనిన దానిఁ జూచి యమ్మహీశ్వరుఁడు దా
కన్య వనుప మమ్ముఁ గానవచ్చి
యాదరమున మాటలాడిన యంతన
పూజ [1]యెక్కె మాకు పువ్వుబోడి. 297

కం॥ అనిన నదివోయి చెప్పిన
విని కన్యక మనములోన విస్మితయగుచున్ 298
మనుజోత్తముఁడీతఁడు నా
కొనరగ వశవర్తి యనుచు నుత్సుక యయ్యెన్.

1. యేవె.

వ॥ అంతనిక్కడ చండసింహుండును సౌవర్ణలతికారమ్యంబును రత్నమయ వృక్షోప శోభితంబును సకలకాలఫలితంబునునైన దివ్యవనంబున లతాభవనంబు నందు చంద్రకాంత వేదికపై విశ్రమించియుండె నంత, నిష్ట సఖీ సహాయయై యక్కన్య యచ్చోటికి వచ్చి యా రాజున కిట్లనియె. 299

క॥ అధిప! నా గృహమున కతిముదంబున వచ్చి
పూజలందవలయు బుణ్యచరిత!
యనుచు వేడుకొనిన యక్కన్య వచనంబు
లాదరించి యిట్టులనియె నృపతి. 300

తే॥ పార్వతీశ్వరులను జూచు భక్తిజేసి
ఎట్టకేలకు నీ పురి యేగుదెంచి
శ్రీ మహాదేవు దేవి [1]దర్శించ చేర
వచ్చితిమి యిందు [2]క్రమమొంది వనజనేత్రి! 301

వ॥ ఇందు గొంత విశ్రమించి మాపురంబున కేఁగెద మీ మధ్య మఱి యొందు చోటికి రానేమి కార్యంబు? 302

మ॥ అని ధైర్యంబు వివేకముం దనరగా నక్కన్యతో చండసిం
హ నరేంద్రుండు పరార్థభాషల సముద్యత్ప్రీతితోనాడుడు
న్విని యూహించి తటస్థు గార్పటకుని న్వీక్షించి లజ్జానతా
ననయై [3]ముందును సేయు వంచనకు దైన్యస్వాంతయై [4]యిట్లనెన్ 303

వ॥ దేవా! కాలనేమి యను రాక్షసేశ్వరు గూఁతుర నీ పురంబు దొరల మా తండ్రి నాకు పురద్వయంబిచ్చినవాఁడు భోగమోక్షప్రదంబును సర్వసిద్ధి కరంబును హాటకరత్న [5]నిర్జితంబును మృత్యువ్యాధి వర్జితంబును దివ్య[6]సౌధంబును ననర్ఘ్య మణిప్రభా భాసితంబునునైన యప్పురద్వయ సహితంబుగా నేను నీ యధీన నయ్యెద నన్ను బరిగ్రహింపు మనిన నప్పొలతి లలితంబులైన పలుకులు విని కార్పటికుం [7]జూపియు నరేంద్ర బృందారకుండక్క న్యక కిట్లనియె. 304

1.దర్శించి. 2. శ్రమమొంది. 3. మున్ తన. 4. యిట్లనున్. 5. నిర్మితంబు. 6.సౌరభం. 7. జూపుచు.

చ॥ ఇతఁడు ప్రియుండుగాగ వరియింపుము నెమ్మిని భవ్యశీలుఁడా
యతమతి నాకు [1]నచ్చిన సహాయుఁడు మిత్రుఁడు ప్రేమపాత్రుఁడు
హితుఁడును భక్తుఁడున్భటుఁడు నెక్కుడు బంధుఁడుగాన నా లస
న్మతి దలపోసి యాతనికి మానుగనిచ్చితి నిన్ను [2]వేడుకన్. 305

క॥ అనిన విని యట్టి పని నీ
వనిచితి వది యట్లగాక యని లజ్జితయై
వినుత కటాక్షశలాకల
వనజాయతనేత్రి భూమి [3]వ్రాయుచు నుండెన్. 306

వ॥ ఇట్లకన్య కసురయిచ్చిన రాజ్యంబును దానిం గార్పటికునకిచ్చి యామలకఫలంబులం దొక్కదాని ఋణంబు దీర్చితి నిఁక నొక్క ఫలంబు ఋణంబు నా యందున్న యది యని యచ్చోటనతని నిలిపి చండసింహుండు పూర్వంబునం గార్పటికుండు మునింగిన సరోవరంబున మునింగి క్షణ మాత్రంబున నిజనగరోద్యానంబున కరిగెనని కథ చెప్పి బేతాళుండయ్యిరువుర యందు ధైర్యసంపన్నుండెవ్వండని యడిగిన వానికి విక్రమసేనుం (విక్రమాదిత్యుం) డిట్లనియె. 307

క॥ ఆ రాజతనికి బ్రత్యుప
కారంబటు చేయదలచి కార్పటికుఁడు దా
వారాశి తెరువు చూపగ
నీరమునుఁగు టరుదుగాదు నిక్కము దలఁపన్. 308

ఉ॥ ఏలినవాఁడుఁ బంపఁగలమెక్కి పయోనిధిలోన నట్లు వా
తూల హతింగలంబవయ తోటి జనంబులు యార్తి చూడగా
జాలక ఖడ్గమూతగ నశంకితుఁడై జలరాశి మున్గి పా
తాళపురంబు సొచ్చె విదితంబుగ గార్పటికుండు ధీరతన్. 309

వ॥ కావున రాజునకంటె కార్పటికుండధికుండనిన విని బేతాళుండెప్పటి యట్ల వృక్షంబునకుం బాఱిన విక్రమార్కుం(విక్రమసేనుం)డు వెనుకంబోయి పట్టుకుని

1.మెచ్చిన. 2. వేడ్కతో. 3. వ్రాలుచు.

వచ్చు నెడ నరేంద్రా! యతి సౌందర్య మందిరంబులైన వనితా సహస్రంబులు గొలువ మహేంద్ర విభవంబున రత్నప్రభాభాసితంబైన లీలాభవనంబున నభినవ సుఖంబులనుభవింపుచున్న వాఁడవు నేఁడు బేతాళకులాకులంబై యతి భీషణంబైన యీ శ్మశానంబున నిరంతరాయాసంబున దిరిగి తవిలి యంతయు పాపాత్ముండైన క్షాంతిశీలుండు చేసిన వచనంబునం జెడిన వాఁడ వది యట్లుండె నేనొక్క కథ చెప్పెద వినుమని యిట్లనియె. 310

## కథ 9

కం॥ కలఁడుజ్జయినీ పురమున
నలఘుభుజుఁడు వీరదేవుఁడను రాజు రమా
నిలయుఁడు పద్మావతి యన
గల దతనికి భార్య పొగడగల సుగుణములన్. 311

వ॥ ఆ రాజు భార్యాసహితుండై పార్వతీదయితు పరమేశ్వరు గుఱించి తపంబుసేసి యొక్క కొడుకుం గూఁతునుం బడసిన నక్కుమారుండు శూరదేవుండను నామంబునను ప్రవర్ధమానసౌందర్యుండగుచునుండె నబ్బాలికయు ననంగలతయను నామంబు దాల్చి, 312

కం॥ నవయౌవన సౌభాగ్య
ప్రవిమల రూపాతిశయ విభాసితయై చా
రువిభాస యయ్యె చిత్తో
ద్భవ రాజ్యవిభూతి యొనరఁదాల్చిన భంగిన్. 313

వ॥ అక్కన్య తనకు శూరుండును గుణసమగ్రుండును సుకుమారుండునైన వాఁడు పురుషుండు గావలయునని సంకల్పంబు చేసి యుండెనంత, 314

శా॥ ఆ కన్యన్ బహుభంగి చెప్పవిని దేవాధీశ్వరు ల్పల్వు రా
లోకింపం జనుదెంచి యందు నిహితాలోలాత్ములై వేఁడి త
త్స్వీకారార్హులు కాకపోయిరి మదిన్ చింతింపుచు న్మిన్నకే
సాకల్యోన్నత సద్గుణుండు గలఁడే చర్చింప నెచ్చోటునన్. 315

వ॥ ఇట్లక్కన్య యెట్టి రాజులనైన వరింపకున్న దాని తండ్రి చింతాకులుండ గుచు నుండె, నంత నొక్కనాఁడు సమాన రూపకళా వయోవిభవశూరులయిన వారు నలువురు వచ్చి వీరదేవుం గాంచి యక్కన్యక నర్థించిన నతండును వారిం జూచి తన యిష్టుండైన మంత్రిచేత వారి కులవిద్యాచరితంబు లడుగం బుచ్చిన నందొక్కరుండిట్లనియె. 316

తే॥ చిత్రవస్త్రముల్ నిర్మించు శిల్పి[1]కర్త
లందు నిరతుండ శూద్రుఁడ నధికధనుఁడ
బలిమి గలవాఁడ రూపసంపత్తి కలిమి
యరసి చూడుఁడు మీరు ప్రత్యక్షమనిన. 317

వ॥ మఱియు రెండవవాఁడు నే వైశ్యుండ సర్వజీవుల భాషలు నే నెఱుంగుదు ననియె, మూఁడవవాఁడు నే రాజపుత్రుండ, ఖడ్గవిద్యయందు నా సమానుండు లేఁడనియె, నాలవవాఁడు నే విప్రుండ మృతసంజీవనవిద్య లెఱుంగుదు తక్కిన రూపశౌర్యాది గుణంబుల నీ నలువుర నొక్క రూపుగా నెఱుంగు మనిన విని వీరదేవుండు సూర్యప్రతిబింబంబులం బోలియున్న యన్నలువురం జూచి సందేహకలితుండై మంత్రులతో విచారించుచుండె నని కథ చెప్పి బేతాళుండు వెండియు నిట్లనియె. 318

క॥ ఆ నరనాయక కన్యక
యా నలువురలోన నెవ్వరికి దగు విమల
జ్ఞానమతి చెప్పుమనినన్
వానికి నిట్లనియె రాజవర్యుం డెలమిన్ 319

తే॥ వైశ్యశూద్రులు కన్యకు వరులుగారు
పాపవర్తనచరితుండు బ్రాహ్మణుండు
క్షత్రియుఁడె భర్తయగు రాజకన్య కదియ
తగును సందేహమేల బేతాళ? యనిన. 320

1. కర్మ.

క॥ బేతాళుఁడదృశ్యుండై
భూతలపతి మూపుడిగ్గి భోరున ధాత్రీ
జాతమున కరిగి శాఖల
నాతతముగ దగిలియుండె నంత రయమునన్. 321

## కథ 10

వ॥ వాని వెనుకంబోయి యెప్పటియట్ల పట్టుకొని వచ్చునెడ నరేంద్రా! నే నొక్క కథ చెప్పెద నది యెట్లంటేని వీరబాహుండను రాజు రాజ్యంబున [1]సంగపురంబను పట్టణంబున నధిక ధనవంతుండైన [2]వైశ్యునకు ధనపాలుం డను కొడుకును, మదనాధిదేవతంబోలిన మదసేనయను కూఁతురుం గలిగి వర్తింపుచుండ ధనపాలుండు నవయౌవన విభూషితుండై ధర్మవైశ్యుండను వైశ్యకుమారుతో చెలిమి చేసిన నొక్కనాఁడు ఆ ధర్మవైశ్యుండు ధనపాలు మందిరంబునకుం బోయి రూపయౌవన లావణ్యనిలయయైనదాని వాని చెలియలింజూచి భ్రూవిలాస (వీ చీ) విచిత్రంబును బాహుమృణాల ప్రకారంబును ముఖారవిందసౌందర్యంబును నేత్రనీలోత్పల విలాసంబైన యా యింతి కాంతి సలిలాశయంబున మునింగిన దృష్టి దిగిచి కొనంజాలక యొక్క ముహూర్తంబు తద్గతమానసుండై యెట్టకేనియు నచ్చోటువాసి తన గృహంబునకు వచ్చి,322

క॥ ఆ యింతినె దలచుచు న
త్యాయత కామాగ్నిపాతమగు నూర్పుల వి
చ్ఛాయాధరుఁడై యాప్త స
హాయ పరిభ్రష్టుఁడగుచు నడలుచునుండెన్. 323

ఉ॥ అంత దినాధినాథుఁడపరాబ్ధికిఁ జేరగ సాంధ్యరాగ వి
క్రాంతి నభంబు బెంపొనరఁగా నరుణచ్ఛవి [3]దాట దిక్కులన్
సంతమసచ్ఛటావలి వెసం బ్రసరింపఁ జకోరబంధుఁడ
త్యంత నితాంతకాంతి నుదయంబొనరించె సుధాకరుండొగిన్. 324

1.ననంగ. 2. వైశ్యుండు కలండతనికి కులనందనుండయిన. 3. దాగి.

సీ॥ తొలిగట్టుపై స్వేచ్ఛ మెలఁగు నుపేంద్రు వ
క్షస్థుల చందన చర్చయనంగ
పూర్వదిక్కామిని పొలుపొంద నిడిన సీ
మంత భాసుర వజ్రమణియనంగ
గరకంఠు కోపాగ్ని కాలిన సంకల్ప
జన్మ సంజీవనౌషధమనంగ
రతిరాజు దిగ్జయారంభోత్సవమున నె
త్తగబంచు చక్రకేతనమనంగ

ఆ॥ దుగ్ధ వార్ధి [1]నీట ద్రోచిన భంగి ను
ప్పొంగియు దిశలెల్ల బూర్ణమగుచు
విమల కాంతి నచ్చ వెన్నెల బొలుపార
నంబరమున నొప్పె నమృతకరుఁడు. 325

వ॥ అయ్యవసరంబున, 326

ఉ॥ ఆరని రౌద్రవహ్నిగల యంగభవుండు మనంబులోపలన్
దూరినయట్ల యెంతయును దుస్తర బాహ్యవియోగవేదనన్
దాని యనన్యవృత్తి [2]ధనవంతుఁడు చిత్తములో ప్రియాంగనన్
జారగనీక మేని వివశత్వమునన్వెడ నిద్రఁ బొందుచున్. 327

మ॥ కలలోనం బ్రియఁగాంచి మేల్కొని మదిన్గాఢోల్లసత్కాముఁడై
చలధైర్యుండట మిత్రులెల్లఁ దను నాశ్వాసింపఁగా వారి ప
ల్కులు దూలించి భయంబు లేక యతఁ డాలోలాక్షి యొక్కర్తెయున్
లలిగ్రీడింపుచు నున్నచోటి కరిగెన్ లజ్జావిహీనాత్ముఁడై. 328

వ॥ ఇట్లు జేరవచ్చి యెద్దియేనియు ప్రసంగంబు కొంత నడిపి యొక వెరవున తన సంగమం బర్థించిన [3]ధనవంతుంజూచి చంద్రసమాగమంబున కైవాడు కమలంబు ననుకరింపుచు తన వదనంబు వాల్చి లజ్జింపుచు నిట్లనియె. 329

---

1. నిట్టి. 2. ధనదత్తుఁడు. 3. ధనదత్తు.

చ॥ అనఘ! సముద్రదత్తుఁడను నాతనికిం గుణశాలి[1]కిచ్చె నా
జనకుఁడు నన్ను బెండ్లి విలసన్మతిజేయగ నున్నవాఁడు నీ
వనుట యిదేమి? యిచ్చటికి వచ్చుట బుద్ధియె? యింక నే బరాం
గనను జేరగాఁ దగునె? కార్యము గాదిది యెన్ని భంగులన్? 330

వ॥ నీవు నా వలన నెంతయు ననురక్తుండ వైతివేని మున్ను వచ్చి నా తండ్రిచేత నన్నుంబడయ[2]వలదె మతిమంతుండ విది నీకు ధర్మంబు గాదనిన దాని పలుకు లాదరింపక గామాతురుండై యాలింగనోత్సుకుండగుచు నిట్లనియె. 331

తే॥ నిన్ను విడిపోయి నప్పుడ నిలువకరుగు
ప్రాణములు తత్క్షణంబున పద్మనయన!
యెవ్వరికిఁ గల్గు నిది కార్యమిది యకార్య
మను విచారంబు ప్రాణవ్యయంబు నపుడు 332

క॥ పరలోకంబున మఱి యె
వ్వరి కేవిధి యగునొ యెఱుఁగ వచ్చునె? నా కీ
పరిహారంబులు చెప్పక
తరుణీ! యధరామృతంబు దయచేయగదే! 333

వ॥ నీ వెడ చేసినం బైబడి యాస్వాదింతు చేతికి వచ్చిన యమృతం బాస్వాదించక వెనకనగు ననుట బుద్ధిలాఘవంబు గాదె! దొరకొన్న నిధానం బప్పుడ చేకొనక మంచిదినం బరయు వారునుం గలరే? యనిన నతని విపరీతంబైన పలుకులు విని భయంబంది మయూరకంచుకం బవలంబించి యానత కటాక్షంబున నతనిని [3]వీక్షింపుచు నిట్లనియె. 334

క॥ నా కన్యావ్రత మిప్పుడు
నీకతమున జెడిన జనకునికి కులమునకున్
గాకున్నె నింద పాప
వ్యాకులచిత్తుఁడువుగాగ! వల దీ భంగిన్. 335

1. కిచ్చి మత్. 2. వలవదె. 3. నిరీక్షింపుచు.

వ॥ పురాకృత పుణ్యఫలంబునంజేసి యా సంబంధంబు బాయకుండితినేని మా తండ్రి పురుషార్థంబు సఫలంబు కాగలదు గావున సముద్రదత్తుచేత పరిణీతనై యట మీఁదవచ్చి నీ యభీష్టంబు సలుపంగల దాననని దాని కొడంబడక ధర్మదత్తుండిట్లనియె. 336

ఆ॥ సకల వస్తువులును సంతరించిన క్రొత్త
చాలమేలు సకల జనహితంబు
మధుర నవ సుగంధమాలిక విడిచి ని
ర్మాల్య మనుభవించు మరులు గలరె. 337

క॥ మానిని యనన్యసేవిత
మైనను బొందంగ నుచితమగు నూరక ని
న్నోనిత్తునె చెయిఁ జిక్కిన
వాని విడిచి వెనుక[1]రాక వలచునె జడుఁడున్. 338

వ॥ అని యొడంబడక నిర్జనస్థానంబగుట దన్ను బట్టనుంకించు నతనిం జూచి భయవిహ్వలయు నిశ్వాసాకులిత వదనయునై యెట్టకేలకు చిత్తంబొక్కింతఁ జేసికొని యక్కన్య యిట్లనియె. 339

సీ॥ ఇది యేల? నీవు నన్నిట్లు నిర్బంధింప
ననఘ! నా పలుకు సత్యంబు వినవె
పోయి వివాహమై పురుషుచే దూషింప
బడక మున్వచ్చి నీ పాల నొక్క
రాత్రి యెల్లను నిల్చి రతి తృప్తిగావించి
పోగల దాన నన్పోవ నిమ్ము
నమ్మజాలవయేని నా సుకృతంబు నీ
ధనమునే వచ్చు నందాక యనుచు

తే॥ శపథమిచ్చిన నెంతయు సంతసిల్లి
ధర్మదత్తుఁడు వోయె నత్తరుణి వదలి

1. రాన.

యతివలకు కృత్రిమ ప్రణయమున రాక
గలుగు వచ్చిన మఱి యట్లకాదు వ్రతము. 340

వ॥ లగ్నదినంబు చేరవచ్చిన తల్లిదండ్రులు కాలోచితంబులైన మంగళోప చారంబులు [1]సమర్పించి యకన్య ననేకాభరణ భూషితంజేసి సముద్రదత్తునకు వివాహంబు గావించి మహావిభవం బభినవంబుగా దదీయోత్సవం బొనరించి రంత నా రాత్రి సురభి కుసుమమాలికాలంకృతంబైన క్రీడాభవనంబు నందు విశుద్ధ కనకశయ్యాతలంబు మీఁద దంపతులు సుఖాసీనులై రట్టి సమయంబున లజ్జాభరంబున మొగమెత్తక యోసరించియున్న యత్తన్విం జూచి చిత్తజాయత్త చిత్తుండై సముద్రదత్తుండు, 341

సీ॥ అనురక్తుఁడై మృదులాలాపముల లజ్జ
యుబ్బడగించి యర్థోక్తి వడసి
యందంద తనులత నత్తమిల్లుచు నొయ్య
నాలింగన క్రియ కనువు కొలిపి
చతురవాక్యవిలాస సంపద నధర ప
ల్లవ సుధారసధారల గ్రహించి
నీవి బంధము మీఁద నిజకరాగ్రమునకు
పాయక విహరించ పట్టు జేసి

ఆ॥ కాంక్షతోడ దన్ను గవయంగ దలచిన
పతి తలంపెరింగి యతివ తనదు
తలపు జెప్పనింక వలయు నటంచును
లజ్జయెట్టకేని యుజ్జగించి. 342

వ॥ సముద్రదత్తుంజూచి మందవచనంబుల నిట్లనియె. 343

ఆ॥ బాలకేలఁ గల్గు [2]ప్రౌఢకుఁ గలనేర్పు?
పతికి నేల యందు భజన పుట్టు?
సౌరభంబు లేని సహకారలత [3]కేల?
తేఁటి యాట [4]యేల దివుటుసేయు. 344

1.సమవర్తించి. 2.ప్రౌఢను. 3. నేల. 4. వేడ్క.

క॥ అని యతని చేత వదలిన
గనయంబును కేలు బలువుగాజేయుచు న
వ్వనజానన మఱియును ని
ట్లనియెన్ లజ్జయు భయంబు నడచి మృదూక్తిన్. 345

క॥ నేనొకటి నీకు జెప్పం
గా నోడెద నైన జెప్పగావలయును ధై
ర్యానుగత చిత్తమున నవ
ధానంబొనరించి వినగదగు నెట్లనినన్? 346

వ॥ ధర్మదత్తుండను వైశ్యుండు నన్నుం గామించి పట్టుకొని యెట్లైనను విడువకున్న నతని నెమ్మొగము భయంబునంజేసి వివాహంబైన యనంతరంబ మున్ను వచ్చి నిన్నుం బొందంగలదాననని శపథంబుచేసి విడిపించుకొనివచ్చితి గావున సత్యభంగంబు సేయంజాలక చింతింపుచున్నదాన నిక్కార్యంబున కొడంబడ వలయుననిన దాని పలుకులు విని, 347

క॥ నీ సత్యము దప్పగ నే
లా సరభస వృత్తి బోవలయు? బొమ్మని యం
దాసక్తి వదలె వైశ్యుం
డా సుదతియు వీడుకొని రయంబున నరిగెన్. 348

క॥ తొడవులతో జీకటి యని
యెడు భయమింతయును లేక యేకాకినియై
నడురేయి బోవుచుండగ
గడు రయమున జోరుఁడొకఁడు కని పరతెంచెన్. 349

వ॥ ఇట్లరుగుదెంచి, 350

సీ॥ కోరమీసలు, మిడిగ్రుడ్లును, విస్తీర్ణ
మైన వక్షంబు, మహాభుజములు,
కఱకులౌ వెంట్రుకల్కాలాంజనంపు ప్రో
కయపోని యాతని కఠినతనువు,

మలినవస్త్రంబు, దుర్మదనిష్ఠురోక్తులు
గలిగి భయంకరాకారుఁడగుచు
నతి దారుణంబైన యంధకారంబను
శబరసేనకు పురస్సరుఁడ పోలె

తే॥ నమర నక్షత్ర రత్నాపహరణమునకు
దివము బ్రాక నమర్చు రజ్జువును బోలె
తీవ్ర ఖడ్గప్రభల్ దివి దీటుకొనగ
నదయుఁడై వచ్చి యాగి కట్టెదుర నిలిచె. 351

వ॥ వినూత్న రత్నహారాలంకృతయై తారకాగణంబులు గొలువ మూర్తి మతియైన రాత్రింబోలు దాని కర్ణోత్పల ప్రభల ననుకరించిన తమఃపటలంబు చేత నలంకృతయైన దాని వినోదార్థం బేకాంతంబ విహరింపుచున్న యక్షకన్య వోలె నతిమనోహరంబైన దానింజూచి రాజకదలీ సమాకర్షణంబు చేయు గజంబు చందంబున నయ్యింతి కరపల్లవంబు బట్టి తిగిచి నీవెక్కడి దాన వింత ప్రొద్దొక్కతె వెక్కడబోయెద వని వెండియు నిట్లనియె. 352

క॥ వనజాక్షి! నిన్ను దన [1]వెనుకం
జన జేసిన ధన్యు జెప్పు జాలవు నీవా
మనసిజుఁడు పుష్పధన్వుఁడు
పెనుప్రాపుగ పోయెదెట్లు [2]పిరుతివక వడిన్ 353

వ॥ ఏ నిన్ను సర్వస్వాపహారంబపహరింప వచ్చిన చోరుండ నిన్నెక్కడికిం బోవనీ ననిన విని యెట్లైన నా తొడవులన్నియు బుచ్చుకొని నన్ను బోవనిమ్మనిన నయ్యింతిం జూచి చోరుండిట్లనియె. 354

క॥ మనసిజుని రాజ్యలక్ష్మికి
నెనయగు నిను బోవ విడచి యిట నీ తొడవు
ల్గొనునంత వెఱ్ఱివాఁడనె?
వనజానన! నిన్ను నేలవదలుదు ననినన్. 355

---

1.దన వెను. 2. వెరవవు మదిలోన్.

క॥ నే నీ వడిగిన యతనిం
గానం జని మాటలాడి క్రమ్మర నిన్నుం
బూని వరింపగ వచ్చెద
బోనిమ్మనవుడును వాఁడు పొలతికి ననియెన్. 356

ఆ॥ మగుడి వత్తుననుచు మదిరాక్షి! నీవు న
న్వొడ్డు పెట్టుటయును విడుతునెట్లు
కంఠకలిత రత్నకంఠిక నొల్లక
వీచివైచునట్టి వెడఁగు గలఁడె? 357

క॥ కడు చిత్రము నీ క్రమ మి
ప్పుడు బోవుచు వత్తుననుట పోయిన నరులుం
బడతులును మగుడి వచ్చుట
బొడమునె? యెచ్చోటునైన భూమి దలంపన్. 358

వ॥ అనిన విని వాఁడతి సాహసుండుగా నెఱింగి తన వృత్తాంతంబంతయుఁ జెప్పిన విని యతండు విస్మితుండై యాగ్రహంబుడిగి నీవు సత్యము దప్పక వచ్చెదనని ధర్మదత్తునకు జేసినట్ల శపథంబు నాకుంజేసి పొమ్మనిన నొడంబడి యట్లచేసి విడిపించుకొని ధర్మదత్తుపాలికింబోయి నీకు ప్రతిశ్రుతంబుసేసిన యట్ల వచ్చితిననిన నతండయ్యింతిం జూచి యాశ్చర్యపూరితహృదయుండును గళితరాగుండునునై యిట్లనియె. 359

క॥ అతివా! సత్యము దప్పక
ధృతిచే జనుదెంచితీవు దేవతవొ? జగ
న్నుతవో? సుందరి నిను బర
సతి గోరగ దగదు నాకు సమ్మతినింకన్. 360

క॥ నీ పురుషుఁడున్నచోటికి
వే పోదగు ననిన నతని వీడ్కొని సత్యా
లాపరత చోరు నిలిపిన
యా పట్టున కరుగుదెంచె నతి రభసమునన్. 361

వ॥ ఇట్లు వచ్చిన వాఁడును నత్తన్వి సత్యపరాయణత్వంబున కతివిస్మితుండై సంతోషించి సత్యసంధుండు గావున దానిం గావింపక తొడవులు గొనక సబహుమానంబుగా వీడ్కొలుప నెప్పటియట్ల నిజేశ్వరు పాలికింబోయి పోయి వచ్చిన తెఱంగంతయుం జెప్పి యతనింబొంది యభిమత సుఖంబులనుభవింపు చుండెనని కథ చెప్పి బేతాళుండు వెండియు నిట్లనియె. 362

క॥ మనుజేశ! ధర్మదత్తుం
దును మఱియు సముద్రదత్తుఁడును నా చోరుం
దును నీ మువ్వరి లోపల
ననఘా! సత్యాత్ముండెవ్వఁడని యడుగుటయున్. 363

వ॥ విక్రమసేనుండిట్లనియె. 364

సీ॥ తత్తన్విపై ధర్మదత్తుని కనురక్తి
గలదు గల్గిన పరకాంత యగుట
యెల్లవారలకును తెల్లంబు గావున
వదలె నా వైశ్యుఁడవ్వనిత కేళి
సలుపక రాజబాధకోడి, మఱి యా స
ముద్రదత్తుండు నమ్ముదిత దనకు
దయితయై పరసేవ దగగోరె గావున
దాని విసర్జింప దగు నతనికి

ఆ॥ బ్రముచ్చు వినవె ప్రాణములపైని వచ్చిన
నర్థకాంక్ష విడువ డట్టివాఁడు
దరుణి దాని సొమ్ము దా విడ్చె గావున
వాఁడు సూవె ధర్మవంతుఁడరయ. 365

క॥ అనవుడు బేతాళుం డ
మ్మనుజేశ్వరు మూపు డిగ్గి బ్రమాకున కరిగెన్
వెనుక జని పట్టుకొని వడి
జనుదేరగ వాఁడునగుచు జనపతి కనియెన్. 366

# కథ 11

వ॥ నరేంద్రా! నీ వ్యవసాయంబు నిర్హేతుకంబైన నింక నొక్క కథఁ జెప్పెద నది యెట్లంటేని యుజ్జయినీశ్వరుండయిన వాఁడు ధర్మధ్వజుండను రాజు గలం డతనికి నిందురేఖయనునదియును తారావతి మృగాంకదత్తలను వారును ముువ్వురుభార్యలు రూపలావణ్యకాంతివిలసితలు గలరు. వారి యంద నురక్తుండై యా రాజు రాజ్యంబు సేయుచుండ కాలక్రమంబున వసంత సమయంబు వచ్చిన. 367

మ॥ మలయాద్రీంద్ర సమాగతానిల చలన్మాకంద రంభాది వృ
క్షలతాబంధుర గంధరాజిత దిశాచక్రంబులై సంచర
త్కలపుంస్కోకిల కీరషట్పద నినాదంబుల్జెలంగ న్వనం
బులు శోభిల్లె వసంత వాసరమునన్ భూమి న్విభూషింపుచున్. 368

వ॥ ఇట్లతిరమ్యంబైన వసంతసమయ సింహంబు [1]సీధువాసనావాసిత నికటకలిత వినూత్న హరిరత్న ప్రభాభ్రమర సఖీముఖారావ విరాజిత [2]మాలినీ మాతంగ [3]విదారుణ ప్రవీణంబగుచుండ ధర్మధ్వజుండొక్కనాఁడు దేవీత్రయ సహితుండై యుద్యానవసంతోత్సవంబు సేయుచు సుఖసత్కథావినోదంబుల గ్రీడింపుచుండ నిందురేఖయను దేవివీక్షణంబులు దిశాభాగంబుల నిందీవరమాలికా సుందరంబులై పల్లవింపుచుండ, 369

ఆ॥ దాని కర్ణోత్ప[4]లము గంధమున కెగరు
తేఁటికతమున నప్పుడు దెరలి పడిన
నూరు భాగంబు గమలిన నొడలి నొప్పి
సైపజాలక యడల నజ్జనవిభుండు. 370

వ॥ దాసీగణంబుతోగూడ నద్దేవి నంతఃపురంబునకుం బుచ్చిన నచ్చోట నిర్మలస్ఫటిక పర్యంకంబుపై మూర్ఛిల్లి నిమీలిత నయనయై యుండె నంత జగద్గృహదీపంబైన నూర్యుండస్తాచలపశ్చిమభాగంబునకరుగ మయూరపింఛాకారంబై యంధకారం బంతకంతకు నితాంతంబై యరుగుదెంచె నంత, 371

1. ధునీ. 2. మానినీ. 3. విదారణ. 4. లంపు.

కః రజనీ రమణీ ప్రియుఁ డం
గజసామ్రాజ్యాధికారి కైరవలక్ష్మీ
భజనీయుఁడు చంద్రుడు స
ర్వజనానందకుఁ డుడుగణవరుఁ డుదయించెన్. 372

వః ఇట్లుదయించి కాంతాస్మిత వదనానుకారియై చంద్రికా జాలంబు లోకానంద కరంబుగా సుధాంశుండు వసంతరాత్రు లలంకరింపుచుండె నట్టి సమయంబున, 373

కః తారావతి యను దేవియు
నా రాజవరుండు బహువిధాంగజ కేళిం
గూడి సురతాధికశ్రమ
మారగ నిద్రించి రమలహర్మ్యము మీఁదన్. 374

వః అప్పుడు మధుపానమత్తయు సురతశ్రమ పరిపూర్ణగాత్రయునైన కతంబున దేహంబెఱుంగక వస్త్రంబపనయించిన యా తారావతి శరీరంబునందు చంద్రకిరణంబులు దాకి బలుపెక్కులెగసి సర్పదష్టయుంబోలె, నగ్నిచుంబిత తెఱంగున, నులికిపడి మేలుకాంచి యమంద వేదన సహింపక పొరలుచున్న నంతఃపురంబునకుం దోడ్కొని వచ్చి కమలదళ శయ్యపై నునిచి బహువిధ శిశిరోపచారంబులు చేయించి వెండియు నర్ధరాత్రసమయంబున సౌధంబు మీఁదికి వచ్చి యొక్క కంచుకింజూచి, 375

ఆః ఆ మృగాంకదత్తయను దేవియం దను
రక్తహృదయుఁడై ధరావరుండు
రతిసుఖార్థియగుచు [1]రాజు బుచ్చుట విలా
సంబుదనర నదియు సమ్మదమున. 376

వః నిశ్శబ్ద విజనప్రచారంబైన యా యర్ధరాత్రసమయంబున రత్నమేఖలారవంబు చెలంగవచ్చి యొక్క యెడ బెడిదంబైన ముసలధ్వని విని కమలాయమానంబులైన

1. రాబుచ్చుటయు.

కరంబుల బొక్కులెగసిన బిట్టులికిపడి మధుపంబులు గుట్టినవని హాహారవంబు చెలంగ నాక్రోశింపుచు నెట్టకేనియు వచ్చు నిజ[1]వల్లభకెదురు సని తోడ్కొని వచ్చి శ్రీఖండరసంబున [2]నప్పళింపుచు మణి[3]వీజనంబు ఒలయింపుచుండె నంత రాత్రిశేషంబరిగెనని కథచెప్పి బేతాళుండమ్మువ్వురలో నెవ్వరి శరీరం బతి[4]సౌకుమార్యంబు వివరింపు మనిన వానికి విక్రమార్కుం డిట్లనియె. 377

కః తలపగనే లలనకు రోఁ
కలిచప్పుడు విన్నమాత్ర కరపల్లవముల్
చలియించి పొక్కెనట యా
లలనయ కడు సౌకుమార్య లలితాంగి యగున్. 378

కః అనవుడు నలక్షితుండై
మనుజేశ్వరు మూపుడిగ్గి వ్రాకున కరిగెన్
వెనుక జని పట్టుకొని వ
చ్చునెడన్వాడిట్టులనియె శూరతమునకున్. 379

## కథ 12

ఆః పెక్కు సంశయములు భేదించి చెప్పితి
దేవసముఁడ వీవు గేవలుఁడవె
పొగడజాల నీదు బుద్ధి యింకొక కథ
యవధరింపవలయు నవనినాథ! 380

సీః పోల్చు నెవ్వనియశఃపుండరీకమునకు
నాగవల్లభుఁడు మృణాలమగుచు
పాడుదు రెవ్వనిపౌరుషంబును వేడ్క
గంధర్వ కిన్నర కాంతలెపుడు
తలతు రెవ్వనిసుప్రతాపంబు విని లంక
ప్రాంత రాక్షసులు శ్రీరామచరిత

1. వల్లభి. 2. అప్పళింపుమని. 3. వ్యంజనంబు. 4. సుకుమారం.

యొప్పు నెవ్వనియాజ్ఞ యుర్వీపురంధ్రికి
కమనీయ రత్నమేఖల యనంగ

ఆ॥ నెల్ల భూములందు నెవ్వని గుణములు
వినగబడియె మఱియు వినుతి కెక్కె
నట్టి రాజు తొల్లి యంగాధిపతి యశః
కేతుఁడనఁ గలండ కిల్బిషుండు 381

చ॥ అతనికి దీర్ఘదర్శియను నాతఁడు మంత్రి యథార్థనాముఁ డా
యతమతి సత్కళాకలితుఁడాతని నీతినిజేసి ధూతమం
త్రితుడయి శత్రుఁడా నృపధృతింగలనైన దలంపనోడు శూ
రతముఁడు వానిఁ బ్రేమ దన రాజ్యభరంబునఁ బెట్టి లీలతోన్. 382

వ॥ ఆ రాజు తారాగణ పరివృతుండైన చంద్రుండునుం బోలె నిరంతరంబును కాంతాజనపరివృతుండై మనోభవరణాసక్తుండగుచునుండ కొండొక కాలంబునకు మంత్రిపుంగవుండు కోశదుర్గబలకలితుండై రాజ్యంబున కెల్లం దాన యొడయండై యుండెనంత, 383

క॥ అకట! మంత్రివరుఁడు యవనికి రాజయ్యె
కామమోహముననను కలిగి రాజు
నయ్యె నామమాత్రుఁడను వార్త విని మంత్రి
శేఖరుండు దురిత చింతనొంది. 384

వ॥ సుబుద్ధియైన భార్యతో తన వృత్తాంతంబంతయు జెప్పి మనంబున విచారించి యర్ధరాత్రంబున వెడలి సముద్రతీరంబుజేరి సుపర్ణద్వీపంబునకుం బోయెడి నిధిదత్తుండను సార్థవాహకుతో జెలిమిచేసి వాని కలంబెక్కి సముద్ర మధ్యంబునకుంబోయి యందొక్క నివాతప్రదేశంబున విమలస్ఫటిక పర్వత శిఖరంబునుంబోలె నెగసిన సలిలస్తంభంబు మీఁద (మథన భయంబున వెలువడిన కల్పవృక్షంబునుంబోలె విద్రుమస్కంధబంధురంబైన విచిత్రరత్న లతావితాన శోభితంబైన సువర్ణవృక్షమధ్యంబున మాణిక్యపర్యంకంబు మీఁద) మూర్తి మతియయిన సముద్రాధిదేవతయుం బోలె నున్నదాని, 385

క॥ తరళాక్షి ప్రవాళాధర
సురుచిర నీరేజకాంతి సుందరవదనాం

బురుహ ప్రభాన్వితమౌక్తిక
దరహాస విలాస నొక్క తరుణింగనియెన్. 386

వ॥ కని విస్మితుండై చూచుచుండెనంత నక్కన్నియ వీణాదండంబునందార్యా వృత్తద్వయంబిట్లని వాయించె. 387

శ్లో॥ యదా విహిత సంప్రాప్త మసౌ దత్తస్స్వయం యది
ఆకృష్య నీయతే కర్మపాశబద్ధైర్నరై స్తథా॥ 388

శ్లో॥ శుభాశుభాని కర్మాణి వర్తంతే పురతోన్నృణామ్
పుష్పేచ గంధవద్రత్నే రుచివన్నిత్యముత్కటమ్॥ 389

క॥ ఏ కాల మెవ్వఁడెయ్యది
ప్రాకటముగఁ జేయు దాని ప్రాపింపగలం
డా కాలము తత్కర్మ
ప్రాకటపాశముల దిగువబడి చని పెలుచున్ 390

క॥ జనుల శుభాశుభకర్మము
లనవరతము వారిమ్రోల నవి చలితములై
చను పుష్పంబుల గంధం
బును బోలెను లలితరత్నముల రుచివోలెన్ 391

వ॥ అని యిట్లు వీణాక్వణకలితంబైన గీతంబు శ్రవణామృతంబొనరించి పర్యంకంబుతో నయ్యింతి యదృశ్యమయిన దాని పోవుట కాశ్చర్య నిశ్చలుండై యున్న దీర్ఘదర్శింజూచి నవ్వుచు బర్బరుండను కలంపు నాయకుం డిట్లనియె. 392

క॥ ఇది యేల విస్మితుఁడ వ
య్యెద నిచ్చట నెపుడు మెలగు నిక్కన్యక యే
మిదియో యిది తానెవ్వరి
యది యో తన కులముపేరు[1]నవి [2]యెయ్యవియో! 393

1. నది. 2. య్యది.

వ॥ అని కర్ణధారుండు నవ్వుచుండె, నంత ననుకూల పవనంబునం జేసి కలంబు కనకద్వీపంబు చేరిన నర్థవాహుండు దీర్ఘదర్శిసహితుండై తన గృహంబునకుం బోయి కృతకృత్యుండై సుఖంబుండె నతని యొద్ద గొండొక కాలంబుండి దీర్ఘదర్శి క్రమ్మరం దన నగరంబునకు వచ్చు నంతకమున్న. 394

క॥ తన మంత్రి బాసి పోయిన
నవిశము దుఃఖమును బొంది యాతఁడు మగుడన్
జనుదెంచె ననుట విని సం
జనితానందాత్ముఁడయి యశఃకేతుండున్ 395

వ॥ దీర్ఘదర్శిం బిలుపించుకొని యందంద గౌఁగలించుకొని త్రైలోక్యంబు నేలినంత సంతోషించి నన్నును రాజ్యంబును నీకుటుంబంబును విడిచి నీకుం బోవందగునే యనిన నతండిట్లనియె. 396

క॥ దేవరభృత్యుఁడనై యొరు
సేవింతునె పుణ్యతీర్థసేవలు సేయం
గావేఁడి బోయి వచ్చితి
నీవె శరుణ్యుఁడవు నాకు నిరుపమ తేజా! 397

క॥ అని పల్కి సముద్రంబున
తన చూచిన దివ్యకాంత [1]దగవోవక పెం
పొనరంగా వర్ణించుడు
ననుపమితోత్కంఠ హృదయుఁడై నరపతియున్. 398

ఆ॥ ఆ లతాంగి జూతునని సంతసమున న
నన్యకార్యుఁడయ్యె నట్లకాదె
దలఁప పూర్వజనులు దయితాజనము హృద
యమున దూర వినిన యంతజేసి. 399

వ॥ తొంటియట్ల తన రాజ్యంబునకెల్ల మంత్రివర్యు నియోగించి కామా తురుండై యొక్కరుండును వెడలి నదీశైలకానన గ్రామంబులు గ్రమక్రమంబున గడచుచు

1. దని

శ్రీ పర్వతంబునకుం బోయి హరప్రేయసియైన మహాదేవికి నమస్కరించి కుశనాథుండను మునీంద్రు పాలికింబోయిన నతండు నీకు దయితా లాభంబగు నని చెప్పి యనునయించి యక్షదంతుండను సార్థవాహుతో జెలిమిజేసి వానితో గలంబెక్కి పొమ్మనిన నట్లసేయుదు నని సముద్రతీరంబునకు వచ్చి యాసార్థవాహుంగాంచి యతనితోడం గలంబెక్కి పోయి సముద్ర మధ్యంబున వైడూర్యరేఖాకారంబులైన యుత్తుంగ తరంగంబుల నడుమ, 400

మ॥ సలిలస్తంభము మీద హేమమయ వృక్షస్కంధభాగంబునన్
విలసన్నూతన రత్నతల్పము పయి న్వీణారవైకాంత మం
జుల గానంబును బాడుచున్న తరుణిం జూచెన్ జగన్మోహనా
లలితోదార విలాస విభ్రమ విభాలంకార శాతోదరిన్. 401

ఆ॥ ఇట్టి రూప మహిమ [1]యిట్టి తేజఃకాంతి
విభ్రమ ప్రభావ విలసనంబు
లిట్టి దివ్యరూపమెందునైనను నెద్ది
యో యటంచు విస్మయోక్తులెసగ! 402

వ॥ పొగడుచు నందంద శిరఃకంపబుసేయుచు [2]డగ్గరి నయ్యింతి లయ తాళానుగతంబుగా విచిత్ర పదమాలికానుబంధంబుగా గీతంబభినయించి కనకవృక్ష పర్యంకసహితయై సముద్రంబున మునింగిన నాశ్చర్యంబునొంది యశఃకేతుండును మునుగందలచి, 403

క॥ జయ భగవతిదేవీ! హరి
ప్రియ వారిధిపుత్రి! పద్మపీఠాశ్రయ! నం
దయ జూచి యా లతాంగిం
బ్రియమొనరగ నిమ్ము నా యభీష్టంబెసగన్. 404

వ॥ అని లక్ష్మీప్రార్థనంబుసేసి యక్కాంతయందు నిహితమానసుండై శరీరానుగతం బైన కామానలంబు శాంతంబుసేయందలంచినవాడునుం బోలె యతి సాహసుండై యక్కన్య మునింగినచోటన యురికె నంత నా సార్థవాహుం డతండు తన్నుంబాసి పోవుటకు దుఃఖితుండై యాకాశవాణివలన నతని

1. మిట్టి. 2. చూచుచున్న.

వృత్తాంతంబెరింగి తద్వియోగదుఃఖం బెడలి నిజద్వీపంబునకుంబోయి సుఖంబుండె నంత నిక్కడ, 405

ఉ॥ వీతభయుండు వార్ధి తన విక్రమమొప్ప మునింగి యా యశః
కేతుఁడువోయి కాంచె మణికేతన తోరణరాజితంబు హే
మాతత దీప్రవప్రము సమంచిత నిర్మల హర్మ్యమాలికా
న్వీతమునై బెడంగడరి నిర్జనమైన పురంబు నొక్కచోన్. 406

వ॥ ఇట్లు కాంచి పురంబత్యంత రమణీయంబును జనశూన్యంబైన యది యని విస్మయంబంది యా కన్యనిందు వెదకుదునని తిరుగుచో నొక్క యెడ మాణిక్యమయంబైన శిలాగేహంబునందు కనకపర్యంకంబు మీఁద శయనించి యున్న కన్యంజూచి, 407

క॥ లలన ముసుగిడిన వస్త్రము
తొలగించి ముఖాబ్జ మపగతుండై చూచెన్
నలినీముఖ వివరమ్మున్
సొలవక దొలగించి చూచు సూర్యుడపోలెన్. 408

చ॥ అదియును నంతమేలుకని యా నరనాయకు జూచి విస్మయం
బొదవగ నీతఁడెవ్వరొకొ? పూజితతేజుఁడు చక్రవర్తి సం
పదకుచితుండు గావలయు భాసురరూపవిలాస లక్షణా
స్పదుఁడనుచుం దలంచెను విచారమునన్మతియున్మనమ్ములోన్. 409

వ॥ తొల్లి యశఃకేతుని వృత్తాంతంబు కామసంచారులైన సఖులవలన విని యతనియందు బద్ధానురాగయై యున్నకతంబున శ్రుతలక్షణలక్షితుండగు నతండు యశఃకేతుండుగావలయునని తలంచి యనంగసుభగంబైన యంగంబునం బులకాంకురంబు లెసంగ లజ్జాకలితయగుచు నతని దన పర్యంకంబుపయినునిచి యర్ఘసత్కారంబు లొనరించి మెల్లన యాగమన ప్రయోజనంబెఱుగ నడిగిన నామాభిజనంబులు నిజంబుగా నెఱింగి, 410

క॥ బాలిక కంపస్వేదజ
లాలంకృత మృదులగాత్రియై విలసిల్లెన్

[1]నీలాంబు ప్రతిబింబిత
బాలేందు కళావిలాస భాసురలీలన్. 411

కII ఆ రాజపుంగవునిచే
వారిజదళనయన కపుడు వర్ధిత హర్ష
స్ఫారవికాసముగా బెం
పారగ రతిసంగమయ్యె నయ్యిరువురకున్. 412

కII నవసంగమంబుననయా
యువతుల చిత్తముల లజ్జ యుడిగించి మనో
భవుఁ డత్యాయత రతుఁడై
వివిధకళాప్రౌఢిగల వివేకము జేయున్. 413

ఆII లజ్జ యుజ్జగించి లలితాంగి యిట్లను
నీ యధీననైతి నిక్కమేను
గీతకీర్తి వినవె కృష్ణాష్టమీ చతు
ర్దశులయందు నన్ను దలగవలయు. 414

కII అని యక్కన్యక చెప్పిన
జనవిభుఁ డొడబడియె నట్లు సమయము దమలో
నొనరించి కామకేళీ
వినియోజిత హృదయులగుచు వేడుకదనరన్. 415

కII ఆలింగనాది చేష్టా
వ్యాలోలతరాంగుఁడైన యాత్మేశునకున్
బాలిక ప్రౌఢోచిత కా
ర్యాలంకృత యగుచు చిత్తహారిణి యయ్యెన్. 416

వII ఇట్లు వికల్పరహితంబై నిస్సీమంబైన సంభోగంబిరువురకు వర్తింపుచుండె నంత నయ్యింతి కృష్ణచతుర్దశినాఁడు యశఃకేతు నొక్క విరులమంటపంబునం

1. లా.

బెట్టి యనుజ్ఞాతయై వెడలిపోయిన యన్నరేంద్రుండును నలక్షితుండై ఖడ్గంబు ధరియించి దాని వెనుకన దూరంబువోయె నంత కాలాకారుండైన కృతాంత సంతనుండను రాక్షసుచేతం బట్టువడి రాహుగ్రస్తయైన చంద్రకళయుం బోలె నున్న యన్నాతిం జూచి చేరంబోవ నంతకుమున్నవాఁడు నయ్యింతి మ్రింగిన దుఃఖరోషాకులుండై ఖడ్గంబెత్తి వాని శిరంబు ద్రుంచి యుదర విదళనంబు చేసిన, 417

ఆ॥ వాని కడుపువలన వనిత వెల్వడి వచ్చె
శాపమెడలి కాంతిసహిత యగుచు
రాహుముఖమువలన రాజబింబమువోలె
ధరణిపతికి యద్భుతంబు దనర! 418

వ॥ ఇట్లు వెల్వడి నిజేశ్వరు మొగంబుచూచి తన వృత్తాంతం బంతయు నిట్లని యెఱింగించె నేను మృగాంకసేనుండను విద్యాధరుకూఁతుర, మృగాంక వతియనుదాన, నాకు తమ్ములు నల్వురు, పుత్రసమన్వితుండైయున్న మా తండ్రి తన భోజన సమయంబున నన్నుం దోడ్కొని పోయి పొత్తున భోజనంబు సేయింప గరంబు గారాబంబునం బెరుగుచున్న నొక్క కృష్ణచతుర్దశినాఁడు మా తండ్రి యేను గౌరీవ్రతనిమిత్తంబుపవసించి తనతో గుడువకున్న దానును నుపవసించి క్షుత్పీడితుండై కోపించి కృష్ణాష్టమిచతుర్దశులందు రాక్షసుండు నిన్ను భక్షించి క్రమ్మర వెలువరించంగలవాఁడని శాపంబిచ్చె జనకుండు. గావున దయాళుండై వెండియు నంగపతియైన యశఃకేతుండు నీకు భర్తయై వచ్చి యా రాక్షసుం జంపిన నాఁడు నీకు శాపమోక్షంబగునని యుపదేశించిన వాఁడు, గావున నేఁడు నీ కతంబున రాక్షసుండు నీల్గిన నాకు శాపమోక్షంబయ్యె. మత్సఖులవలన భవద్వృత్తాంతంబు వినుటను మా తండ్రి యుపదేశంబునను నీ రాక కెదురుచూచుచున్నయెడ నేతించి నా మనోరథ సిద్ధియు శాపమోక్షం బునుం గావించితివి. కృతకృత్యనైతి నింక నా విద్యాధరపదంబునకుంబోయెద ననుమతింపవలయు ననిన నయ్యింతి పలుకులు విని యశఃకేతుండు తద్వియోగంబు సహింపంజాలక దానికిట్లనియె. 419

క॥ వనజాక్షి! నీ పదమునకు
నను వీడ్కొని చనియెదేని నా కింతప్రియం

బొనరింపు మేడు దినములు
మనమలరగ నేను నీవు మసలుద మిచటన్ 420

కః అని వేఁడు నతని సంప్రా
ర్థన చేకొని నిల్చి తరుణి ధరణీశుఁడు దా
నును రుచిరోద్యానంబున
ననిశము గ్రీడింపుచుండె ననురాగముతోన్. 421

వః మఱియు నొక్కనాఁడు కనకకదళీవన మధ్యంబున పుణ్యసరసియందు నిరువురుం గ్రీడసేయుచు యశఃకేతుండయ్యింతింబట్టుకొని మునింగి తన యోగబలంబున స్వపురోద్యానసరసియం దెగసి నిజప్రధానియగు దీర్ఘదర్శి నుద్యానపాలుచేతం బిలుపించి తన వృత్తాంతంబంతయుం జెప్పి సకలజనానందంబుగా రాజ్య పదస్థుండై ప్రియాలాభమహోత్సవంబొనరించిన, 422

ఆః ఆ లతాంగి యంత నయ్యేడుదినములు
బోవుటెఱిఁగి దివికిఁ బోవఁ దలఁచి
యధిపు వీడుకొనియు నరుగనేరదు నిజ
విద్య మఱచి గగనవీథియందు. 423

వః మానుషసంయోగంబునంజేసి తన విద్యాధరవిద్య మరచి దివికిం బోనేరకున్న ప్రియంజూచి యశఃకేతుం డానందకందళితహృదయుండై మహోత్సవం బొనరించె. నంత నయ్యుత్సవదినంబునందు దీర్ఘదర్శి గత ప్రాణుండైన నతండు చచ్చుటకు కారణంబెవ్వరు నెఱుంగక సకలజనంబులు విస్మయాకులితులగు చుండిరని కథచెప్పి బేతాళుండు విక్రమార్కున కిట్లనియె. 424

సీః తను మున్నుజూచిన తరళాక్షి తనకు చే
కూరక పతికి చేకూరెననియొ
దాని నాలోకించి తగబొంద లేమికి
బొగిలి సంతాపంబు బొందియొక్కొ
యా రాజు సామ్రాజ్యమంతయు మఱి తాన
యున్నతి జేకొని యున్నవాఁడు

గావున [1]నాతని గనుగొని యతిభీతి
నందుటయును గుండె లవసి యొక్కొ

ఆ॥ తెవులు నొప్పి లేదు దీర్ఘదర్శికి నైన
మరణకారణంబు మనుజనాథ!
బుద్ధి నరసి నీవు పొలుపుగా జెప్పుమా
యనిన నతనికిట్టులనియె నృపతి. 425

ఆ॥ రాజు దాస్యభావరాగి మూర్ఖెంతయు
నట్టి దివ్యకాంత యతనిబొందె
నఖిలకార్యభేదినగు నింత నతనికిం
తల్లడమున హృదయ దళన మగుట. 426

వ॥ దీర్ఘదర్శి కపాయంబు బుట్టెననిన విని బేతాళుండదృశ్యుండై వృక్షంబునకుం బారిన వెనుకంబోయి పట్టుకొని వచ్చునెడ విక్రమసేనునకు వాడిట్లనియె. 427

## కథ 13

సీ॥ అవనీశ! యొక కథయందు సందియ మెద
గలుగు నా కెప్పుడు కడకవినుము
వారణాసీ పురవాసి దేవస్వామి
యను బ్రాహ్మణుఁడు గలఁ డధికధనుఁడు
తత్పుత్రుఁడైశ్వర్య తారుణ్య [2]మునిహరి
స్వామి యనంగను జనునతనికి
లావణ్యవతి [3]యన లక్షణవతి భార్య
గలదు త్రైలోక్య సౌందర్యలక్ష్మి!

ఆ॥ యా వధూలలామ యాత్మేశ్వరిని బొంది
హర్మ్యతలము మీఁద నంగజాత
కేళి సలిపె సురతఖిన్నయై సుఖనిద్ర
బొందె బతియు నిద్రబోయె నంత. 428

1.నతని రాకకు నతిభీతిని. 2. ఫణిహారి. 3. నయ.

వ॥ ఆకాశంబున జరియింపుచు మదనవేగుండను ఖేచరుండయ్యింతిఁ జేరి విగతాంబరంబైన చారుజఘనప్రదేశంబు చూచి కామాతురుండై యలక్షితుండై దాని నెత్తుకొనిపోయె నంత ప్రభాతంబైన హరిస్వామి మేల్కని నలుదిక్కులరసి చూచి తనభార్యం గానక వియోగమూర్ఛితుండై యొక్క ముహూర్తంబునకుం దెలిసి, 429

ఉ॥ ఓ వనితాలలామ! సుగుణోన్నత! యెక్కడనున్న దానవే?
నీ విలసన్ముఖాంబుజము నెక్కొనఁ జూడకయున్న ప్రాణముల్
పోవుటెరుంగ వెళ్లెరిగి పోయితొ నన్వెరపింప వేఁడి నీ
వేవలనైనడాగితో మృగేక్షణ! యంచుఁ బ్రలాపశీలుఁడై. 430

వ॥ ఉన్మత్తుండునుంబోలె నలుదిక్కులంజూచుచు కామాతురుండై బంధుమిత్ర జనంబులు దన్నుంజూచి శోకింపుచుండ నచ్చోట నిలువంజాలక దేశాంతరంబు వోయె నది యట్టిద కాదె. 431

క॥ వగవగ భోగము రోగం
బగు మిత్రుఁడు శత్రుఁడగు గృహ మ్మగ్నియగున్
జగమును దగ్ధారణ్యం
బగుఁ బ్రియజన విప్రయుక్తులగు వారలకున్. 432

వ॥ ఇట్లు దేశాంతరంబు నిరంతరంబు దిరుగుచు పెక్కు తీర్థంబులకుంబోయి క్షుత్పీడితుండై ధూళిధూసరితుండగుచు నొక్కయెడ శ్రీమంతుండైన పద్మనాభుం డను విప్రగృహంబుచేరి యతని భార్యచేత బరమాన్నంబు తనపాత్రంబున వడ్డింపించుకొని దరినున్న వటవృక్షంబు క్రిందబెట్టి యప్పుడుపయోగింపక ప్రియాంగనా తత్పరుండై చింతింపుచుండె నంత, 433

క॥ ఆ వటవృక్షము మీఁద మ
హా విషసర్పంబు గాచి యామిషముగొనం
గా వేచి గ్రద్ద వ్రేసిన
జీవంబరిపడుచు చేష్టచెడి యురగంబున్. 434

ఆ॥ తొడరి క్రూరవిషముతో గూడి జ్వాలలు
గ్రక్క బాత్రమందు గారె నదియు

నతఁడు వచ్చి యన్న మరయక కుడిచి జీ
వంబు విడిచె నదియె వరుస గాదె. 435

క॥ దైవంబు వక్రమగుటయు
వావిరి యొడగూడి యున్న వస్తువులైనం
బోవును సర్వము విపరీ
తావలమై చెడు బ్రయత్నతతి విఫలమగున్. 436

వ॥ ఆ విప్రుండు గతప్రాణుండౌ టెఱింగి సత్రాధిపతియైన పద్మనాభుండు సాధ్వియైన తన భార్యం జూచి యవ్విప్రుండు నీ విడిన యన్నంబు గుడిచి విగత ప్రాణుండయ్యె గావున నిన్నుంజూడ నన్యాయంబని యాగ్రహించి యప్పుణ్యచారిణి దన గృహంబు వెడలించెనని కథ చెప్పి వెండియు బేతాళుం డిట్లనియె. 437

సీ॥ అవనీశ! యా బ్రహ్మహత్య యెవ్వరిదియో
యనవుడు నతనికిట్లనియె రాజు
తెగవ్రేసినది గ్రద్ద దిట్టయై యెరుగ ద
య్యురగము విషధార లొలుకునపుడు
గావున నపరాధి గాదు తత్సర్పంబు
నవివేక విధిచేష్టనైనయట్టి
యామిషంబెరిఁగి యయ్యదిగ్రద్దగొనవచ్చె
నదియును భాతిగా దరయ నిందు

తే॥ సత్రదానాధిపతి వాని సతియు నతని
కిడిరి పరమాన్న మది వారికెగ్గుగాదు
దీని నెఱుఁగక చెప్పిన మానవుఁడిల
నెవ్వఁడగు వాఁడపాపి నీవెఱుఁగు మదియు. 438

క॥ బేతాళ! నాదు తలఁపిటు
లాతతముగ జెప్పుటేమి యనిన నదృశ్యం
దై తరువున కరుగుటయును
భూతలపతి మఱియు వెనుకబోయి రయమునన్. 439

## కథ 14

వ॥ వానిం బట్టుకొని భుజంబునఁ బెట్టుకొని వచ్చునెడ నరేంద్రా! నేనొక్క కథఁ జెప్పెద నాకర్ణింపుమని యిట్లనియె. 440

ఆ॥ వీరకేతుఁడనఁగ విశ్రుతబలుఁ డయో
ధ్యాపురీశుఁ డతని యతులిత ప్ర
తాపవహ్ని శత్రు తపియింపఁ జేయుచు
మానసాటవులను మండుచుండు. 441

వ॥ ఆ రాజు రాజ్యంబున రత్నదత్తుండను వైశ్యుండు గలం డతనికి రూపలావణ్యాది గుణంబులం బొగడ్తకెక్కిన వీరవతియను కూఁతురు గల దక్కన్యం దా వివాహంబుగా నర్థించిన నా రాజు వలని భయంబునంజేసి యది వివాహంబు వర్జించి చరింపుచుండె నంత నొక్కనాఁడు, 442

క॥ చోరుం డా నగరమునకు
జేరిన వార్తవిని రాత్రి చెచ్చెర వెడలెన్
వీరుండు వీరకేతుం
డారూఢ బలుండు వాని నరసెద ననుచున్. 443

వ॥ ఇట్లొక్కరుండును వెడలి తాళోన్నతుండును నిశ్శబ్దలఘుసంచారుండును పార్శ్వాలోకనపరుండును వికృతాకారుండునునై మఱియు నతిభ్రాంతుండునుం బోలె తృష్ణాతురుండై, దుర్భిక్షంబునుంబోలె దుస్సహుండై, ప్రచ్ఛన్నుండైన దుర్జనుండునుం బోలె సంధిభేదకుశలుండై, యవనీతుండైన నృపతియుంబోలె సర్వజనసర్వస్వాపహారశీలుండైన చోరుఁగని నీ వెవ్వండ వింత ప్రొద్దెక్కడ బోయెద వనిన వాఁడవ్యాజంబుగా నే నుపశత్రుండ నెటకేనియుం బోయెద నీ వెవ్వండవనిన వానికి నా రాజు నే నెందేని ధననికర్తనంబునకుం బోయెద ననిన వాఁడు నీకు జూపెద రమ్మని పురంబు వెలికిందోడ్కొనిపోయి వధియింపం దలంచి రాజు నొక్క యెడబెట్టి ధనాపహారణార్థంబు తానొక్క ధనపాలుగృహంబు సొచ్చెనంత తద్గృహంపు సెట్టి దేహధర్మార్థంబు వెలువడి వచ్చి రాజుంగాంచి నిశ్చేష్టుండై భయంబున నున్నంగని నృపతి యతని జేర నరిగి రహస్యవృత్తాంతం బంతయు

నెఱింగించిన వీఁడు విశ్వాస ఘాతకుండు గాక సుగుణుండగునే నీ విచ్చోట నిలువ వలదని పలికిన విని నరేంద్రుండు తన నగరికింబోయి, 444

కం॥ బలకలితులైన భటులం
బలువుర రప్పించి చోరు బట్టగబంచెన్
కలితనము మెరయ వాఁడును
వెలువడి కయ్యంబు చేసి వీక్షితుడగుచున్. 445

కం॥ వివశుఁడయి పట్టు వడుటయు
నవనీశుఁడు వాని జంపుడని పనుచుటయున్
ధవళాక్షి వైశ్యకన్యక
యవిరళ శౌర్యుఁడగు చోరు నప్పుడు గాంచెన్! 446

వ॥ ఇట్లు వీరరసము వెడలి పేర్చునట్లు రక్తలిప్తాంగుడైన వానింజూచి యనురాగంబు నొంది తండ్రిపాలికిం జని యిట్లనియె. 447

కం॥ చోరుఁడు వీరుఁడు భయదా
కారుం డీతండు వరుఁడు గాదగు నొరులం
గోరి చరింపగ నొల్లను
గారవమున నెల్లభంగి గావుము వీనిన్. 448

ఆ॥ అనిన కూఁతు పలుకులాలించి రాజున
కర్థమిచ్చి గాతు నతని ననుచు
నరుగుటయును రాజు హాసంబుగైకొని
నీవు పాపివనుచు నిగ్రహించి. 449

వ॥ చోరు గావుమనుచు వచ్చిన రత్నదత్తు వెడలం ద్రోపించి చోరుశూల ప్రాప్తుం జేయించిన దానినెఱింగి యక్కన్య చోరుం బాయనోపక తదనుగమనంబుసేయ నిశ్చయించి శ్మశానప్రదేశంబున శూలంబునం దధోముఖుడై (స్వ) యైశ్వర్య ముక్తుండునుంబోలె నున్నవానిం జేరవచ్చిన జీవశేషుండైన వాఁడయ్యింతి జూచి దాని వచ్చిన కథ యంతయు నెఱింగి, 450

క॥ కన్నీరు గ్రమ్మగా నతి
ఖిన్నుండై యతఁడు మఱియు ఖేదముఖుండై
యన్నెలతం గని నగుచు స
మున్నత శౌర్యుండు ప్రాణములు దిగవిడిచెన్. 451

క॥ చోరున కొనరించిన సోద
యా రమణియు సాహసాత్మయై యెక్కుటయున్
గౌరీశుఁడు పితృవన కే
ళీరతుఁ డయ్యువతి గని చలించని కృపతోన్. 452

వ॥ అయ్యింతి మరణంబుమాన్చి వరంబు వేడుమనినం దన తండ్రికి యోగ్యంబైన పుత్రశతంబు ప్రసాదించుమని యడిగి తనకు ప్రియుండైన చోరుండు సజీవుగా వరంబు వడసి నంత లబ్ధప్రాణుండును, తేజోవిరాజితుండునునై వైశ్యకన్యకం బరిగ్రహించె. నంత తత్కథా ప్రసంగంబంతయు నెఱింగి వీరకేతుం డచ్చోరు రప్పించి సేనాపతిం జేసిన ప్రియాసహితుండై సుఖంబుండె నని కథ చెప్పి బేతాళుండు వెండియు నిట్లనియె. 453

క॥ చోరున [1]కేడ్పును నవ్వును
దారమతీ! యెట్లువచ్చె దత్కారణమిం
పారంగ జెప్పుమనుటయు
నా రాజవరేణ్యుఁ డిట్టులనియె నతనితోన్. 454

వ॥ రత్నదత్తుండకారణబంధుండై తన్ను రక్షింప వేడి రాజునొద్దికింబోయి యెంత ధనంబైన నిత్తునన నొల్లక యతనిం ద్రోపించి యన్నరేంద్రుండు వధియింప తాత్పర్యంబు సేయంజేసి తన మరణంబు తప్పదది దైవలిఖితం బెట్టివారికిం దుడువరాదని తలంచుచు దుఃఖంబును, నయ్యింతి వచ్చినం జూచి దాని చరితంబు వినిన యెడ హాసంబు పుట్టెనన విని బేతాళుం డదృశ్యుండై వృక్షంబునకుం బాఱిన, 455

1. కేదుపు.

ఆ॥ వాని వెనుకబోయి వదలక యా వృక్ష
మెక్కి పట్టుకొని యహీనబలుఁడు
గురుభుజమున మోచుకొని వచ్చునెడను బే
తాళుఁడిట్టులనియె ధరణిపతికి. 456

## కథ 15

క॥ నీ వొక్కండవు దక్కగ
దేవా! నా సంశయంబు దెలియగ జెప్పం
గా విత్తము లే[1]రన్యులు
గావున వినవలయు నొక్క కథ యెట్లనినన్. 457

వ॥ నేపాళ దేశంబున కధీశ్వరుండైనవాఁడు మహారాజైశ్వర్య సమేతుండు యశః కేతుండను రాజు గలం డతనికి కందర్పసుందర మందిరంబైన శశిప్రభయను సమాఖ్యనొప్పు కన్యక గల దక్కన్యక వసంతోత్సవంబుసేయ వేఁడి పరిజన పరివృతయై యుద్యానవనంబునకు వచ్చి పుష్పాపచయంబు చేయుచున్న యెడ [2]మనుస్వామియను విప్రకుమారుం డయ్యింతిం జూచి దాని లావణ్య విలాస సముద్రంబున మునింగి చిత్తంబు దిగుచు కొనంజాలక చిత్తజాయత్త చిత్తుండై మోహగహనంబునందు విభ్రాంతుండగుచునుండె. నంత నయ్యుత్సవ దినంబులందొక్కనాఁడు, 458

ఉ॥ ఆ నరనాథు నేనుఁగు మహామదమెక్కి చెలంగి యార్చి యు
ద్యానవనంబు సొచ్చి లతికావృత వృక్షములెల్ల జుట్టి [3]పై
[4]పైన పెకల్చి నల్దెసల దూలగవైచుచు ఘోర బృంహిత
ధ్వానములం దిగంతములు ధాత్రియు మిన్నును మ్రోయుచుండగాన్ 459

వ॥ లయకాలమేఘంబునుం బోలె భయంకరంబైన దానిం జూచి పరిజనంబెల్ల గలంగిన భయసంభ్రమిత హృదయుండై మణినూపురమేఖలారావంబు దోరంబుగా వెలుఁగుచున్న రాజకన్యకంజూచి మనుస్వామి దైవదత్తంబైన యవసరంబగుట

1. యన్యులు. 2. మహా 3. కై. 4. తోన.

జేరవచ్చి యోడకుండుమని యనునయించిన సుకుమారుండైన యతనింజూచి
యచ్చట కొంత ప్రొద్దు నిలిచి యంతఃపురంబునకుం బోయి, 460

కII ఆ విప్రకుమారుని మది
భావింపుచు మదనబాణ పక్షానిల వే
గావిలమగు మదనాగ్ని న
నావిలధైర్యోదకమున నాఁగుచునుండెన్. 461

వII ఆ విప్రుండును క్షీణచంద్రుండునుంబోలె శిశిరకాండ పాండురశరీరుండై పరిభ్రమించుచుండి జీవితేశ్వరింజేరు నుపాయంబు విచారించి తనకు ప్రాణమిత్రుండైన మూలదేవుం దలంచి తత్ప్రదేశం బరయుచుం బోయి యొక్క యేకాంతంబున శశియను శిష్యుతో గూడియున్నవానిం గాంచి నమస్కరించిన నతండు మనుస్వామింజూచి దీనవదనుండై యున్నవాఁడ విదియేమి? యని నవ్వుచు నిట్లనియె. 462

కII కందర్ప సర్పదష్టుని
చందంబున కాంతిచెడి గృశత్వము [1]నొందం
బొందిన యది యనవుడు జె
ప్పెం దనకథ యంతవట్టు ప్రియ మిత్రునితోన్. 463

వII ధూర్తశేఖరుండైన మూలదేవుండును తత్కథ యాకర్ణించి మనోరథంబు సఫలంబగు నోడకుండుమని యనునయించి యతని కవీర్యంబైన యోగఘుటిక యిచ్చి స్త్రీ రూపధరుంజేసి తాను నౌషధప్రభావంబున వృద్ధవిప్రుండై యతనిం దోడ్కొని పోయి యశఃకేతుంగాంచి యుచితసత్కారంబు వడసి సముచితాస నంబుననుండి రాజునకిట్లనియె. 464

సీII నా కోడలియ్యింతి నా కొడుకెంతయు
సురుచిర యౌవన స్ఫురితుఁడగుచు
ఎక్కడబోయెనో ఎఱుగంగనేరక
యరసెదనని భూమి దిరుగ వేడి

1. మేనన్.

యిది కన్య యబల నీ కిల్లట బెట్టెద
　　నని తోడి తెచ్చితి ననఘచరిత!
బ్రాహ్మణ స్త్రీ యని పాటించి కృపచేసి
　　నా వచ్చునంతకు బ్రోవవలయు

ఆ॥ ననిన విప్రుపలుకు లాదరంబున విని
తన తనూజ బిలువ బనిచి విప్ర
కన్య యదియు దీని గౌరవమున ర
క్షింపుమంచు బంచె నింపు మిగుల! 465

వ॥ ఆ వృద్ధవిప్రుండును సుతుం దలంచు కతంబునంజేసి నిమీలిత నేత్రుండైన వాఁడునుం బోలె కొంత దడవు పదంపడి రాజుం జూచి దీవించి వీడ్కొని వెలువడియె. నంత నిట గూఢకన్యకారూపధరుండైన మనుస్వామి ధూర్తధుర్యుండైన మూల దేవుండు తనకంత యుపకారంబు సేయుటకు విస్మయసంతోషంబులం బొంది యంతఃపురంబున శశిప్రభయొద్దనుండి యిరువురు నిష్టాలాపంబులంగొన్ని దినంబులు జరిపి దానితో చెలిమి యలవడిన పిమ్మట నొక్కనాఁడు మనుస్వామి శశిప్రభతో నిట్లనియె. 466

క॥ అలసెద వెంతయు చింతా
విలమైనది మనము లావు వెలికులికెడు నూ
ర్పులు వెచ్చనివై వెడలెడు
దలపెయ్యది చెప్పు నాకు తగదే యనుడున్ 467

వ॥ రాజకన్యక యిట్లనియె. 468

ఉ॥ పోలగమత్పురాకృత సుపుణ్యఫలంబునఁ జేసి నీవు నా
పాలికి వచ్చి నాకు మఱి ప్రాణసఖీమణివైతి బోటి! యీ
నేలకు వ్రేగు సూవే ధరణీసుర కన్యక! నీ గురుత్వ మే
నేల ఘనంబుగా వగవ నింతసహాయకు నీకు దాతునే! 469

క॥ అని దగ్గుత్తిక వెట్టుచు
జనుగవపై ధౌతహార సదృశంబుగ భో

రున నశ్రుధార లొలుకగ
జనపతిసుత మఱియు గూఢసతికిట్లనియెన్. 470

ఉ॥ ఏనుఁగ, తోటలోన మదమెత్తి చరించిననాఁడు భీతి న
చ్చోనొక దిక్కునందొలగి చూచితి మన్మథతుల్యునొక్కనిన్
వాని విలాసవిభ్రమము వ్రాసిన యట్లుగ నా మనంబునం
దూనుటజేసి [1]యయ్యెడలనొందు తలంపులు [2]బుట్టనంగనా! 471

మ॥ మదిలోనెప్పుడు బాయకుండు కలలో మాధుర్య సౌందర్య సం
పదలంగూడినయట్ల యుండునది జెప్పన్ సిగ్గు తద్భంగి యె
య్యదియో వాని సమాగమంబదియు దైవాయత్త మింకే క్రియన్
హృదయంబీప్సిత [3]సౌఖ్య సంపదలతో నేపారు నాకున్ సఖీ? 472

క॥ అదియేమియొ పలికెద [4]నెద
[5]యొదవెడు పులకలును చెమటలుబ్బెడు మేనున్
హృదయము ముదమున బొదలెడు
సుదతీ! నీ యొద్ద నిపుడు చోద్యము నాకున్ 473

క॥ అన నృపతి తనయ పలుకులు
విని ధన్యుఁడనైతి ననుచు విస్మయ మొదవన్
తన యోగ ఘుటిక యెడలిం
చి నిజాకారంబు దాల్చె చెలువుగ నచటన్. 474

వ॥ ఇట్లు నిజాకారంబు చేకొని మనుస్వామి తన ముందట నిలిచిన ప్రత్యభిజ్ఞంజేసి తన ప్రియుండుగా నెఱింగి మద్యాలసచిత్తయుంబోలె నమందానందయై లజ్జించి యించుక యోసరించి, 475

క॥ ఆతనిచే నాలింగిత
యై తగ తనుకంపయగుచు నతిగాఢమనో

---

1. యయ్యతలనొందు. 2. బుట్టెవంగనా. 3. సఖ్య. 4. యెద. 5. యదరె.

జాతోపదిష్టచేష్టల
నూతన సంభోగ [1]రతి మనోహర యయ్యెన్. 476

కII పగలెల్ల నాడరూపై
మగవాఁడై రాత్రియెల్ల మనుజేశ సుతం
దగిలి నిరంతర సేవా
నుగతుండై విప్రవరుఁడు నూతన చరితన్. 477

వII అంత గొండొకకాలంబునకు నతనివలన శశిప్రభ గర్భంబు దాల్చె మఱి యొక్కనాఁడు దాని మాతుల పుత్రియైన మృగాంకవతి యను కన్య నమాత్య పుత్రునకు వివాహంబుసేయు నుత్సవంబునకు రాజనియోగంబున శశిప్రభం దోడ్కొని పోయిన నమాత్యపుత్రుండు గూఢ కన్యకం గాంచి కామించి మహామూర్ఖుండైన వానినెఱింగి యశఃకేతుండతని [2]తలంపెఱుంగవేఁడి, 478

ఆII బ్రాహ్మణుండు దన్ను బ్రార్థించి యిల్లడ
యిడిన కన్య నెట్టులిత్తు ననక
దాని నిచ్చె మంత్రితనయున కెంతయు
నతని వలన బ్రీతుఁడగుట జేసి. 479

కII అనఘమతి యిట్లు సభ్యుల
యనుమతి దనునిచ్చి మంత్రి ననపాయుని జే
సిన గూఢకన్యయును త
జ్జననాథుని కిట్టులనియె సమ్మతి వెలయన్. 480

ఆII వృద్ధ విప్రవరుఁడు వివశుండు నీ యొద్ద
నన్ను దెచ్చిపెట్టి నమ్మిపోయె
నీ యమాత్యసుతునకిపుడు భార్యగ నిచ్చు
టేమిక్రమము దగునె యిట్లుసేయ? 481

వII నీవు బలవంతుండవైన రాజవు నీ వద్ద నాకు దొలంగ వచ్చునే కావున మంత్రిపుత్రు భార్యనయ్యెద నతండు తీర్థంబులాడి వచ్చి నన్నుం బొందునట్లు

1. గతి. 2. బ్రతికింపవేడి.

నియోగింపు మనిన నతండు సమ్మతించె. పదంపడి వాఁడు రాజ నియోగంబున గూఢకన్య న్వివాహంబై తన గృహంబునంబెట్టి తీర్థంబులాడబోయినంత వాని భార్యం బొందుచేసుకొని విశ్వాసంబువడసి తన రూపంబు గైకొని మనుస్వామి దానితోడి మనోభవక్రీడలం దగిలి యనంతసుఖంబున వర్తింపుచుండె. నంత కొన్ని దినంబులకు తీర్థంబులాడి మంత్రిపుత్రుండు వచ్చిన 482

ఆ॥ వాఁడు వచ్చుటెఱిఁగి వదలక తద్భార్య
నర్ధరాత్రివేళ నపహరించి
తోడుకొనుచుఁ బోయి దుర్నిరీక్ష్యుండయి
వెడలె విప్రవరుఁడు వెరవులేక. 483

వ॥ ఇట్లు చని మూలదేవుంగాంచి నమస్కరించి తన వృత్తాంతంబంతయు చెప్పిన విని సంతోషించి యతండు మనుస్వామిని సాదరంబున గృహంబున కరుగుమని యనుజ్ఞ యొసంగి యా మరునాఁడు తొంటియట్ల వృద్ధరూపుండై తన శిష్యుండైన శశియను వానిం దోడ్కొనిపోయి యశఃకేతుంగాంచి దీవించి దేవా! నీ యనుగ్రహంబునంబోయి దీనింబొడంగాంచితి నీ చేతసురక్షిత యైన యక్కన్యను రప్పించి యీతనికిచ్చి రక్షింపుమనిన యశఃకేతుండు భీతుండై ప్రతివచనంబివ్వక, 484

క॥ ఆ విప్రవరుఁడు గోపా
వివశుండై శాపమిచ్చునని శంకితుఁడై
రావించి యిచ్చె నప్పుడు
భూవరుఁడా గూఢకన్యఁబోలెడి కూఁతున్. 485

వ॥ ఇట్లు తన బహిఃప్రాణంబునుంబోని శశిప్రభ రప్పించి యొప్పించిన నా రాజ సమ్ముఖంబున తన శిష్యుండైన శశికిం బత్నిగా నిప్పించి యప్పుడ దానిం దోడ్కొని శశిసహితుండై పురంబు వెడలి నిజస్థానంబునకుం బోయి యంతక మున్ను వచ్చిన మనుస్వామినిగనిన నతండు మూలదేవునకు నమస్కరించి యిట్లనియె. 486

ఆ॥ సిద్ధవర్య! ధూర్తశేఖర! నీ కార
ణమున నా మనంబు విమలమయ్యె

నాకు దయిత యిది మనఃప్రియకారిణి
రాజతనయ యిమ్ము తేజమెసగ. 487

వ॥ గాంధర్వ విధానంబున వివాహంబైన వాఁడ నా వలన గర్భంబు ధరియించె ననిన విని శశియనువాఁ డాగ్రహించి మద్గురు నియోగంబున నీ కన్య తండ్రి యొద్ద బరిగ్రహించిన వాఁడ నీకు భార్యయెట్లు గానేర్చునని వెండియు నిట్లనియె. 488

ఆ॥ తండ్రియె యొడయుఁడు సుత కా
తండ్రియె నాకిచ్చె నీ వృథా భాషణముల్
వింద్రే సుమతులువిని చే
కొంద్రే యిటు బలుకదగునె కుత్సితబుద్ధిన్. 489

వ॥ అని యిట్లు శశియును మనుస్వామియు దమలో వివాదంబుసేయ దొణంగిన మూలదేవుండు సంశయంబంది నిర్ణయింపంజాలక యథోముఖుండై పలుకకుండెనని చెప్పి బేతాళుండు నరేంద్రా! యక్కన్నియ యయ్యిరువుర యందెవ్వని భార్య గాదగు నాకు జెప్పి సంశయంబు బాపవలయు ననిన నా రాజవర్యుండిట్లనియె. 490

ఆ॥ తండ్రియిడుటఁ జేసి ధరణీశసుత తగు
శశికి భార్యగా నిజంబు విప్ర
వరుఁడు గూఢ విభుండు వానికి నయ్యింతి
తగదు భార్యగాగ తథ్య మిదియు. 491

వ॥ మఱియు మనుస్వామివలన గర్భంబు ధరియించినం దానయు నయ్యింతికి బుట్టిన కొడుకు క్షేత్రజుండగుట శశికిం గొడుకగుననిన బేతాళుం డలక్షితుడై వృక్షంబునకుం బారిన, 492

ఆ॥ వాని వెనుకబోయి వదలక యా వృక్ష
మెక్కి పట్టుకొని యహీన బలుఁడు
గురుభుజమున మోచుకొని వచ్చు నెడ కథ
జెప్పదొడఁగె మఱియు చిత్తమలర. 493

## కథ 16

సీ॥ రత్నహేమంబుల రశ్ములు దాఁకి న
భంబు విచిత్ర వర్ణంబుగాగఁ
గరమొప్పుచుండు శ్రీకాంచన నగరంబు
కైలాస శైలశృంగంబునందు
తత్పురీశ్వరుఁడు విద్యా[1]ధరవరుఁడు జీ
మూతకేతుండు విఖ్యాతకీర్తి
యతనికిఁ గనకవల్యాఖ్య విద్యాధరి
యందు జగత్త్రయ వందితుండు

ఆ॥ చిరయశుండు పుట్టె జీమూతవాహనుఁ
డతని దానగుణసమాఖ్య లెపుడు
బహువిధములఁ దగిలి పాడుదు రమరాద్రి
నమరకన్య లర్థి నాడు నపుడు. 494

వ॥ అట్టి సకలగుణసమేతుండైన పుత్రు రాజ్యాభిషిక్తుంజేసి జీమూతకేతుండు కాలక్రమాగతంబైన కల్పవృక్షంబు నిచ్చిన నతండు మహాదాత గావున యౌవనంబును సంపదలును జీవంబులును సుస్థిరంబులు గావని నిశ్చయించి యా కల్పవృక్షం బర్థి సమూహంబున కిచ్చిన నదియు సకలార్థుల నభిమతార్థం బులం దనిపి దేవలోకంబునకుం బోయిన, 495

కః ఇట్టి యపూర్వ త్యాగులు
బుట్టుదురే? మూఁడులోకములనని జనులె
ప్పట్టున నతనిం జెప్పగ
నెట్టన సామంతులెల్ల నిష్కృపులగుచున్. 496

వ॥ అందఱుంగూడి విచారించి కల్పవృక్షరహితుండైన వాఁడితని వెడలం ద్రోచి రాజ్యంబు గైకొందమని యుద్యుక్తులైన వారితలంపెఱింగి జీమూతవాహనుండు

1. రవ.

గతక్రోధుండు గావున వారిం జంపనోపక రాజ్యంబు దిగవిడచి తన తల్లిదండ్రుల దోడ్కొని తపంబుసేయ నిజనగరంబు వెడలి పోయి, 497

చు॥ అనయము సిద్ధలోక నిలయంబయి ఖేచరకిన్నరాంగనా
జనుల విలాససంపదకు సంశ్రయమై ఘనసారతాల చం
దన వట బిల్వ సాల హరితాలసమంచిత గంధ కుంజమై
యనుపమకాంతి యొప్పు మలయాద్రికి నేఁగె మహాముదంబునన్. 498

వ॥ ఇట్లుబోయి దివ్యాంగనాపయోధరోత్సంగ సురభిగంధబంధురనిరంతర వనస్పతి చ్ఛాయావిహారియైన మధుకరుండను వానింగని, 499

క॥ అనవరతము వాని సహా
యునిగా నొనరించి నగసమున్నతి జూడం
జని చని సుమమకరందం
బను గౌరీవనమునకుఁ బ్రియంబున నరిగెన్. 500

వ॥ అందు నిరంతర సౌరభాభాసితంబులయిన పుష్పవల్లులను చలన్నీలాభ్ర సముచ్చయంబులైన యలిపటలంబుల, హేమకదలీ కుంజంబుల నృత్తం బొనరించు మత్తమయూరంబుల, గదలకున్న హరిణాంగనలం జూచుచు నుత్కంఠాకుంఠిత కంఠగుణకోమలంబైన కిన్నరగీతంబు విని హర్షించుచు మందారమకరంద బిందుసందోహసుందరంబైన మందానిలంబున నానందంబు నొందుచు నవ్వనంబు సొచ్చి, 501

సీ॥ కమనీయ సౌరభ కనకలతా పంక్తి
కలయవేష్టించిన కల్పతరులు
పరిచర సురవధూ ప్రతిబింబితంబులై
కొమరొందు శశికాంత కుట్టిమములు
కిన్నరజనుల సంగీత సంగతి సంశ్రి
తములైన కనకలతాగృహములు
నలఘుతపోయుక్తులౌ సన్మునుల కాశ్ర
యములైన రత్నగృహాంతరములు

ఆ॥ గలుగు నుపవనమున గైలాసశిఖరాను
కారియగుచు విమలకాంతి దనరి
కరము మాన్యమైన గౌరీవినోద హ
ర్మ్యంబు మణిమయంబు గాంచెనందు. 502

వ॥ దుహితృస్నేహంబున జూడవచ్చినిలిచిన హిమవంతంబునుంబోలె నతి రమణీయంబైన యది యని యప్పుణ్యహర్మ్యంబునకు శేఖరీకృత కరయుగళుండై
మ్రొక్కి 503

క॥ అనఘమతి డాయగా జని
వినె శ్రవణసుధారసంబు హృదయానందం
బునునైన మధురవీణా
స్వనమును దాక్షాయణీ నివాసము వలనన్. 504

క॥ విని దానికి హృష్టుండై
చని యంబిక నగరుసొచ్చి సరసిజనయనన్
వనజానన నలివేణిన్
ఘనకుచమండలిని నొక్క కామిని గనియెన్ 505

క॥ [1]అనుపమ నీ యౌవన వన
మునకును మృదుపల్లవములు బుష్పవికాసం
బునునై మధురాధర రుచు
లును లలితస్మిత మరీచులుం దళుకొత్తన్ 506

క॥ మదనుడు వ్రాయుటయు శుభా
స్పదమగు సౌభాగ్యవిపులపంక్తియ పోలెన్
వదనాంబుజాతమున ష
ట్పద మాలికయైన యలక పంక్తింబెడగై. 507

క॥ తన చూడ్కులకును మనమున
కును వెక్కసమైన యట్టి కోమలవిలస

1. అనువగు.

త్తనుసంపద గల కన్యక
గనుగొని సహజ కాంతకామాతురుడై! 508

వ॥ తద్గతమానసుండై యచ్చోటంగదలకున్నంత, 509

క॥ అలఘు భుజాస్తంభంబుల
బొలుపెసగు రమావిహార పుణ్యగృహము నా
జెలువైన యతని తేజో
జలజాప్తుని స్మరవిలాసుసరసిరుహాస్యున్ 510

ఆ॥ విల్లు దొలగబెట్టి విరహులతోడ వి
గ్రహముమాని శాంతికలితుఁడయిన
కామదేవుభంగి కమనీయమూర్తియై
యొప్పు రాజవరుని యువిద చూచె. 511

వ॥ ఇట్లు శుభాకారుండై యింద్రోదాత్తుండయిన వానిం జూచి లజ్జాతురతా కంపతరంగిణీ తరంగ దాంతంబులై వెలువడు స్వేదకణంబులు నూత్నమౌక్తిక విలాసంబు నొనరింప బయోధరభాగంబులం దెగయు బులకాంకురంబులు మెయిమరువునంటిన మదనశరజాలంబుననుకరింప యెట్టకేనియు ధైర్యం బవలంబించుకొని మిన్నకున్న నక్కన్య నొయ్యన జేరంజని కర్పూరోపాయ నంబిచ్చినట్లు విశదదశనాంశుజాలంబు వెలువడుచుండ విద్యాధరేంద్రుం డిట్లనియె. 512

క॥ ఓ చారుకమలనయనా!
యీ చరితమిదేమి గ్రావమిటమును నిన్నుం
జూచియు వినియు నెఱుంగము
నీ చతురోక్తి వినగల్గనే మాకు సతీ? 513

వ॥ అని మఱియు నయనభ్రమరంబుల కన్యకాసుందరముఖారవిందంబున కందంద యరుగుచుండ విలోలకుంతల ప్రభామండిత గండస్థలుండగుచు దాని కభిముఖుండై యిట్లనియె. 514

క॥ గుణములు దలంప నసాధా
రణములు లలితస్వభావ రమ్యము లోక
ప్రణుతము రూపము కులభూ
షణమవె మరి దానవో లసచ్చరితసతీ! 515

వ॥ అని యా కన్నియతో మధురంబుగా బలికిన విద్యాధరేంద్రునకు దాని చెలులిట్లనిరి. 516

తే॥ అసమ చరితాఢ్యులైన మీ యట్టివారి
యెదుర మనసు చలించ కొక్కింత ప్రొద్దు
ప్రౌఢలును బల్క వెరతురు పరగ లజ్జ
యిట్లు దానైన యక్కన్య యెట్లు బల్కు. 517

వ॥ ఇక్కన్య విశ్వావసుండను సిద్ధాధిపతి కూఁతురు మలయవతి యను నామమ్మున వంశభూషణంబైన యది నిత్యంబు నిచ్చోటికి వచ్చి గౌరీ సంసేవనంబు సేయుట నిజవ్రతంబని చెప్పి మీరెవ్వరని యడిగిన రాజసహాయుండైన మధుకరుండు జీమూతవాహనుండను విద్యాధరేంద్రుండని యెఱిఁగించ నతండిట్లనియె. 518

ఆ॥ సహజమైన యాభిజాత్యంబు గుణములు
మహితకాంతియును సమగ్రములుగ
గలిగియున్న యట్టి కన్యకామణి జూడ
బడయుటెల్ల జన్మఫలముగాదె. 519

వ॥ ఆనందమధుకరంబైన దృష్టియు, నప్రతితరంగంబైన యంతరంగంబును సజ్జనులకుచితంబులు, మఱి యట్టివారితోడ సమాగమంబు గలుగుట యమృత వృష్టిందడయుట యని పలుకుచున్న విద్యాధరేంద్రు వచనంబుల కానందంబు నందుచు [1]తత్తన్వియుండె. నంత దానిం దోడ్కొనిపోవ దాని తల్లి నియోగం బునం బ్రతీహారి వచ్చిన నప్పుడు సఖీసహాయయై దేవినగరంబు వెలువడి,520

1. తత్కన్య.

క॥ నీ యొద్ద నున్న చిత్తము
నాయక రక్షింపుమనుచు నలివేడిన య
ట్లాయతమతి నూపురములు
మ్రోయం దరళాక్షి యరిగె మ్రుచ్చిలుచు మదిన్. 521

క॥ తరళాక్షి [1]యుపావర్తిత
గురుభుజ జఘనయు దర్శితకుచతటియును నై
బొరిపొరి నరపతి జూచుచు
సురభి కబరి జేరునటులు జోపు విధమునన్. 522

క॥ తనువున రంభాస్తంభము
లనివార్యములగుచు నొదవ నలసగమనయై
మనమున బతినిడి యొక కర
మున నెచ్చెలినూని యధిక ముదితాత్మకయై. 523

క॥ వదలిన నయనంబును గ్రొ
వ్వెదయను సవరింపలేక వివశాత్మకయై
యొదవెడు నిట్టూర్పులతో
ముదమరి శయనంబు మీఁద ముద్దియ వ్రాలెన్. 524

క॥ మున్నీటిలోన నారక
యున్నగ్నియు పోయెనప్పుడు నసమేనం
గన్నీటిధారలొలుక
నన్నెలతుక విరహవహ్ని కగ్గంబయ్యెన్. 525

వ॥ ఇట్లు కందర్పసర్పదష్టయై పొరలుచునుండె. నంత జగన్మిత్రుండైన కమలమిత్రుం దస్తాచలంబున కరుగుచునుండ తదనుగతంబైన కమలినీ రాగంబునుం బోలె సంధ్యారాగంబు వరుణ దిగ్భాగంబు నలంకరింప చక్రవాక వియోగాగ్ని ధూమజాలంబునుంబోలె నెగయు తమఃపటలంబు పద్మపరిభవ భయంబున నెగసి తిరుగుచున్న యళిసమూహంబు కప్పు దట్టంబైనయట్లతి నిబిడంబై దిక్పూరితంబయ్యె నయ్యవసరంబున, 526

1. య

శా॥ చోరగ్రామ గజాంకుశంబు నళినీశుంభన్మదేభంబు ది
జ్నారీ మౌక్తికదర్పణంబు రజనీకాంతా మనోహారి య
ప్పారావార తరంగకారి గిరిజాప్రాణేశ భాస్వజ్జటా
శ్రీరమ్యాభరణంబు చంద్రుఁడుదయించెన్ సుప్రభాభాసియై. 527

వ॥ పద్మినీ విరహనిశ్వాసంబునుంబోలె బాలానిలంబు ప్రవర్తింప విమల చంద్రికాజాలంబు దశదిశా పరిపూర్ణంబయ్యె. నయ్యవసరంబున మలయవతీ కన్య చందనసాంద్రంబైన కదళీదళశయనంబునం బొరలుచున్న సంతాపం బంతకంతకు నతిగాఢంబై, 528

చ॥ నలిన దళంబులన్మృదుమృణాలములన్ శశికాంతకుట్టిమ
స్థలముల జందనాంబుజలతాపటలంబుల ధాతుహార వ
ల్లులను సుమద్రవంబుల జెలుల్ కడకన్ శిశిరోపచారముల్
సలుపగ మన్మథానలము శాంతి వహింపదుయెన్నిభంగులన్? 529

వ॥ అట్టి పరితాపంబు సహింపంజాలక లజ్జాతురయై యాప్తసఖీముఖంబు జూచి యిట్లనియె. 530

సీ॥ అంబికా గృహమున కతఁడు వచ్చిన యపుడు
నీవె సాక్షివి గావె? నెలత నాకు
కన్యకు దగునె? యక్రమము నా యందు కా
ముండు విముఖుఁడయి మొనసి యగుచు
నేమి సేయుదునింక యెక్కడి కరుగుదు
నెవరి కెరిగింతు నీ యవస్థ
దూతలచేత బుత్తురు వార్త ప్రియులకు
పురులోడి మరి తారపోదురొండె?

తే॥ ప్రణయ కలితలైన పడతుల లజ్జయు
ధీరతయును దలప దృఢములగునె?
చిత్తచోరు నతని చిత్తజాకారుని
విడువరాదు నొండు విధము లేదు 531

వ॥ మఱియును, 532

సీ॥ బోటి! నే నెఱిగించి పుచ్చుట దైన్యంబు
రమ్మని పిలుచుట రాచతనము
వచ్చెద ననుట యేవము లజ్జబాసి నే
కామించి తనుటయు కష్టవృత్తి
ప్రణయభాషలు ప్రగల్భములు నా ప్రియుఁడవు
గ్రమ్మని పలుకుట గ్రామ్యభాష
నినుబాసి జీవంబు నిలువదనుట పొల్పు
గాదు నా తెఱఁగెఱుఁగఁడు గాన,

ఆ॥ నిదియు కార్యమనుచు నెరిగెఱుంగగ రాదు
అతఁడు విధినియుక్తి నరుగుదెంచె
మనసు [1]డాచుకొనియె మరణంబు శరణంబు
గాని యింక నొండు గ్రమము లేదు. 533

క॥ అని పలుకుచు జనుగవ నుదు
గని పరితాపమున బీటగట్టిన శ్రీచం
దనలేపము పన్నీరున
ననుకై నెరయంగ రోదనాకులయయ్యెన్. 534

వ॥ అట జీమూతవాహనుండును విరహాతురుండై గౌరీవనంబునం బూర్ణచంద్రికా విషంబు దాకి మూర్ఛితుండగుచు దెలయుచు మలయవతి ధ్యానాత్మకుండై యున్న నెఱింగి యిష్టసఖుండైన మధుకరుండు దేవా! మహాత్ములయిన వారు నిట్టి వ్యసనంబు గొంత వహింతురు గావున నీవు నీ కన్యవలని తలంపునంజేసి పరవశహృదయుండవైనవాఁడవని చంద్రకాంతశిలాతలంబునం జందన రసార్ద్రతరుణపల్లవశయనం బొనరించిన విద్యాధరేందుండునుం బొరలుచుండె నంత,
535

సీ॥ మలయవతీ కన్య మరువని మదనాగ్ని
బొగులంగ నోర్వక తెగువఁ జేసి

---

1. డాసి

గౌరీవనమున కొకర్తెయు వచ్చి వృ
క్షంబున నురికి పాశంబమర్చి
ప్రాణేశుఁడిచ్చట బచరించునో యని
నలుదిక్కులకు చూడ్కి నిలిపియరసి
తల్లిదండ్రుల నాత్మ దలచి బాష్పంబులు
దన లోచనంబులఁ దనరుచుండ

తే॥ నంబికకు మ్రొక్కి నా మనోహారియైన
వాని జీమూతవాహను వరగుణాఢ్యు
నపర జన్మంబునందైన నాదరించి
నాకు ప్రియుజేయుమమ్మ యానందమూర్తి! 536

వ॥ అని దేవింబ్రార్థించి పాశంబు గళంబునం బెట్టుకొన నుద్యోగించు చున్న సమయంబున మధుకరుం డెఱింగి జీమూతవాహను దోడ్కొని వచ్చి లతాజాలంబు మరువునంబెట్టియుండె. నంత నయ్యింతికి దేవి ప్రత్యక్షంబై నీకు జీమూత వాహనుండు ప్రియుఁడై చక్రవర్తి యగునని యానతిచ్చిన గౌరీ ప్రసాదంబు వడసి నిలిచె నట్టి యవసరంబున. 537

ఆ॥ ఆ లతాంగి యెదుట కప్పుడు వచ్చి జీ
మూతవాహనుండు ముదితహృదయుఁ
డగుచు నిలిచె నంత నతని గనుంగొని
యొదవు లజ్జతోడ నుత్పలాక్షి. 538

వ॥ మొగంబువంచి నిలిచె.నంత నొకచేడియ మలయవతిపాలికివచ్చి యమ్మహాదేవి ప్రసాదంబున నీ మనోరథము సఫలంబయ్యె జీమూతకేతు పుత్రుఁ డగు జీమూతవాహనునకు వివాహంబు సేయుండని మీ తండ్రి మీ యన్న పాలికొక్క విద్యాధరుం బుత్తెంచె. నయ్యుత్సవ దివసంబు ప్రస్తుతంబై యున్నయది యని దానిం దోడ్కొని పోయె. నంత జీమూతవాహనుండును తల్లిదండ్రులపాలికిం బోయి వారి నియోగంబున వివాహంబుగా దత్సమయ సముచిత మంగళోపచార భూషణశోభితుండై, 539

ఆ॥ విభవమెసగ మున్ను విద్యాధరేంద్రులు
దన్ను బలసిరాముదమున వచ్చి
మానినీలలామ మలయవతీకన్య
బెండ్లి యయ్యె దన యభీష్టమెసగ. 540

క॥ ప్రేయసి నిట్లు వివాహం
బై యనుకూలత భజించి యనవరతము భో
గాయత్తచిత్తుఁడై నిర
పాయ శుభానుభవయుక్తి బరిణతుఁడగుచున్. 541

వ॥ మలయవతి కగ్రజుండయిన మిత్రావసుండను వాఁడు తనకు వినోద సహాయుండుగా బ్రవర్తింపుచు నొక్కనాఁడు సముద్రతీరంబునకుంబోయి వేలావనతటంబు జూచుచు నొక్కయెడ విస్మయకరంబులై యుగక్షయంబు నాఁటి సకలభూతశల్యరాసులుంబోలె పర్వతాయమానంబులైన యస్థిరాసులు చూచి జీమూతవాహనుండు నా తెరంగడిగిన మిత్రావసుం డిట్లనియె. 542

క॥ గరుడుఁడు తరచుగ ఫణులన్
బరిమార్చి మహాగ్రహమున భక్షింపగ నా
యురగముల దినము కొకటిగ
హరియింపు మటంచు వరుస నహిపతి జేసెన్. 543

క॥ వాసుకి ప్రార్థించిన మది
రే సంతసమంది పులుగుఱేఁడు వరుసతో
నాసక్తిని భక్షించు మ
హాసత్త్వుఁడు నిత్యమొక్క యహి యశనముగాన్. 544

వ॥ గరుడుండు భక్షించిన యెమ్ముల రాసులివి. పర్వతోపమానంబులైనవి. యని చెప్పుచుండ నంత సిద్ధపతి నియోగంబున నొక్క సిద్ధుండు వచ్చి విశ్వావసుం దోడ్కొని పోయిన జీమూతవాహనుండొక్కరుండును నిలిచి సర్పప్రళయంబునకు దయాళుండై సంసారంబసారంబని తలంపుచు నచ్చోట చరియింపుచున్న నట్టి యవసరంబున నొక్కయెడ. 545

సీ॥ హా హా రవంబులందంద వెల్వడుచుండ
వక్త్రోష్ఠములు నీరువట్లు బడ్డ
నా యన్న! నా పట్టి! నాగవంశోత్తమ!
గరుడని వరుసకై గంటి నిన్ను
భీతుడై వాసుకి పెట్టిన చిచ్చిది
నేడు నిన్ దాకెనే నిర్మలాంగ!
నిన్ బాసి జీవంబు నిలుపగానేర నన్
బోనిమ్ము గరుడుని భోజనముగ

తే॥ శంఖపాలకులాంబుధిచంద్ర! శంఖ
చూడ! మృదుకాంతి నొప్పు నీ సుభగతనువు
వైనతేయుని ఘనచంచు వజ్రహతికి
నోర్చునే? నీకు రక్షకులొరులు లేరె? 546

చ॥ అనుచు బహుప్రలాపముల నార్తరవంబు జెలంగ బుత్రు మో
మున దన మోము జేర్చుకొని మూర్ఛవహించిన తల్లి నాతం డ
ల్లన శమియింపజేయుచు విలాపముమాన్పుచు నమ్మ! నీకు నే
ద్వనగునటమ్మ యెల్లఫణివారము నిన్నును నన్ను నవ్వరే? 547

వ॥ అని తల్లి నూరార్చుచు స్ఫురత్ఫణామణి ప్రభలుం బూర్ణేందుసుందరంబైన ముఖకాంతియు సువర్ణవర్ణనీయంబైన శరీరచ్ఛాయయు దిగంతంబులం బ్రజ్వరిల్ల నానందంబాకారంబైనయట్లు నిర్వికారుండైన నాగకుమారక వచనంబులు నతని తల్లివిలాపంబును విని జీమూతవాహనుండు కృపాళు మానసుండైన డాయంబోయి రోదనాకులితయైన వృద్ధాంగనంజూచి యిట్లనియె. 548

శా॥ ఏ నీ పుత్రుడనైతి దల్లి! నను నీవింతైనయున్నమ్ము నీ
సూనుంగాచెద నెన్ని భంగులను నీ శోకంబు మాన్పించెదన్
బోనీ నింక సుపర్ణసన్నిధికి నే బోనేర్తు నీ వాత్మ న
త్యానందంబును బొందు మిప్పుడు కృతార్థాగ్రేసరుండౌనసన్. 549

క॥ ఆరయ మనుజులకును సం
సారమనిత్యమగు నెందు సత్పురుషులకున్
సారము పరోపకారము
బోరున నదిసేయ గనుట పుణ్యము గాదె. 550

క॥ అరయంగ నపాయముగల
శరీరమిది సజ్జనునకు సఫలత బొందున్
పరసంకట పరిహారము
నిరతంబుగ జేయునేని నిశ్చలబుద్ధిన్. 551

వ॥ అనిన జీమూతవాహను వచనంబులు విని గరుడుఁడనుశంక గొదుకున కడ్డంబువచ్చి వణంకుచుం దనకు మ్రొక్కిన యమ్మొదుసలిం జూచి యేను సుపర్ణుండగాను నీ కొడుకును రక్షింతునని వచ్చిన వాఁడ నొక్క విద్యాధరుండ ననిన నట్లైన నీవు శంఖచూడుని కంటె నధికుండవైన పుత్రుండువు దివ్య శరీరుండవై కల్పశతంబుండుమని దీవించె నంత శంఖచూడుండు విద్యాధరేంద్రు పలుకులకు విస్మితుండై కృతాంజలియై దరహాసంబుల్లసిల్ల నిట్లనియె. 552

ఆ॥ అధిక శౌర్యశాలివై యొప్పుచున్న నీ
దర్శనమున నతిముదంబు వొదవె
నమృత పూరవర్షి యగుచున్న చందురుఁ
డఖిలజనులకును బ్రియంబుసేయు. 553

క॥ నా జీవము రక్షింపగ
నీ జీవము నిత్తు ననుట నిక్కము దలపన్
గాజునకై మణి యిచ్చుట
యీ జగమున వారికెల్ల నిది చోద్యమగున్. 554

తే॥ అధిక సత్త్వోజ్వలంబును నమృతమయము
నైన వచనంబు నేడు నీయందు గలిగె
యొప్పుచున్నది నీవు లేకున్న నంధ
కారమగుఁ జువ్వె తలఁప జగంబునందు 555

కII మా యట్టి వారి యునికియు
బాయుటయు నేమి దలఁప భువనమునందున్
మీ యంతవారి పరిభవ
మే యాత్మ సహింపజాలు మిహిర ప్రతిభా! 556

ఆII అనిన శంఖచూడు డతని గనుంగొని
బాల! యిట్లు నీకు పలుక దగునె?
నిన్ను బాసెనేని నీ తల్లి బ్రదుకదు
పుత్రశోకవహ్నిఁ బొలియుఁగాని. 557

చII అరయగ నీదు వాక్యము నసంగతి యెట్టిది? నీవు వోవగా
నిరువుర చావు తెల్లమగు నెక్కటి నేను కణంగి పోవగా
నిరువుర ప్రాణముల్ నిలుచు నీవటబోవుట దక్కుమంచు గి
న్నరపతి శంఖచూడు చరణంబులపై దలమోపి వేడుచున్ 558

వII నిర్బంధాకులిత చిత్తుండైన నతఁడిట్లనియె. 559

ఆII అనఘ! లోకనింద్యమగునట్టి చరితంబు
నాకు గలిగెనేని నాకతమున
శంఖధవళమైన శంఖపాలుని మహా
వంశమునకు నోటువచ్చు జువ్వె 560

వII అని గరుత్మంతుఁడు వచ్చు సమయంబేఁగుదెంచె నింక బోవలయునని స్వస్తివచనుండై వీడ్కొని తత్ప్రదేశంబునందు గోకర్ణేశ్వరమహాదేవునకు నమస్కరించి వెడలు శంఖచూడుం బోనీక పట్టుకొని జీమూతవాహనుం డిట్లనియె. 561

ఆII తల్లి కెల్ల భంగి తనయుండు గలిగి ర
క్షింపవలయు నేమిచేసియైన
నెగ్గులేదు దీని నిమ్ముల రక్షింపు
ఫణికులేశ! యొండు పల్కులుడుగు. 562

వII అనియె నయ్యవసరంబున, 563

సీ॥ ప్రళయ కాలానిలుభాతి బర్వెదు గాద్పు
పెల్లున లోకముల్ తల్లడిల్ల
కాలదోర్దండ నిర్ఘాతంబు కైవడి
పెటపెట యనుట దిక్తటములదుర
బహు నదీసాగరపర్వతంబుల తోడ
బుడమియంతయు వడవడవణంక
కనకాచలప్రభల్ కలయబర్విసయట్లు
నభమెల్ల నుజ్వలప్రభవహింప

ఆ॥ నఖిల జీవములును నతిభయభ్రాంతిచే
నచట నచట నడగ నా క్షణంబ
గరుడుఁడేఁగుదేరఁ గనుగొని యుత్సాహ
రాజితాంగుఁడగుచు రాజవరుఁడు. 564

వ॥ తత్క్షణంబ చంద్రశిలాతలంబెక్కి సన్నాహుండై తన దేహంబు సుపర్ణునకు నివేదింతునని తలంచి కృతనిశ్చయుండై పరోపకారార్థంబుగా బునర్జన్మంబు నాకయ్యెడునని చిత్తంబునంగోరి నిశ్చలాకారుండై నిలిచి మొగంబెత్తి గరుత్మంతు బిలుచుచుండె నంత, 565

స్ర॥ పక్షద్వంద్వాగ్ర పర్ణప్రసృమర కిరణోపాంత చండాంశు తేజుం
డక్షీణోద్దండవేగాయత లయ పవనోగ్రానిలోద్ధూత సప్తా
బ్ధి క్షోభాక్షుద్రనాదోత్థితభయకలితార్తి త్రిలోకుండు లీలన్
పక్షీంద్రుండేఁగుదెంచెన్ ప్రసృమర రవి విభ్రాజుఁడై వ్యోమవీథిన్. 566

మ॥ సురవిద్యాధర యక్షరాక్షస మునిస్తోమంబు గొల్వంగ కి
న్నరగీతంబులు మ్రోయ నప్సరస లానందించి యాడన్ శిరం
బిరువంకం దగద్రిప్పి వారిఁ గరుణన్వీక్షించి సంతోష సం
భరితాకారులజేసి యప్రతిహత ప్రఖ్యాత శౌర్యుండొగిన్. 567

మ॥ ఘనసత్త్వాఢ్యుఁడు పక్షిరాజశనకాంక్షన్వచ్చి వజ్రాయుధం
బెనయన్ర్వస్సిన పర్వతాగ్ర శిఖరంబేతెంచు నట్లొక్క కా
లన రాజేంద్రు శిరంబు వట్టుకొని చేలప్రాంత దేశంబు ము
క్కును జెక్కుంగబళించి మింటికెగసెన్ గ్రొన్నెత్తురొల్కన్ ధరన్. 568

వ॥ అట్లెగసి పక్షప్రభాభాసిత దిగంతరుండై కొంత ప్రొద్దు గగనంబునం జక్రభ్రమణంబుజేసి గురునఖంబుల ముఖంబు జీరిన రక్తధారలతో గూడి జీమూతవాహనుం డొప్పుచున్న తద్రక్తంబు మలయవతీదేవి యుత్సంగంబునం బడిన భయకంపిత శరీరయై దానిందెచ్చి జీమూతకేతునకుం జూపిన నతండు నిజవిద్యంజేసి కొడుకునకు ప్రాణవ్యయంబెఱింగి భార్యాసహితుండై కోడలం దోడ్కొని గరుత్మంతుడున్న చంద్రశిలాప్రదేశంబునకుం జనియె. నయ్యవసరంబున, 569

చ॥ అతులిత సత్యశాలి, సుగుణాఢ్యుఁడు, ధీరుఁడు, శంఖచూడుఁ డు
న్నతయశుఁ డేగుదెంచి గగనంబున నాడు విహంగపుంగవున్
వితత తదీయ చంచుగత విగ్రహుఁడైన పరోపకారి నా
యతభుజారాజసత్తముని నప్పుడు చూచెను దుఃఖితాత్ముఁడై. 570

వ॥ ఇట్లుచూచి, 571

క॥ అనుమానము లేకప్పుడు
తను దా ఫణియైన యట్లు తల్లడము మనం
బున నెగయ రాజవర్యుఁడు
తనకతమున జచ్చె ననుచు దాపవశుండై. 572

మత్త॥ హా మహోత్తరసత్త్వసాహస ! హా సుధైర్యపయోనిధీ!
హా మృదూత్తమసత్యభాషణ! హా కృపాయతలోచనా!
హా మహార్త పరోపకారక !హా యకారణ బాంధవా!
హా మదర్థము నిన్ను నిచ్చితి నయ్యలార్చున నచ్చుటన్. 573

వ॥ అని యంభోవ్యాకులితలోచనుండై దుఃఖించి యంతన ధైర్యసన్నాహుండై తన దేహంబు సుపర్ణున కిత్తునని తలంచి కృతనిశ్చయుండై వధ్య శిలాతలంబుపై నిలిచి మొగంబెత్తి గరుత్మంతుం బిలుచుచుండె. నంత జీమూతవాహనుం జూచి, 574

క॥ తన గోళ్ల నడచి పక్షము
ఘన చంచువు(గుచ్చి యెమ్ముకలు చటమనగా
మును విడచి యుమిసి రక్త
మ్మును, మెదడును, మాంసఖండములు వడి (మింగెన్. 575

వ॥ అయ్యవసరంబున, 576

క॥ ఇది గుండెకాయ, యిది (పే
గిది, మజ్జంబిది, సుమాంస మిచ్చల దనిపెన్
పొదగలిన ధైర్యమెసగన్
విదితబలుండిచ్చుచుండె వినత సుతునకున్. 577

వ॥ ఇట్లు (ప్రసన్నమానసుండును బులకాంకితుండు కృతుండును నగుచు దన శిరంబు సొంపి రాజేం(దుంజూచి గరుడుండు సంరంభంబులు మాని విస్మయాకులితచిత్తుండై యతిసత్త్వశాలియు ధైర్యవంతుండును సంపూర్ణ జీవుండును నైనవాఁడు వీఁడు కేవలుండుగాఁడెఱుంగవలయు నని తలంచి నీ వెవ్వఁడ వని యడిగిన జీమూతవాహనుండిట్లనియె. 578

ఆ॥ వైనతేయ! విహగవల్లభ! యెవ్వండ
నైన నేమి? నన్ను నడుగ నేల?
యన్యచింత యుడిగి యాకలిదీర భ
క్షించిపొమ్ము దడవు సేయవలదు. 579

వ॥ అనియె నయ్యవసరంబున శంఖచూడుండు నిజఫణామణి (ప్రభలు దివంబునం (బజ్వరిల్లుచుండ దరహసిత వదనుండగుచు నిట్లనియె. 580

క॥ అహి యతఁడు గామి యెఱుఁగవొ?
యహమున యెరుగంగ రాదొ? యాకటి పెలుచన్
విహగేం(ద! బుద్ధి దప్పితి
విహిహీ నీ వరుస వాఁడ నేనున్నాఁడన్. 581

కII స్వస్తికులాంచితమైనన్
విస్తీర్ణోరస్థలమున విదితుండు త్రిలో
కస్తుత్యుఁడు విద్యాధరుఁ
డస్త కళంకుండు సుమ్మ యహిగాఁ దరయన్. 582

కII నిడుపగు వొడళ్లు వెడదగు
పడగలు విషదంష్ట్ర సుప్రభాసిత మణులున్
బెడగగు జిహ్వాద్వయమును
నడరిన లాంఛనము లహులకగు నెఱుగవొకో. 583

వII ఈ లాంఛనంబులు గలవాఁడ నాగేంద్రకుమారుండ శంఖపాలు తనయుండ శంఖచూడుండ నీకు భక్ష్యంబుగా వచ్చినవాఁడ విద్యాధరుండైన యతనిం భక్షింపక యిటు రమ్మని యుత్తాల శరీరుండై శిరంబెత్తి పలుమరు జీరుచుండ గరుత్మంతుండును నతని పలుకులు విని యస్థిమాత్రావశేషుండైన జీమూతవాహనుం దొలంగి విషణ్ణ హృదయుండై చింతింపుచుండె నయ్యవ సరంబున, 584

సీII మలయవతీదేవి మగని యాకృతి జూచి,
మూర్ఛితయయ్యె జీమూతకేతుఁ
డును శోకవజ్రనిష్ఠురపాత పాతితుఁ
డయ్యె తద్భార్యదుఃఖాతిరేక
మున మోము దలయును మోదుకొంచును పుత్రు
పై వ్రాలి యడలుచు బాణిపల్ల
వమున బల్మారును వదనంబు బుణుకుచు
నతి రోదనాధృతయయ్యె నంత

ఆII అధిక రోదనార్తులయిన యమ్మువ్వుర
వలన గరిమవుట్టి వైనతేయుఁ
డనునయించుచును దురంత చింతాత్మకుం
డనగనుండె నట్టి యవసరమున. 585

వ॥ జీవశేషుండగు జీమూతవాహనుండు తల్లింజూచి అమ్మా! శరీరం బనిత్యంబగుట యెఱుంగవే దీనికింత శోకింపందగ దిట్టి శరీరంబునఁ బరోపకారంబు సేయగల్గె నిది నా పుణ్యంబు గాదే యని సంతసించి నమస్కరించి నిర్మల ప్రభాభాసితముఖుండై ప్రాణవిముక్తుండయ్యె నంత, 586

క॥ చీకటి దోఁగిన భంగిని
లోకము లోభాంధకార లుప్తంబయి య
త్యాకులతఁ జెందె మలయవ
తీకాంతయు మరణమునకు దెగువ యొనర్చెన్. 587

ఆ॥ అట్టి యవసరమున నంబిక భక్తవ
త్సల త్రిలోకజనని చావు మాన్పి
జీవయుక్తుగాగ జీమూతవాహను
నమృత వృష్టిసురుచిరాంగు జేసి. 588

వ॥ నిర్విక్రమంబైన చక్రవర్తిపదవియుం బ్రసాదించి మలయవతిం గృపాదృష్టిం జూచి యంతర్ధానంబు నొందెనంత, 589

మ॥ ముని సిద్ధామరకిన్నరాదులు గడు న్మోదించి జీమూతవా
హనుఁ బూజించిరి వైనతేయుఁడును నత్యాశ్చర్యముంజెంది యా
తనికిం బ్రీతిబ్రసన్నుఁడై యభిమతార్థంబేమి? నీ కిత్తునం
చనినం బన్నగభక్షణం బుడుగవే యంచర్థిప్రార్థించినన్. 590

వ॥ గరుత్మంతుండును జీమూతవాహను ప్రార్థనంజేసి యది యాదిగా సర్పభక్షణంబుమాని పూర్వంబు భక్షించిన యస్థిరాసుల మీఁదనెల్ల నమృత స్రావంబొనరించి సజీవులం జేసె. నంత జీమూతవాహనుండునుం బార్వతీ ప్రసాదంబునం జక్రవర్తి పదవింబొంది హిమాద్రి శిఖరంబునం బూర్వరాజ ధానియైన కాంచనపురంబు బ్రవేశించి మలయవతీ సహితుండై మహారాజ్యంబు సేయుచు పితృసేవానిరతుండైయుండె నని కథచెప్పి బేతాళుండు విక్రమసేనున కిట్లనియె. 591

తే॥ అనఘ! జీమూత వాహనుండధిక సత్త్వుఁ
డహివరుఁడు శంఖచూడుఁడు నట్టివాఁడు
నరయ నిరువుల లోపల నధికుఁడెవ్వఁ
డనిన యధిపతి యిట్టుల నతని కనియె. 592

శా॥ చాలంబాలుఁడు శంఖచూడుఁడు కులాచారంబు వాటించి యా
భీలంబైన మహోగ్రకార్యమునకుం బెంపొంద సన్నద్ధుఁడై
తేలంబోవక పక్షిరాజుకడ కేతెంచెం దలంపంగ శౌ
ర్యాలంకారుఁడు ధన్యుడాతఁడగు సత్యంబెన్న నా దృష్టికిన్. 593

వ॥ జీమూతవాహనుండాత్మదానంబు సేయుట యద్భుతంబు గాదు. బోధిసత్త్వుండనువాఁడు తొల్లి పెక్కుమారులు నిజశరీరం బిచ్చిన వాఁడు గావున, 594

తే॥ తీవ్రతపమును, విమలకీర్తియును, సౌమ్య
సంపదయును, సమున్నతసత్త్వగుణముఁ
బొనరు నిర్వ్యాజదానంబు పూర్వజన్మ
వరచయంబున జేసి చొప్పడు జనులకు. 595

వ॥ అనిన బేతాళుం డన్నరేంద్రుభుజంబు డిగ్గి యలక్షితుండై వృక్షంబునకుం బారిన, 596

ఆ॥ వాని వెనుకబోయి వదలక యా వృక్ష
మెక్కి పట్టుకొని యహీనబలుఁడు
గురుభుజమున మోచికొని వచ్చునెడఁ గథ
చెప్పదొడఁగె మరియు చిత్తమలర. 597

## కథ 17

సీ॥ కనకపురంబున కలఁడు యశోధనుం
డను మహారాజు విఖ్యాత కీర్తి
యాదిరాజుల బోలు నా రాజు గొలువున్న
యెడ వైశ్యవరుఁడొకఁ డేఁగుదెంచి

దేవ! నా కూఁతురు త్రిభువన సౌందర్య
గలదు పెండిలి నీవు కావె! యనిన
బ్రాహ్మణవరులను బనిచె గన్యక జూడ
వారును బోయి యా వనిత జూచి,

ఆ॥ చలిత హృదయులగుచు జనపతి యక్కన్య
బొంది రాజ్యభారమునకు విముఖుఁ
డయి మహానురాగుఁడగునని తమలోన
నిశ్చయించి యనిరి నృపతితోడ. 598

వ॥ దేవా! యక్కన్య యున్మాదిని, యొడలం బెక్కుదుర్లక్షణంబు లున్నయవి, దేవరకు యోగ్యంబుగాదనిన వారి పల్కులు విని నిజంబు జేసి యా కన్య నాదరింప కుండె. నంత రాజుసేనాధ్యక్షుండు దాని వివాహంబై నిజగృహంబునకుం దోడ్కొని పోయె నట్టియెడ, 599

క॥ భాసురపుష్పవికాస వి
లాసంబులు గలిగి మదకలభ్రమర చయో
ద్భాసిత మహావనములకు
వాసంబయ్యెను వసంత వాసరము ధరన్. 600

వ॥ మఱియు శుకపికశారికాలాప మధురంబై మలయానిలాందోలిత మకరంద సౌరభానులేప దిగంతంబైన వసంతోత్సవంబు జూచు కౌతుకంబున నగరు వెడలి పురవీథిం జరియించునెడ సకలవిలాసినీజనంబులు నతని సురుచిరాకారం బాపోవకం జూచుచుండు నెడ, వారిలో రాజుచేతం బరిహృత యయిన యున్మాదిని మూర్తిమతియయిన వసంతశ్రీయునుంబోలె హర్మ్యతలంబున నిలచిన బింబాధరారుణవర్ణంబును విలోలలోచన భ్రమరం బును సుగంధ స్మితనికేతనంబునంబై మువ్వెలుఁగులకు**కులారంబైన?** ముఖపంకజంబున మనోహారిణియై రాగిల్లి దన్నుంజూచుచున్న యా యింతిం జూచి యా రాజేంద్రుండు కందర్పగోచరుండై చింతింపుచు మగిడి నగరంబునకుం బోయి యేకాంతంబున నుండి, 601

కు॥ మదనజ్వర పరితాపో
**ద్భదరిత**? వికటాంతరంగ బహిరంగుండై
మదిరాక్షి వైశ్యకన్యక
మదినిడి డోలాయమాన మానసుఁడగుచున్. 602

కు॥ లక్షణవిహీన యని చప
లాక్షింద్రైలోక్య సుందరాకారవతిన్
వీక్షింపకుండ జేసి యు
పేక్షించిరి విప్రులనుచు బెద్దయు గినుకన్. 603

వ॥ ఆ విప్రులనందఱ పురంబు వెడలిపోవునదిగా నియమించి పరితాపంబు సహింపంజాలక యుద్యానవనంబున లతాగృహంబుల శ్రీగంధ రససిక్తం బులయిన నళినదళశయనంబునం బవర్తింపుచుండ భిషగ్వరులు నానా విధౌషధములు బ్రయోగింపుచుండ దుశ్చికిత్స్యంబైన పరితాపంబునం బొరలుచు విరోచనుండను నర్మసచివుతో దన వృత్తాంతంబంతయు నెఱింగించిన వాఁడిట్లనియె. 604

కు॥ అంగజతాపజ్వర మే
భంగిని నే యౌషధముల బాయునె? దయితా
లింగనమె దానికెం దు
న్మంగళభేషజము దాన మాను నిజముగాన్. 605

వ॥ అనిన విని యది సేనాపతిపరిగ్రహయగుటం బరాంగన. దానియందు చిత్తంబు నాటియున్నయది. తన్నిమిత్తంబునం బ్రాణంబువోవుగాని యా దిక్కుచక్కంజూడ నింక యక్కథ జెప్పకుమని దీర్ఘనిశ్వాసవ్యాకులిత ముఖుండయ్యె నంత (ని)జసేనాధిపతియును. 606

కు॥ తన భార్య జూచి తన్నే
లినవాఁడు మనోజతాపదీప్తుఁడగుట తా
విని బంధురుఁడును సేనా
ని ననుం జూడుఁడని మ్రొక్కి నృపవర్యునితోన్. 607

కII అనుపమ రత్నములకు బెం
పొనరగ నాశ్రయము నీవ యున్మాదినియున్,
వనితారత్నము గావున
మనుజేశ్వర! నీకు దగు సమగ్రత గొనగన్. 608

ఆII అనిన వాని జూచి యనియె నా భృత్యుండు
వేత్తయును హితుండ విట్లు పలుకు
తగునె? పలుక నృపులు ధర్మపరాఙ్ముఖు
లైన లోకమెల్ల నణఁగకున్నె? 609

శాII ధర్మోదార చరిత్రుఁ డీతఁడనగా ధాత్రీతలం బేలుచున్
ధర్మంబెల్ల నడంచి మోహగహనాంధత్వంబునం బొంది రా
గోర్మి వ్యాకులమైన దుర్వ్యసన జాతోదంబునం దేలుచున్
ధర్మప్లావములేక యెట్లు గడతున్ దైన్యాబ్ధి దుర్బుద్ధినై. 610

కII పరదారలందు మాతృ
స్మరణయు న.......? యందు సన్మతియును భా
సురకీర్తియందు గడు నా
దరమును నాకెపుడు గలదు తథ్యంబిది దాన్ 611

వII అనిన విని సేనాని యిట్లనియె దేవా! యున్మాదినిని నర్తకింజేసెద. నట మీఁద సాధారణ స్త్రీ యయ్యెడి. దేవర పరిగ్రహించిన దోషంబు లేదు. దీని కొడంబడవలయునని ప్రార్థించి చక్కంజాగి మ్రొక్కిన వానింజూచి కోపించి వ్యతిరేకంబులు వలుక వాఁడు వెలువడిపోయె. మఱియు నున్మాదినీ స్మరణ తప్తుండగుచు రాజేంద్రుండు నిజశరీరంబు విడిచి యశశ్శరీరుండయ్యెనంత,612

కII పతిప్రాణంబులు విడిచిన
నతులిత దుఃఖమును బొంది యప్పుడు సేనా
పతి యగ్నిజొచ్చె జను ల
ప్పతిభక్తి యనంగబోవు భటుజూడుఁడనన్. 613

వII అని కథ చెప్పి బేతాళుండిట్లనియె. 614

కII సేనానియు భూపాలుఁడు
మానిత ఘనసత్త్వయుతులు మది దలపోయన్
మానుగ నక్కడి యిరువుర
లో నెవ్వఁడు చెప్పునాకు లోక [1]హితముగాన్ 615

కII అనవుడు బేతాళున కి
ట్లను జనపతి స్వామిభక్తి నడుగందగు భృ
త్యునకు నిది యేమి యద్భుత
మనదగు నధికుండు రాజె యెద దలపోయన్. 616

వII దుర్వారంబగు మదనవికార వ్యసనంబునం బొందియు ధర్మవిరుద్ధ మార్గంబాదరింపక ప్రాణంబులు విడిచెం గావున, 617

కII భూపతుల వివేకమును మ
హాపురుషుల చిత్తములు నహంకారమునన్
దీపింపదు వెలిగనుగొన
నే పట్టున నెఱుఁగబోల దెవ్వరికైనన్? 618

వII అనిన విని బేతాళుం దలక్షితుండై వృక్షంబునకుం బారిన వాని వెనుకంబోయి యెప్పటియట్ల గొనివచ్చునెడ నరేంద్రా! సత్యసంశయంబు దీర్ప నీ వొక్కరుండునుం దక్క నర్హుం డే జగంబున లేఁడు? ఇంక నొక్క కథ విన వలయు నెట్లంటేని, 619

## కథ 18

సీII అనఘ! చంద్రప్రభుండనఁగ నుజ్జయిని రా
జతని పురంబున నధిక ధనుఁడు
వసుధామరుండు దేవస్వామి గలఁడు త
త్సుతుఁడు చంద్రస్వామి శ్రుతిగృహమున
కితవులతో ద్యూతకేళిసలపఁగ ధూర్తు
లర్థమంతయుఁ గొని యంత బోక

1. హితకుడున్.

నొడకేలు బంధించి పిడికిళ్లఁ బొడిచినఁ
జచ్చిన యట్లున్న జారి యరిగి

ఆ॥ రంత శోకతప్తుఁడై రాత్రి వెలువడి
యొక్కరుండు బోయి యొక్కచోట
శూన్యదేవగృహము సొచ్చి యాకలి నీరు
వట్టు సైపలేక నట్టు లలసి. 620

వ॥ అచ్చోట నిలచి యొక్క తపోధనుండు భస్మోద్ధూళితగాత్రుండై కపిలాంగంబు ధరియించియున్న వ్రతస్థుంగని యతిదీనుండై భోజనం బర్థించిన నా తపోధనుం డపుడు తన విద్యాప్రభావంబున నొక్క కాంచనపురంబు నిర్మించి యవ్విప్రు నప్పురంబులోనకుం బుచ్చిన, నతండక్కడ ప్రభాసితులైన యౌవనస్త్రీలచేత రాజోపచారంబులం బూజితుండై స్నానభోజనంబుల సంతోషించి వినూత్న రత్నమేఖలాలంకృతయైన యొక్క సుందరితోడ సంభోగం బనుభవించి కృతార్థుండయ్యె. నంత ప్రభాతసమయంబైన నప్పురం బదృశ్యంబైన నెప్పటియట్ల శోకాకులితుండై యేడ్చుచున్న యవ్విప్రుంజూచి కరుణించి, 621

ఆ॥ రాత్రులెల్ల నది పురంబు మహోన్నతి
బొంది పగలు విరిసిపోవునట్లు
చేసె నా తపస్వి శేఖరవరుడు స
ముద్యతప్రభావ విద్యజేసి. 622

వ॥ అట్లు కొన్నిదినంబులు వర్తింపుచు విప్రుండమ్మహాపురుషు నారాధించి మహాత్మా! యివ్విద్య నాకు ననుగ్రహించి రక్షింపుమనిన నివ్విద్యదుస్సాధం బిది యట్లుండె. నీవు రాగబంధంబునుంబాసి విప్రనియమరతుండవై జలమధ్యంబున నుండి పునశ్చరణంబు సేయవలయు నుపదేశంబు మొదలుగా నీ విద్య పెక్కు విఘ్నంబుల పుట్టించు వానిం ధరించ నేర్చిన వారిం బ్రాపించు. మనోరథంబు సఫలంబుసల్పు నవ్విఘ్నంబు లెట్టివన జలమధ్యంబున వ్రతశీలుండవయిన నీకు నిద్రాదిజన్మంబు వర్తించి కలయందొక్క చిక్కునం బడగలవాఁడవు. మఱి మేల్కని పుత్రమిత్రకళత్ర బంధువర్గంబు వలని తగులంబునంబడి క్రమ్మర నా చేత బోధితుండవై యనలంబు ప్రవేశించి తద్దహనంబు వలన శుద్ధుండవైన నవ్విద్య చేకుఱు. నంతకు శక్తుండవైతేని నీకు నిత్తుననిన నొడంబడిన నదీతీరంబున నవ్విప్రునకు విద్యోపదేశంబు చేసిన, 623

కు॥ విద్యధరియించి విప్రుఁడు
సద్యస్సలిలముల మునిగి జపమతి నియతిన్
నద్యంబున నొనరింపుచు
నుద్యతి నిద్రాజడత్వ యుక్తుండగుచున్. 624

వ॥ విస్మయంబంది కలయందు హిరణ్యపురంబున శంఖుడను పురోహితునకుం బుట్టి కాలక్రమంబున వర్తింపుచు విద్యాకాలగుణప్రగల్భ శశిప్రభయను కన్యక వరియించి యానుకూల్యంబు భజియించి వసంతసమయంబున నుద్యాన వనంబునందు శశిప్రభాసమన్వితుండై వినోదింపుచుండె నంత, 625

కు॥ దాసీజన పరివృతయై
యా సుందరి వనములోన నటనిట మెలఁగన్
డాసి విధి ప్రవరణమున
నా సర్పము గఱచె నదియు నా క్షణమాత్రన్. 626

సీ॥ విషదాహమున జేసి వివశయై యచ్చోట
బడుటయు నెంతయు భయముఁ బొంది
హా ప్రియ! హా మనోహారిణి! హా నయ
నానంద చంద్రిక! హా మృగాక్షి!
అవినీతుసిరివోలె నంబుజానన! యెడ
బాసితివే యని ప్రలాపంబు లెసఁగ
నశ్రుపూరితముఖుండగుచున్న నచ్చోట
నాకాశవాణి యిట్లనియె నతని

ఆ॥ కనఘ! యేల యేడ్చె దాయువునం దర్ధ
మిచ్చి కావవలయు నీ లతాంగి
ననిన నట్లచేసె నదియును సప్రాణ
యగుచు నిలిచి చూచె నతని నపుడు. 627

వ॥ ఇట్లు బ్రదికిన ప్రియాంగనవలన కాలక్రమంబునం బుత్రులంబడసె నిట్లు స్వప్నదృష్టంబైన మాయాజాలంబునంబడి తెలిసి యిదియంతయు నవిద్య యయ్యెనని

నిజతపంబు మఱచి చింతించుచు నా సమీపంబున నున్న యతివర్యుచేత బోధితుండై మున్ను సెప్పిన యనలంబు ప్రవేశింతునని పోయి బంధుజనాక్రోశంబునం బుత్రమిత్రసహితయై తన్నుంబోనీక పెనంగు భార్య నాదరింపక యగ్నిగుండంబునం జొచ్చి యొక ముహూర్తంబు జీవితసుఖుండై. 628

కII తనతోన నగ్నిచొచ్చెద
నను చుఁ దెగువచేసియున్న యాలిని తాఁ గ
న్గొని పెనుపాపము చేసితి
ననుచు మహారవములెసఁగ నాకులుఁడయ్యెన్. 629

ఆII అంత నగ్ని చల్లనై సరోవరరూప
మైన నందు మునిఁగి యట నదీజ
లంబు నడుమ నెగసి లావరియునట స
మాధినిష్ఠుఁడగుచు మదిఁ దలంచి. 630

కII తనకొక రూపము లోపల
ఘనమగు విఘ్నములు పెక్కు గలుగుటకు మనం
బున నెంతయు నాశ్చర్యము
దనరఁగ నిజగురువు నెఱిఁగి తద్దయు భక్తిన్. 631

కII తన కలగన్న తెఱంగును
తన భార్యయు, బాంధవులును, తల్లియు వెనుకన్
జనుదెంచిన తెఱఁగును దా
ననలముఁ జొచ్చిన తెఱంగు నంతయుఁ జెప్పెన్. 632

శాII ఆ విఘ్నంబులెఱింగి యా వ్రతివరుం డా శిష్యుఁగోపించుచున్
నీ వీ విద్య ధరింప శక్తిగలదే? నీకిచ్చుటంజేసి మ
ద్భావంబంతయుఁ దప్పె మానుష యవిద్యావిస్మృతింబొందితిన్
నీ వైకల్యమిదెంత పెద్దదనుచు న్నిర్వేదముంబొందుచున్. 633

చII అన భయమంది విప్రుఁడు రయంబున నట్ల మహాత్మ! నీవు పం
చిన గతి నీరిలోజపము చేసి క్రమంబునఁ బోయి యగ్ని సొ

చ్చిన నదియేమి విఘ్నమునఁ జేసియొ దగ్ధము గాదు మేను వం
చనమొక యింత లేదని యసంశయుఁడై శపథంబు చేసినన్. 634

వ॥ తపస్వియు విద్యాభ్రంశంబు పొందినవాఁడు గావున విప్రునకైన విఘ్న కారణంబెఱుంగక చింతించె నని కథచెప్పి బేతాళుండు నరేంద్రా! యథోక్త విధానంబున వర్తించిన యతనికి యవ్విద్య సిద్ధింపని కారణంబేమి? యనిన దానికి విక్రమసేనుండిట్లనియె. 635

ఆ॥ అగ్నిలోన నుండె నవ్విప్రవర్యుండు
భార్యఁజూచి మిగులఁ బాపదగ్ధుఁ
డగుటఁజేసి విద్య యది యెట్లు సిద్ధించు
విఘ్నకారణంబు వినవె యయ్య. 636

క॥ చిరకాల స్థిరవిద్యయు
గురునకు నా విప్రుచే నకుంఠితమగుచున్
బొరసె నదియెట్ల యెందును
దొరకొనునే సిద్ధభావదుష్టున కెందున్? 637

వ॥ అనిన విని బేతాళుండలక్షితుండై వృక్షంబునకుం బాఱిన వెనుకంబోయి పట్టుకొని, 638

## 19వ కథ

ఆ॥ అతి రయమున నరుగునప్పుడు మఱియు బే
తాళుఁడిట్టులనియె ధరణిపతికి
ప్రొద్దుపోదు మనకు ప్రొఁదోచునంతకు
నొక్క కథయు వినఁగ నుత్సహించు. 639

వ॥ అది యెట్లంటేని, 640

సీ॥ అనఘ! యాసంకటమను పురంబున జగ
త్పూజ్యుండు సూర్యప్రభుండనంగ

సార్వభౌముఁడు కీర్తిసంచయుఁ[1]డమ్మలయాద్రి
ధర్మోత్తరముగ నీ ధాత్రి యెల్ల
లీలనేలఁగఁ దామ్రలిప్తపురంబున
ధనవంతుఁడను పేరఁ దనరు వైశ్య
వరునికి నొక కళావశమునం జేసి వి
ద్యాధరికూఁతురై యవతరించె

ఆ॥ ఫలితకాంతివతియుఁ బ్రవిమలచంద్రికా
పటలి దిక్కులందుఁ బ్రజ్వరిల్ల
సోముఁడుదయమంద జోరుఁ దక్కన్యకం
జూచి తజ్జనకి శుభతఁ బలికె. 641

క॥ ఈ కన్య నిమ్ము నాకును
నీకుఁ దనియ నర్థమిత్తు నిజమిది మరణ
వ్యాకులతబొంది దుర్మతి
యై కారులు వలికె నీతఁడని నవ్వకుమీ!! 642

వ॥ అది యెట్లంటేని, 643

సీ॥ నాకు నీ విచ్చిన నా పన్పుజేసి యి
త్తరుణిఁ దా మరి యన్యవరుని బొంది
పుత్రుఁగాంచుటయు నా పుత్రుఁడు పరలోక
గృహీతుగా నన్ను రక్షింపు నిజము
లక్షధనంబు నల్పంబుగ నిచ్చెద
నొండు దలపక నిండు మనము తోడ
నిమ్మనినం గూఁతునకు నియ్యకొనఁ జెప్పి
చోరునకప్పుడు దారవోయ

ఆ॥ నతఁడు భూతలంబునందు సంచితమైన
తన సమస్తధనము తరుణి కిచ్చి

1. దర్మిలి.

పుత్రుఁబడయ నన్యపురుషు వరింపు నీ
వనుచు విగతజీవుఁడయ్యె నంత. 644

వ॥ హిరణ్యవతియును కూఁతుందోడ్కొని సూర్యప్రభునగరంబునందు చోరసఖుండైన కుమారుదత్తుగృహంబునకుం బోయి వాఁడు సెప్పిన యుపాయంబునం జోరు కళేబరంబుదహించి కొన్నిదినంబులకు కూఁతురుం దానును సూర్యప్రభు నగరంబుఁ బ్రవేశించి నిశ్శంకంబైన సుఖం బనుభవింపుచుండె. నంత నొక్కనాఁడు, చోరపత్నియైన యయ్యింతి ఋతుమతియై హర్మ్యతలంబుమీఁదినుండి పురవీథింబోవు మనోహరాకారు నొక్క విప్రకుమారు సోమస్వామియను వానిం జూచి కామించి , 645

క॥ మనసెంతయు విప్రకుమా
రునిపై నిలుచుటయు రాగరూషితమతియై
వనజానన లజ్జింపక
తన హృదయమెఱుంగఁ జెప్పె తల్లికి నంతన్. 646

చ॥ అదియును మున్నుఁ గూఁతునకు నన్య వరింపఁగ నభ్యనుజ్ఞ యిం
పొదవగఁ జోరునింగ దియనొంతయుగాఁగఁ దలంచి వానికిన్
హృదయముపల్లవింప వరియింపుము విప్రకుమారునంచుఁ దా
ముదమునఁ బుచ్చె నెచ్చెలి సమున్నతి తోడుత నాతనొద్దికిన్. 647

ఆ॥ అతఁడు మున్ను హారలతయను భామినిఁ
దగిలి వ్యయముసేయదగు ధనంబు
లేక మనమునందు వ్యాకుల పడుచుండి
వైశ్యతరుణిఁ జూచి వచ్చి నిలిచి. 648

క॥ మతియుతుఁడు దానిఁ గనుఁగొని
చతురత వెలయంగఁ బంచె శతరూకములన్
ప్రతిదినము వ్యయముసేయుదు
నతివా సొమ్మనెనుఁగూడ ననవుఁడు నదియున్. 649

ఆ॥ అంత యర్థమునకు నప్పుడ యొడఁబడి
అతనిఁ దెచ్చుటయును హర్షమొంది
నవసమాగమమున నలినాక్షి మన్మథ
శ్రీవహించి రాత్రి చిత్తమలర. 650

వ॥ ఇట్లు వివేకవిలాసనివాసుండై యతిప్రౌఢుండైన విప్రకుమారుం డదృష్ట పూర్వసంభోగంబున నయ్యింతి లబ్ధమనోరథంజేసి వీడ్కొని ప్రభాతంబునం బ్రచ్ఛన్నుండై వెలువడియె. నంత నయ్యింతి కాలక్రమంబున గర్భంబు దాల్చి కర్ణునింగన్న కుంతియుం బోలె దినరాజతేజుండై సంపూర్ణరాజలక్షణలక్షితుండైన కొడుకుంగనియె నంత నా రాత్రి యయ్యింతి కలయందు పరమేశ్వరుం డిట్లని యానతిచ్చె. 651

మ॥ వనితా! నీ సుతునిన్నరేంద్రు నగరద్వారంబునం దిప్పురిన్
జను లెవ్వారు నెఱుంగకుండగను భాస్వచ్ఛయ్యపై బెట్టుమీ!
విని సూర్యప్రభుఁడేఁగుదెంచి హృదయావిర్భూత మోదంబుతో
ఘనతేజుండగు బాలునాత్మ సుతునింగాఁ జేకొనున్ బేర్మితోన్. 652

క॥ అనవుఁడు మేల్కని యప్పుడ
జననికి నెఱిగించి ముదము సంభ్రమము మదిన్
దనరగ నపుడ హరుడు పని
చినగతి నునిచెను నరేంద్రు శ్రీద్వారమునన్. 653

వ॥ అంత సూర్యప్రభుండును స్వప్నంబునం దీశ్వరాదేశంబున నెఱింగిన వాఁడై వచ్చి సితమేఘపిహితుండైన బాలార్కుండునుంబోలె ధౌతవస్త్ర పిహితుండై తేజోరాజితుండైన యా బాలకుంజూచి యమందానందహృదయుండై యెత్తుకొని పోయి చంద్రప్రభుండను నామంబొనర్చి పుత్రవతియైన తజ్జనని కేకాంతంబున హేమసహస్రంబిచ్చి సకలజనానురాగంబుగా పుత్రోత్సవంబు సేయించె నబ్బాలకుండును బాలేందుండునుం బోలె, ప్రతిదిన ప్రవర్ధమానుండగుచు యథోక్త సంస్కారుండును సకల విద్యావిశారదుండై కాలక్రమంబున సంపూర్ణ యౌవనుండై బ్రవర్తింపుచున్న, 654

తే॥ భూరిగుణయుక్తుఁడై లోకపూజ్యుఁడైన
పుత్రుఁ గనుఁగొని సూర్యప్రభుండు వీఁడు
వంశభూషణుఁడై చక్రవర్తి పట్ట
మమరగట్టి సమస్త రాజ్యంబు నిచ్చి. 655

క॥ వారాణసీ పురమునకు
సారవిచారుండు వోయి సర్వేశు పదాం
భోరుహములు గొల్చి తపః
పారీణత పరమమైన పదవింబొందెన్. 656

వ॥ చంద్రప్రభుండు తండ్రి కీర్తిశేషుండైన వార్త విని శోకించి పరలోక కార్యంబులు యథోక్తంబుగాఁ జేసి పితృవత్సలుండై గయాశ్రాద్ధంబు గావింపం బోదునని తలంచి సమస్తరాజ్యభారంబునకు మంత్రులబాలించనునిచి వలయు విప్రవరులం దోడ్కొని చతురంగ బలసమేతుండై కదలి, 657

క॥ పితృ తృప్తియుఁ గులరక్షయు
నతిముదముగఁ జేయుచో గయాశ్రాద్ధముతో
బ్రతివే కార్యములున్నతు
లతులితమగు తృప్తిదాననగుఁ బితృలకును. 658

సీ॥ చతురంగ బలములు సకలదిక్కులు నిండి
నడచి నిత్యప్రయాణములు చేసి,
వారణాసీ పురవాసియై సురనది
యందు యథోక్తకార్యములొనర్చి,
తనివోక మఱియు దీర్థంబులయందిగి
శేషదానంబులు చేయబనిచి,
కాలక్రమంబున గయకేఁగి యందు ధ
ర్మారణ్యమందున నాశ్రయించి,

ఆ॥ యధిక నియతి తోడ నా గయాస్థలమున
విప్రవరులు పనుప విధినియుక్త

ముగను పిండమిడగమోదించి కొనుటయు
మూఁడుచేతు లతని మ్రోలనెగసె. 659

వ॥ ఆ హస్తంబులు చూచి విస్మితుండై యొక్క ముహూర్తంబు పిండంబు వెట్టనేరక వెఱఁగువడి వేదశాస్త్రపారంగులైన వృద్ధవిప్రోత్తములంజూచి యిది యేమి తెఱంగని యడిగిన వారు పెద్దయుంబ్రొద్దు విచారించి యిట్లనిరి. 660

సీ॥ శస్త్రశాంకూలలాంఛనమయి యున్నట్టి
యాది యొక్కటియు చోరుహస్త మరయ
చతురపవిత్ర భూషణమయి యున్నది
బ్రాహ్మణహస్తంబు భంగి నొకటి
కమలానుకారియై కనకకంకణభూషి
తంబైన రాజహస్తంబు నొకటి
యీ హస్తములలోన నెందుపిండము వెట్ట
నగునని మది నిశ్చయంబు సేయు

ఆ॥ వారమనిన నృపతి వారల పలుకులు
విని మనంబులోన విహ్వలించి
సందియంబునొంది యెందు నప్పిండంబుఁ
బెట్ట నేరఁడయ్యె పెద్దప్రొద్దు. 661

వ॥ అని కథ చెప్పి బేతాళుండు నరేంద్రా! యా మూవురయందును పిండార్హు లెవ్వరగుదురు? ధర్మంబు దప్పక చెప్పుమనిన వానికి విక్రమసేనుం డిట్లనియె. 662

తే॥ తలఁప బ్రాహ్మణుఁడతనికి తండ్రిగాఁడు
తన్నుఁ గామించుటయు దాని తల్లిచేత
మున్న యేనూరు రూకల మోదమంది
యొక్కరాతిరి వసియించియుండెఁ గాన. 663

క॥ కనకహస్తముల తోడం
దన వాకిటనున్న శిశువు దనయుండని చే

కొని సంస్కార మొనర్చె న
తనికిం దా తండ్రిగాఁడు ధరణీపతియున్. 664

కః చోరుం డాతని తల్లికి
భూరి ధనంబిచ్చి ధారఁబోయగఁ గన్యం
గోరి వరియించెఁ గావున
నారయగాఁ బిండమునకు నతఁడర్హుఁడగున్. 665

వః అనిన విని బేతాళుండలక్షితుండై వృక్షంబునకుం బాఱిన వెనుకంబోయి పట్టుకొని వచ్చునెడ నరేంద్రా! యొక్క కథ యాకర్ణింపవలయు నిశ్శబ్దంబయ్యు నతి దూరంబైన యీ మార్గంబునం దూరక పోనేల యని యిట్లనియె. 666

## కథ 20

కః మనుజేశ! చిత్రకూటం
బను పురి చంద్రావలోకుఁడను రాజు గలం
డనుపమిత రత్నసంపద
ననిశము రత్నాకరంబ యన వసియించున్. 667

వః అన్నరేంద్రుండొక్కనాఁడు మృగయాతురుండై వనంబు వోయి మృగంబులం జంపునెడ తన యెక్కిన యశ్వంబు బెదరి వాయువేగంబునం బాఱిన దానిచేత నిపాతితుండై పాదచారి యగుచు రుచిరపాదపంబను వనంబునకుం బోయి పుష్పలతాజాలమాలికాలాలితంబైన విశాల తాలహింతాలతమాల వృక్షావలయంబైన యవ్వనంబునందు మణిదర్పణ స్వచ్ఛంబైన సరోవరంబు గని సిద్ధాంగనాపయోధరప్రదేశచందనసురభిగంధ బంధురంబైన జలంబులును బాలబిసాంకురంబులునుపయోగించి విశ్రమించి, 668

కః ఘనకుచ రుచిరస్తబకను
వినుత కటాక్షేక్షపంక్తి విభవను గజగా
మిని నొక్కకన్యగాంచెను
వనదేవత వోలె దాని వన మధ్యమునన్. 669

క॥ ఆ కన్యఁజూచి మదనశ
రాకుల చిత్తుఁడయి నిజశరాపాత హతా
నేక మృగవత్తశాసన
మాకులితుఁడు? బలెను బోలె నతిచంచలుఁడై. 670

క॥ మునికన్యక నచ్చటఁ దా
ననురాగముఁ బొంది తత్సహాయుండై య
వ్వనజాకరమునకు మగుడ
జనుఁదేరగ సాంధ్యమయ్యె చయ్యన నంతన్. 671

ఆ॥ భువన భూషణుండు పొల్పుగ నపరాద్రి
కరుగుటయును నంత నంధకార
మెసగి దిశలనిండె నిట్లేఁగి రోదసీ
వివరమెల్లనిండె విస్మయముగ. 672

ఉ॥ అంగజవైరి శేఖర మనంగుని కంటెను నుబ్బు జారకో
త్తుంగ దవాగ్ని పాంథజనదుస్తరతా భయవేధ మానినీ
సంగమకారి సంతమసజాల విజృంభ నిరాకరుండు ది
వ్యాంగుఁడు రోహిణీశుఁ డుదయాద్రిపయిన్విలసిల్లె నెంతయున్. 673

ఆ॥ అంత నృపతి యొక్క యశ్వత్థతరుమూల
మందు బాలపల్లవముల శయ్య
నొనరఁజేసి దాన నునిచి లజ్జానత
వదనయైన యట్టి సుదతినంత. 674

క॥ స్తనముల హారాన్వితయై
తనువున కర్పూర పూరితను బోలి శిరం
బున మౌక్తికములఁ బోలియు
వినుతంబుగ ధరణి మీఁద వెన్నెల పర్వెన్. 675

ఆ॥ అతి విదగ్ధుఁడగుచు నా రాజవర్యుండు
ముగ్ధయందు రాగముదితుఁడగుచు

నయముతోడఁ దాని నవసమాగమ సుఖం
బనుభవించె నచట నతి తరముగ 676

వ॥ అంత ప్రభాతసమయంబున నశ్వత్థంబుననున్న బాలముఖుండను బ్రహ్మరాక్షసుండు వికటదంష్ట్రాభీలముఖుండై కోపించి యోరీ! నీవు నా యాశ్రయంబున భయంబొక్కింతయు లేక నీ యారామంబునుం బోలెఁ జూచితే, మదీయస్థానంబిచ్చోటం బ్రియసఖిం గూడితివి, దుశ్చరిత్ర! యిది సేయంగూడునే? భీకరాకార మదీయ క్రూరదంష్ట్రలకు భక్ష్యంబవై చేరితని వెండియు నిట్లనియె. 677

ఆ॥ దేశకాలములు మదిని విచారింపక
మూఢవృత్తిగార్యములు దొరంగి
వేడ్కఁజేసిరేని విపరీత గతియగు
నెట్టివారికైన నెగ్గు వుట్టు. 678

క॥ అనవుఁడు రాక్షసుపలుకులు
విని భీతుండగుచు శరణు వేఁడుటయును గొం
త నయంబునఁ బొందియు మఱి
మనుజపతికి నిట్టులనియె మదిగోపమునన్. 679

వ॥ సప్తవర్షవయస్కుండైన బ్రాహ్మణశిశువు నొక్కనిందెచ్చి తల్లిదండ్రులు కరచరణంబులు పట్టియుండ నీవు శిరచ్ఛేదనంబుచేసి నా కాహారమిచ్చిన సంతుష్టుండనై నిన్ను రక్షింతు నేడవదినంబునందు సమర్పించునది. యట్లు గాని నాఁడు నిన్ను విడువ ననిన రాజవరుండు దాని కొడంబడి విడిపించుకొని ప్రియాసహితుండై తురగఖురాంకితంబయిన మార్గంబు వెనుచని దుఃఖితుం డగుచు పురంబునకు వచ్చి, 680

క॥ తన వృత్తాంతంబంతయు
మును మంత్రులకెఱుఁగఁ జెప్పి భూరివిషాదం
బున నడలగ వారలలో
ననఘుఁడు సుమతియను మంత్రి యచలిత బుద్ధిన్. 681

క॥ ఘనముగ శుద్ధ సువర్ణం
బునఁ బురుషప్రతిమగాను పొలుపుగఁజేయిం
చిన నాభరణమణిప్రభ
లనునెసగ పురంబులో మహాఘోషముగన్. 682

క॥ ఈ పైఁడి ప్రతిమగొని రా
నోపు మనసువాఁడు శూరుఁడొకరుఁడు గలఁడా
యీ పురిలోఁ దన పుత్రుని
నోపుదునని పేదవిప్రుఁడొకఁడొడఁబడియెన్. 683

వ॥ ఇట్లొడంబడి హేమపురుషుంబుచ్చుకొని నిది గృహంబునకుం బోయి దీనవదనయైన తల్లికిని నిర్ధనుండైన తండ్రికిని సువర్ణప్రతిమంజూపి మీ దారిద్ర్యమునకు మోక్షంబుగా దీనింబుచ్చుకొని రాక్షసున కుపహారంబుగా నొడంబడితి నిక్కార్యంబునకుం బ్రియంబగు, పవనచలితంబయిన దీప శిఖియునుంబోలె నతిచంచలంబైన జీవంబును మేధోస్థిరక్తమాంసమయంబైన శరీరంబు పరోపకారార్థమై పోవుట మత్ప్రియంబు మీరు దుఃఖింపవలదని వారి ననునయించి సన్నద్ధుండయ్యె. నంత మంత్రియు నత్తెఱంగు రాజునకెఱింగించి జననీజనక సహితంబుగా నబ్బాలకుందోడికొని బ్రహ్మరాక్షసుడున్న యశ్వత్థంబునకుం దెచ్చెనంత. 684

మ॥ కరముల్గాళ్లను తల్లిదండ్రులొగి జక్కంబట్టి రాత్మీయ ని
ష్ఠుర చిత్తంబులతోడఁగూడ మదిరాజున్ బాలకుంజూచి ని
ష్ఠురుఁడై యసియెత్తె నాతని శిరఃఖండంబు సేయంగ, భీ
కరదంష్ట్రాస్యుఁడు బ్రహ్మరాక్షసుఁడు కాంక్షంజేరె భక్షింపగన్. 685

సీ॥ కాళ్లను చేతులు గదలకుండగఁ బట్టి
తను జూచు తల్లిని దండ్రిఁ జూచి
యతిభుభుక్షా వివృతాస్యుఁడై చేరి యు
గ్రతనున్న బ్రహ్మరాక్షసునిఁ జూచి

ఖడ్గంబు వెఱికి నిష్కరుణుఁడై యేయం గ
 రంబెత్తికొనియున్న రాజుఁజూచి
యితని వాలునగూలి యిందఱి కుపకారి
 నగుదునేయని తన యాత్మదలచి

తే॥ నెమ్మితోడ బరోపకారమ్ము సేయ
సన్మతియు భక్తియును మీఁది జన్మములను
వలయు సైప నాకని తలఁచి విప్రు
సుతుఁడు రుచిరాస్యుఁడై నవ్వి సొలసెనంత. 686

వ॥ ఇట్లు నగిన విప్రబాలకుం జూచి రాజుం బరిజనంబులును విస్మయాకులితులై యిట్టిధైర్యంబులెందును వినంబడవని యతని సామర్థ్యంబు వర్ణింపుచుండిరని కథచెప్పి బేతాళుండు నరేంద్రా! యతి దారుణంబయిన యట్టి యవసరంబున నబ్బాలకు నవ్వగారణంబేమని యడిగిన విక్రమసేనుండిట్లనియె. 687

సీ॥ శిశువేమి చేసియు జేడ్పడఁ బరతెంచి
 తల్లిదండ్రుల మఱ్ఱుదనరఁ జొచ్చు
నటుగాకయున్న భయాతురుండై వచ్చి
 యిమ్ములఁ బతిశరణంబు చొచ్చు
నదిలేక నిర్వాణుఁడై పూజితంబైన
 దైవంబు భక్తితోఁ దగదలంచు
వీరు వారిద్దరు విపరీతగతిఁజేసి
 తను జంపగా జేరిరనుచుఁ జూచి

ఆ॥ తన పురాకృతంబు తలపంగ నతి విచి
త్రంబుగాదె యనుచు దలచి యధిక
సత్త్వయుతుఁడు గాన సద్భావమునఁ జేసి
నగియె నదియె గారణంబు గాగ. 688

వ॥ మఱియు బలహీనుండెల్లవారిచేతం బరిభవింపంబడునని తలంచి దరహసిత ముఖుండగుచు, రాజు ముఖంబును రాక్షసముఖంబునుం జూచి నగియె

ననిన బేతాళుండదృశ్యుండై వృక్షంబునకుం బాఱిన వాని వెనుకంబోయి యెప్పటి యట్ల పట్టుకొని వచ్చునెడ నరేంద్రా! రాకపోకలంజేసి యతిశ్రాంతుండవైతివి వినోదార్థంబుగా యింక నొక్క కథ జెప్పెద చిత్తగింపుమని యిట్లనియె. 689

## కథ 21

కII అనఘ! విశాలపురంబున
ధనపతి యొక వైశ్యుఁడర్థదత్తుండనఁనా
తని సుత యనంగమంజరి
యను కన్యక గలదు తండ్రి కతిముదమొదవన్. 690

తేII రూపయౌవన తారుణ్య రుచిరగాత్రి
యైన యక్కన్య జూడగా నరుగుఁదెంచి
లీలవరియించెఁ దామ్రలిప్తపురంబున
వాఁడు మణికర్ణుఁడనియెడు వైశ్యవరుఁడు. 691

వII అర్థదత్తుండు తన కూఁతుమగనిం బోనీక యయ్యిద్దరను తన యొద్దన పెట్టుకొని యుండ కొండొక కాలమునకు నొక్క నాఁడు మణికర్ణుండు మామచేత నాజ్ఞ వడసి తనపురంబునకుం బోయె. ననంగమంజరి కృష్ణసర్పంబు తన్ను విడిచి పోయినట్లెంతయు సంతోషించె. దాని తండ్రియుం దన కూఁతురు తనకు లాభంబైనయంతకంటె నయ్యల్లుండు వెడలిపోవుట కతిహితగృహీత మనస్కుండయ్యెనంత, 692

ఉII ఆ రమణీలలామయును యౌవన దర్పవిలాసమొప్పఁ గ
ర్పూరసుగంధ చందన విభూషితయై ప్రతిపుల్లమల్లికా
సౌరభ సంపదాగమిత షట్పదయై మణిహారమాలికా
హార విలాసియై విమల హర్మ్యతలంబునఁ గేలి సల్పుచున్. 693

వII కర్మవశంబున నందొక్కనాఁడు పురవీథిం జరింపు వానిం గమలాకరుండను విప్రకుమారు మనోభవాకారు నయనానందం బొందఁ జూచి దర్పకసర్పదష్టయై

కంపస్వేదాకులితశరీరయగుచునుండె.నంత విప్రకుమారుండు పద్మరాగమణి పుత్రికయుం బోని యా కన్యకం జూచి దాని రూపాతిశయంబు నకు విస్మితుండై శిరఃకంపంబు సేయుచు దాని కటాక్షపాశంబులం గట్టువడిన వాఁడునుంబోలె నొక్క ముహూర్తంబు నిలిచి తద్గతమానసుండై యెట్టకేనియు నచ్చోటువాసిపోయి, 694

మ॥ తరుణిన్ లోలవిశాల విస్ఫురిత దుగ్ధస్నిగ్ధ నిష్యంద సా
దర సంస్కార సురూప సప్రణయ నిస్తంద్రాశయోద్యత్కటా
క్షరుచుల్వార వశంబుగాక ప్రియపజ్జంబార నయ్యిద్దరన్
సరిగా నాటు మనోభవోజ్వల శరాసారంబు చందంబునన్. 695

వ॥ అంతనయ్యింతి సంతత ప్రవర్ధమాన మదనాగ్ని పరిపీడితయగుచు విమలచంద్రికాపరిపూర్ణంబు కుముదోజ్వలంబులైనరాత్రులు దావా నలంబుగా మృణాలకదలీదళంబులు ధూమకణంబులుగా దలంపుచు నుద్యానవనంబు నందుం దన కొల్చు పార్వతీదేవి నతిప్రేమనారాధించి తన హృదయగతుండైన విప్రకుమారునితోడి సమాగమంబు ప్రసాదింపుమని వేఁడి కృష్ణపక్షచంద్ర రేఖయుంబోలె కాంతిమాత్రావశిష్టయై కంకణంబులు కేయూరంబులుగా నతి కామాగ్నిదగ్ధయైయున్న దానింజూచి మాలతి యను చెలికత్తె దాని చందం బెఱింగి భయపడి తన్నియోగంబున విప్రకుమారుని గేహంబునకుంబోయి, 696

క॥ ప్రచ్ఛన్న విరహమునఁ గడు
తుచ్ఛాకృతి దాల్చి మనసుదూరి ప్రియ సి
ద్ధేచ్ఛారతుఁడై తలచుచు
విఛ్ఛిన్న మనస్కుఁడైన విప్రకుమారున్. 697

ఆ॥ విప్రలాపమెసఁగ వికలుఁడై తన యిష్ట
జనులఁ బాసి యొరులు సంతసింప
నంగజన్మపారుఁడై యున్నవాని న
య్యతివ సూచి యిట్టులనియె నతని. 698

క॥ నినుఁ జూచినదియు మొదలుగ
నవిశము నాహారనిద్రలవి మఱచి మనం
బుననున్నది వెతకోపదు
తనకూఁతగనున్న దా నితంబిని మతియున్. 699

మ॥ తలఁచుంబల్మరు వెచ్చనూర్చు శయనస్థానంబునం బొందు నా
కులయై గ్రుమ్మరుఁ బాయు నెచ్చెలులతోఁ గోపించు తాంబూలమా
ల్యలసద్వస్తువులెల్ల నొల్లదు నినున్ భావించు మైదీగెనుం
బులకల్గ్రమ్మ చరించు నింతి సతతంబుం గామతాపోన్నతిన్. 700

క॥ చందనము నెయ్యి లోకా
నందంబగు చంద్రరుచుల నింధనములు మైఁ
బొందిన చిగుళ్లు మంటలు
సుందరి కామాగ్ని కయ్యె చోద్యంబరయన్. 701

వ॥ అనిన వచనామృతంబునం దడిసి యాప్యశరీరుండయిన వాని నా రాత్రి దోడ్కొని వచ్చి యుద్యాన లీలాగృహంబునం బెట్టి యనంగమంజరి కెఱింగించిన నదియును నానందసంభరితహృదయయై స్నేహతైలపూరితంబైన దీపశిఖయుం బోలె నవాంగంబు దొంగలింప సఖీసహాయయై యతనియున్న సంకేతస్థానంబు నకు వచ్చి, 702

మ॥ అతని న్మన్మథతుల్యుఁజూచి యతికామాయత్త చిత్తంబునన్
ధృతియున్ లజ్జయు నుజ్జగించి ప్రణయోద్యోగంబునం గౌఁగలిం
చి తదాలింగన సౌఖ్యవార్ధిని యణంచెన్మన్మథాగ్నిన్ లస
ద్గత రోమాంచసమంచితాంగలతికన్ గంపంబు సంధిల్లగన్. 703

ఉ॥ ఇక్కడికెట్టకేనియును నిప్పుడ వచ్చితి వింక నిన్ను నే
దిక్కుకు బోవనీనని యధీరత బాష్పకణంబు లొల్కగా
జక్కగఁ గౌఁగలించుకొని చేడియ వాని వియోగ భీతిచే
గ్రక్కున బ్రాణముల్విడిచె కౌఁగిలిబింకముడిల్ల నచ్చటన్. 704

కు॥ తను గౌఁగలించుకొని నె
ట్టన ప్రియప్రాణములు విడుచుటయు గౌఁగిలి మె
ల్లన వదలిపాసి యాతఁడు
ఘనశోకము చేతఁ జచ్చెఁ గడు భయమొదవన్. 705

వ॥ అంత బ్రభాతసమయంబైన వారి మరణంబులు విని యిరువుర బంధువర్గం బును వచ్చి దుఃఖింపుచుండ ననంగమంజరి తండ్రి యర్థదత్తుండు గతప్రాణ యయిన కూఁతుంజూచి శోకలజ్జాకులితచిత్తుండయ్యె నయ్యవసరంబున.

706

కు॥ తన యూరనుండి వచ్చెం
దన భార్యను జూతుననుచు తన విభవము పెం
పును సమముగ విలసిల్లగ
ననఘుఁడు మణివర్మసముచితానందముతోన్. 707

వ॥ ఇట్లరుగుదెంచి పురజనంబులవలన తన భార్యకుశలంబడుగుచు బంధు వర్గంబున్న యుద్యానంబునకు వచ్చి యుపపతింబొంది గతప్రాణయైన భార్యంజూచి స్నేహప్రకరంబునం జేసి నిలుపోపక నిలంబడి ప్రాణంబులు విడచె,
708

సీ॥ విప్రకుమారకు విడువఁజాలక వైశ్య
తరుణి రాగిణిగాన దగ్ధయయ్యె
దాని బాసిన జీవితంబేల తనకని
యతఁడును ప్రాణంబు లపుడువిడిచె
యన్యసంగతయైన యా భార్యఁగనుఁగొని
మణివర్మ చచ్చె విస్మయముగాదె
యని బంధువర్గంబు నఖిలజనంబులు
నతి విస్మితాకులి తాత్ములయిరి

తే॥ అట్టి యెడను సురగణప్రార్థితయై త్రిలోక?
మాతయగు పార్వతీదేవి మహితమూర్తి

వారి ముప్వురఁ బ్రదికించె వైశ్యకన్య
తన్ను మునువేఁడి కొలుచుట తలచి కృపను. 709

వ॥ అని కథ చెప్పి బేతాళుండు నరేంద్రా! వారియం దధిక రాగంబెవ్వరికి
గలదని యడిగిన దానికి విక్రమార్కుండిట్లనియె. 710

క॥ ఆ వైశ్య తనూజాతయు
ఆ విప్రకుమారవరుఁడు నన్యోన్య స్నే
హావిలమతులై వారు ద
శావస్థంబొందుటరుదె యంగజుచేతన్. 711

ఆ॥ గాఢరాగుఁడఱయఁగా మణికర్ణుండ
యట్లు చచ్చియున్న యాలి జూచి
వజ్రహతుఁడు వోలె వడి జచ్చె నప్పుడ
యఖిలజనులు విస్మయంబునొంద. 712

వ॥ అనిన విని బేతాళుం దలక్షితుండై వృక్షంబునకుం బాఱిన, 713

ఆ॥ వాని వెనుకబోయి వదలక యా వృక్ష
మెక్కి పట్టుకొని యహీనబలుఁడు
గురుభుజమున మోచికొని వచ్చునెడను బే
తాళుఁడిట్టులనియె ధరణిపతికి. 714

## కథ 22

సీ॥ అనఘ! బ్రహ్మస్థలమను నగ్రహారంబు
నందు విష్ణుస్వామి యనఁగఁ గలఁడు
విప్రుండు నలువురు పుత్రులాతనికిని
యధ్యయనాధికులై చరింతు
రంతటఁ దండ్రిలోకాంతర గతుఁడైన
నత్యంత నిర్ధనులగుటఁ జేసి
మేనమామలు దమ్ము బూని రక్షింపగా
గొండొక కాలంబు గుడుచుచుండె

ఆ॥ నంతవారిచేత నవమానితంబున
బొంది యిల్లువెడలి పోయి కూడి
తలఁప మరణమునకు దారిద్ర్య దుఃఖంబ
యధికమని తలంచి యడలి మఱియు. 715

క॥ దారిద్ర్యము కంటె మహా
దారుణమగు పాతకంబు దలపగఁ గలదే?
చేరుదురు మృతుని నలువురు
చేరరు దారిద్ర్యుఁ? జూచి చేరండొకఁడున్. 716

ఆ॥ ఉగ్రభూతములకు నునికిపట్టగు కాడు
గాచియున్ననైన గలుగు గూడు
కలుగదేని చావు గలుగు భూతములచే
ననుదినము దరిద్రుఁడవుటకంటె. 717

క॥ తనకు పురాకృతకర్మం
బనుభావ్యం బెల్లభంగి నది గుడువక కో
రిన రాదు మరణమును దా
జనులకు గలిగింపగా వశమె దైవకృతుల్ 718

వ॥ అని నలువురు దమ దౌర్భాగ్యంబునకు దుఃఖింపుచు దమ్ముందార యుప
శమించుకొని దేశాంతరంబు వోవందలంచి క్రమ్మర మగుడివచ్చు సంకేతస్థానంబు
సెప్పుకొని వెడలి చతురధ్వానంబులం జనిచని యనేక కౌతుకంబులుగల దేశంబులు
దిరిగి కొండొక కాలంబునకుం దమ యిక్కువపట్టుకు వచ్చి తమ తమ
యభ్యసించిన విద్యలిట్లని చెప్పుకొనిరి. 719

సీ॥ చెదరిన యెముకలు కదియించి పొందుగా
నొనరింపగా నేర్తుననియె నొకఁడు
నా యెమ్ముకలమీఁద నాయతంబుగ మాంస
మొనరింపగా నేర్తుననియె నొకఁడు

ఆ మాంసమున దోలురోమంబులను నంట
నొనరింపగా నేర్తుననియె నొకఁడు
ఆ శరీరమునందు నమరిన ప్రాణంబు
లొనరింపగా నేర్తుననియె నొకఁడు

తే॥ యిట్లు దమ విద్యలొండొరు లెఱుఁగఁ జెప్పి
మనల విద్యామహత్వంబు మానుగాగఁ
జూడదగు వేడ్కలర నొక్కచోట ననుచు
నడవిలోపల నెల్లరు నరిగి యరిగి. 720

వ॥ ఒక్కయెడ దైవవశంబునంజేసి చచ్చిన సింహంబనేకశ్వానంబులచేత రక్తమాంసంబులెల్లం బోయిన దాని యెముకలు జీర్ణంబులై చెదరియున్నఁ జూచి యిందు మన విద్యాప్రభావంబు లెఱుంగవలయునని యచ్చోట నిలిచి యందొక్కరుం డస్థులెల్లంగూర్చి పొందుచేసె, రెండవవాఁడు దానిని మాంససహితంబుగాఁ జేసె, మూడవవాఁడు తోలురోమంబులు నతి నిబిడంబుగాఁ జేసె, నాలవవాఁడు దానికి ప్రాణంబులు దెచ్చె నయ్యవసరంబున, 721

క॥ బలుకోరలు మెఱవగ ను
జ్వలరుచులెసగంగఁ గసిమసఁగి సింహం బాఁ
కలిపెలుచఁ జేసియప్పుడ
నలుగుర భక్షించి కాననమునకుఁ జనియెన్. 722

వ॥ అని కథ చెప్పి బేతాళుండు నరేంద్రా! ప్రాణివధోద్భూతంబైన పాతకం బెవ్వరి దాఁకు ననిన విక్రమసేనుండిట్లనియె. 723

క॥ ఇందేమి సందియము గడు
మందుండై సింహమునకు మానుగ ప్రాణం
బొందించిన యాతఁడు సూ
నిందితుఁడును పాతకుండు నిశ్చయ మఱయన్. 724

వ॥ అప్పుడు బేతాళుండలక్షితుండై వృక్షంబునకుం బాఱిన విక్రమసేనుండు బాఱి వానిపట్టుకొని వచ్చునెడ నరేంద్రా! యింత మాయా సహిష్ణుండవగుదే యొక్క కథ యవధరింపుమని యిట్లనియె. 725

## కథ 23

సీ॥ అనఘ! యజ్ఞస్థానమనఁదగు నగ్రహా
రమన కళింగదేశమునఁ గలదు
యజ్ఞసేనుఁడనంగ నందు విప్రవరేణ్యుఁ
డనఘుఁడు వంశపావనుఁడు గలఁడు
తత్కులాంగన సోమదత్త వారి సుతుండు
ఘనుఁడు దేవస్వామి యనఁగ బుద్ధి
సకలవిద్యాకళా సద్గుణాంభోనిధి
యౌవన శ్రీయుతుండై వెలుంగు

ఆ॥ గుణములనేకముల్ కోపించి విధిచేత
నతఁడు కీర్తిశేషుఁడైన సకల
జనులు తమకమునను సంతాపమొందిరి
సజ్జనులకు సకలజనులు హితులు. 726

వ॥ అధిక శోకంబునఁ గాందిశీకులై తల్లిదండ్రులు విలపించుచుండ బంధువర్గం బతనిందెచ్చి భూతబేతాళావృతంబయిన శ్మశానంబునందు సంస్కరింపుచున్న యెడం దత్ప్రదేశంబుననున్న వామశీరుండను వ్రతస్థుం డవ్విప్రకుమారు సుకుమారాకారంబైన శరీరంబు చూచి జరాజీర్ణంబయిన శరీరంబు దిగవిడచి యందు బ్రవేశింతునని తలంచి మఠంబు సొచ్చి ధ్యానతత్పరుండై మఱియును, 727

తే॥ శోకదగ్ధుఁడగుచు నశ్రువులు దొఱుగ
నేడ్చి చింతించి మఱి ముఖమెలమిఁ బొంది
జడలు దూలంగ నతి గతోత్సాహుఁడగుచు
నర్తనముచేసి సుప్రసన్నత వహించి. 728

వ॥ పద్మాసనాసీనుండై నిశ్చలధ్యానం బొనరించి యురగంబు కుబుసం బూడ్చినట్లు తన శరీరంబు విడిచి శూన్యగృహంబు సొచ్చినట్లు ద్విజశరీరంబు ప్రవేశించె నంత, 729

క॥ అనఘుఁడు నిదురించియు మే
ల్కను విధమున లేచి యచటగల వారెల్లన్
తను జూచుచుండ నప్పుడు
జనులద్భుతమంది రధిక సంభ్రమమెసగన్. 730

వ॥ తల్లిదండ్రులు దేవప్రసాదంబునంజేసి తమ కొడుకు బ్రదికెనని బంధువులు దారు నతనిం బ్రార్థింపుచుండ వారల పలుకులాదరింపక తత్కాల సంజాత వైరాగ్యుండై యప్పుడ పూర్వవ్రతంబు ధరియించె నని బేతాళుండిట్ల నియె. నరేంద్రా! యా తపోధనుండు పరకాయప్రవేశంబు సేయదలంచి యశ్రుపూరితముఖుండై యేడ్చుటకును మఱి యుత్సాహంబుధరియించి నర్తనంబు సేయుటకుం గతంబేమి యని యడుగుటయు వానికి నమ్మహీవరుం డిట్లనియె. 731

సీ॥ తల్లిఁ బోషింప సంతతము బాల్యంబునఁ
 బెఱుగుచు యౌవన స్ఫురతఁ బొంది
తనచేతఁ దగలాలితంబయ్యు సకల సు
 ఖానుభవంబును మానుగాగ
చిరకాల సంగతి చెందిన దేహంబు
 ముదిసె నటంచును వదలవలసె
నని దానిఁ బాయుచు నతిదుఃఖమునఁ బొందె
 నొరి సొచ్చు దేహంబు నొఱపు సూచి

ఆ॥ తనకు నాశ్రయింప దక్షతావ్రతసిద్ధ?
తనకు తాన నేర ననుచు హర్ష
యుక్తుఁడగుచు దర్పమొదవంగఁ దా నర్త
నంబు సేసెఁ గారణంబులివియ. 732

వ॥ అనిన విని బేతాళుండలక్షితుండై శింశుపావృక్షంబునకుంబాఱిన వాని వెనుకంబోయి కట్టిపట్టుకొని యెప్పటియట్ల వచ్చునెడ నరేంద్రా! యింత యాయాసంబునుం బొందనేల? నన్ను పరిత్యజించి సుఖంబులనుభవింపుము. కాదేని యొక్క కథ చెప్పెద చిత్తగింపుమనుచు నిట్లనియె. 733

## కథ 24

క॥ మనుజేశ! తామ్రలిప్తం
బనగల నగరమున శూద్రుఁ డధికబలాఢ్యుం
డొనర వృషసేనుఁడను వాఁ
డనఘుఁడు గలఁడతనికి సుతుఁడధికుఁడు కాంతిన్. 734

వ॥ వాని పేరు వృషకేతుం డనంబఱం గతండు నవయౌవనుండై యొక్క నాఁడప్పురవీథిని జరియించుచు సుమంతుండను హాలిక కులదీపకు సౌందర్య యౌవనయైన కందుకావతి యను దానిం గందర్పుదీమంబునుంబోలె నున్న యయ్యింతింగనుంగొని కామమోహితుండై మదన బాణముల కునికిపట్టయ్యె. నంత నక్కన్యకయును సురుచిరాకార మనోభవుండైన వృషకేతుంజూచి యత్యంత మోహితయై 735

క॥ విరహానలమున నంగన
పరితాపముఁ బొంది యపర పక్షాంత నిశా
కరు పగిది డస్సె నెంతయు
నురమును సతి నడుమునొక్క యునికిగ నుండెన్. 736

క॥ పాటలగంధికి మన్మథ
కూటవ గవగూడకెట్లొకో యిక నే నె
ప్పాట జరియింతు ననుచు
న్నేటికి నెదురీదినట్టు లింటికి నరిగెన్. 737

వ॥ ఇట్లు వోయి విరహగృహంబున సెజ్జయందు మేను వైచియున్న సమయంబున నతనితోడ బద్ధసఖ్యయైన దూతిక వనమంజరి యనునది వచ్చి యతనిచేత సత్కృతయై యుచితాసనంబున నుండి యతని యాననం బాలోకించి దరహసిత వదనయగుచు నిట్లయె. 738

చ॥ పురహరుకర్ధ, మబ్జజుని పుక్కిటియందు మురారికెంతయున్
న్నురమునఁ బెట్టి యా జగములొక్కటగెల్చిన యట్టి జట్టికిన్
మరునకు నగ్గమై కుసుమమార్గణముల్ గడునొప్ప నీ గతిన్
విరహముచేత నొచ్చి గడువేసట నొందుచు నున్నవాఁడవే. 739

వ॥ అని నవమంజరి పలికిన దానికి వృషకేతుండు..... 740

క॥ ...........................
........... నొకనాఁడు మరునిసాయకమొ యనన్
పెనుపొంద నీలకుంతల
ఘనకుచ హరిణాక్షి గంటి కన్నులునిండన్. 741

మ॥ ...............................................బులున్
వలరాజు న్నలిబృందముం బికచమూవర్గంబులు న్మావిమ్రో
కలు బాలానిల వ....................................
.......గదియించి నా హృదయు ముందక్కంగ సేవింపరే. 742

ఆ॥ కాంతపేరుకందుకావతి యన జను
నతివ.............................
.............................బు చేకొని
బొంది జీవుడుండ బొందు సేయు. 743

క॥ అని పలుకఁగ నవమంజరి
మనమలరగ నతని...............
..................................
............ను మానుమంచు నప్పుడ యటకున్. 744

ఆ॥ పోయి చెలియ యంత పొలఁతియుం ... ర చేరి
పూర్వ...................................
................................ బులచే
నెఱిఁగిపోయి యెదుర మెరుఁగు బోణి. 745

క॥ లీలావనంబు లోపల
మేలగు.......................

.................................
......................ప నిలయను గాంచెన్ 746

కII కనిచేర బోయి యా సతి
యును పగ నుచితాసనమున నుండియు నగుచున్
తను మధ్య య...............
........................... 747

కII అనవుఁడు నదియెల్ల బ్రయో
జనములు వనజాస్య! నీకు జెప్పవలయు వ
ల్వని పనులు గలవె సెప్పెద
విను వె.............................. 748

కII .................. కిందట
నతివాహము జనెడివాని నభినవ మదనున్
చతురపతిని వృషకేతును
నతి ముదమొదవంగ గంటి............... 749

ఉII ......................మారుని సాయకపుష్పసంజ్యముల్
పావకుఁ డా సుధాకరుఁడు పర్వినమంట చెలంగి దిక్కులన్
యా వలదా............................................
..................నెక్కి మరి వానికి బ్రాణము లెక్కునే చెలీ. 750

కII కాముని బాణములైదును
వేమరు నొవ్వంగ జొచ్చె వెలది యిఁక....
............................
.............................లలోనైనన్. 751

ఆII అనుచు నశ్రుధార నందందఁ దొఱగంగ
వెచ్చనూర్పు మఱియు విహ్వలించు
తాపమొందు నంత దైన్యత మూర్ఛిల్లు
నబల ప్రాణనాథు నాత్మ దలఁచి. 752

వ॥ ఇట్లవస్థం బొందుచున్న కందుకావతిం జూచి సేదదేర్చి నవమంజరి యిట్లనియె. 753

క॥ బాలకి యేఁ గలుగగ మరు
వాలమ్ముల పాలువడగ వలవదు వానినిన్
లోల మనస్కుం గానిట
యీ లోలఁ జేసితెత్తు నిందఱు మెచ్చన్. 754

క॥ అని పలికిన పలుకులు విని
మనమందున సంతసిల్లి మగువా! నన్నున్
ఘనుఁడగు నాతఁడు గూర్చిన
నినుఁ బోలగఁ గలరె సములు నీరజవదనా! 755

వ॥ అని యిట్లు సరసాలాపంబులు సేయునెడ, 756

ఉ॥ అంతట సూర్యుఁడేగె నపరాద్రికి చీకటి నిండె దిక్కులన్
సంతసమంది చోరులును జారులునుం జరియింపఁ జొచ్చి రా
యెంతయు శంకలేక కడు నిక్కురమైన వియోగకామినుల్
వంతురె వేడుకల్ విటులు వారి యిక్కువ పట్టుకెందులన్. 757

క॥ పగలు మెలంగెడు జీవుడు
దిగబడియెను రాత్రి చరులు దిరుగంబడియెన్
గగనము కాటుక పూసిన
పగిద నొనరె నంత దూర్పు భాగమునందున్. 758

ఆ॥ చక్రవాకదోయి చంచలమంద చ
కోరదంపతులకుఁ గుముదములకు
నెలమి మిగులుచుండ నిందిర సైదోడు
చందురుండు వొడిచె జలధి వొంగ. 759

క॥ దశదిశలఁ దమము విఱిసెను
విశదముగాఁ గాచె నిండువెన్నెల విహగుల్

వశమైన రీతి నభమున
శిశిరకరుం డుదయమయ్యె శీఘ్రములోనన్ 760

వ॥ ఇట్లు చంద్రోదయంబున వృషకేతుండు కందుకావతిం దలంచి యత్యంత మదనవేదనాకులుండై ధరియింప లేక గృహంబు వెడలి యుపవనంబు లోనికిం బోయి మాధవీలతాగృహంబునందు నిందుశిలా పర్యంకంబు మీఁద మేను వైచి కామానలజ్వాలా పరితప్తుండగుచుం దనలోన, 761

సీ॥ కామినీ ముఖతిలకము దియ్యబల్కులు
సిగ్గుకు వగతాను చిక్కునొక్కొ
ఆ నీల కచభార యధరసుధారసం
బర్థితోనానంగ నబ్బునొక్కొ
తనుమధ్యతోఁగూడి దర్పకకేళిలో
నేపార నలయింపు టెన్నఁడొక్కొ
రతిశ్రమంబునబొంది రాయంచగమనతోఁ
జెందిన సుఖనిద్రఁ జేతునొక్కొ

ఆ॥ యనుచు వెచ్చనూర్చు నందందఁ బలవించుఁ
బయలు గౌఁగలించు బమ్మరించు
దిశలు చూచులేచు ద్రిమ్మరు గూర్చుండు
తరుణి దలఁచి మిగులఁ దాపమొందు. 762

వ॥ ఇట్లత్యంతావస్థం బొందుచున్న సమయంబున కందుకావతిని వీడుకొని నవమంజరి వచ్చి వాని గృహంబులో వృషకేతుంగానక సంభ్రమిత హృదయయై కేలీవనంబులోనికిం బోయి పొడగాంచి తన పోయివచ్చిన వృత్తాంతం బంతయు జెప్పిన విని సంతుష్టహృదయుండయ్యె నంత నా రాత్రిశేషంబగు సమయంబున, 763

క॥ మేలుకని దిశలు గనుగొని
నీలిగి కడు నిక్కి గూసె నెరిఁ గుక్కుటముల్
బోలగ జిలిబిలి యనుచును
నోలిమెయిం బక్షులెల్ల నొయ్యన పలికెన్. 764

వ॥ అంత, 765

చ॥ కలువల దాడికాఁడు దివికాంత మనోజుఁడు చక్రవాకలన్[1]
పులుగుల గూర్చు నిక్క, యల పూర్వ మహేంద్ర విభూషణంబు శ్రీ
వెలయ వెలుంగు తామరల వేడ్కసఖుండు తమోనృసింహ ము
జ్జ్వలతర దీధితుల్ దిశలఁ బ్రాఁకగ సూర్యుఁడు దోచె తూర్పునన్. 766

వ॥ ఇట్లు సూర్యోదయంబైన నవమంజరిని వీడుకొలిపి వృషకేతుండు యథోచిత కార్యంబులు వర్తించి యా దినంబెల్ల నొక్క వత్సరంబు చందంబునం గడిపి రాత్రియగుట నవమంజరి పాలికింబోయి దానిని ప్రియాలాపంబులం బ్రసన్న హృదయం జేసి సంకేతస్థానంబు సెప్పి కందుకావతిపాలికిం బంచిన నదియును నతిత్వరితగమనంబునం బోయి తన రాక గోరుచున్న దానిం జేరంబోయి దాని ప్రియపంపునం జెలు లెఱుంగకుండ నిట్లనియె. 767

క॥ తరుణీ! యా వృషకేతుని
మరుశరములు బోనియట్టి సరసమృదూక్తి
న్నరుదెంచి గూఢమగు నొక
వరగృహమునఁ బెట్టి యిటకు వచ్చితిఁ జుమ్మీ. 768

చ॥ అనవుడు నప్పుడింతి గడునద్భుత సమ్మదముల్మనంబులో
బెనగొన దానిఁ జూచి నను పెద్దయు మన్ననజేసి వేడ్కమై
మునునఁట రేయి వోయి జనముఖ్యుని నిప్పుడ దెచ్చి ప్రీతి నా
కొనరగఁ జేసినట్టి చెలియొండు దలంపగలేదు కోమలీ! 769

వ॥ అని యిట్లనేక ప్రకారంబులగు స్తోత్రంబులు చేసి తలిదండ్రులు చెలులు నెఱుంగకుండ దాని పజ్జన బోయి సంకేత గృహంబుసొచ్చి ప్రత్యక్ష మన్మథాకారుండైన వృషకేతుంజూచి లజ్జావనత వదనయై ఘర్మకణంబులుం దొరుగ నుండె. నవమంజరియు తన గృహంబునకు నరిగె నంత, 770

1. చక్రవాకలన్ దోయిలలుగ.

కు॥ తరుణికి ముఖకమలముపై
పరగఁగ లజ్జాతమంబు పర్వినమగుడన్
విరియించె బ్రభాతంబున
నరుణకిరణ మంబుజంబు నలరించు గతిన్. 771

వ॥ ఇట్లు చతురాలాపంబుల లతాంగి లజ్జ యుడిపిన నసమాన సురతవార్ధి నోలలాడుచుం గొన్ని దినంబులుండి యొక్కనాఁడు తమలోన మా వారెఱింగిరేని భయంబు పుట్టు నెట్టకేనియుం బోదమని విచారించి యర్ధరాత్ర సమయంబున వెడలి వచ్చునెడ నొక్క విపినంబులోన శస్త్రాస్త్ర ప్రవీణులగు చోరుల నిర్జించి యుజ్జయినీపురంబునకు వచ్చిన నప్పుడఁతి యాఁకలి యయ్యెడు గదలలేనని చిక్కుటయును దాని మోచికొనిపోయి యొక్క యీశ్వరస్థానంబునందిడి యశనంబు దెత్తునని పట్టణంబు లోనికింబోయి యప్పురవీథిం జరియింపుచు నొక్క రూకయిచ్చెద నన్నంబు గలదే యని యడుగుచుండ నొక్క హర్మ్యతలంబు మీఁది నుండి యిందురేఖయను వారకాంత వాని రూపలావణ్యంబులు చూచి మదన జ్వరపరవశయై తన ప్రాణసఖియునుం బోని సుమతి యను చెలిం బిలిచి యొక్క సుకుమారాకారుం డశనార్థియై యల్లవాఁడె తిరుగుచున్న వాడని చూపి నీ యుక్తి విశేషంబునం గొనివచ్చి నా హృదయం బలరు నట్లు గావింపు మనుటయు నతిత్వరితంబున నరిగి యతని కిట్లనియె, 772

కు॥ దేవతవో? మనుజుఁడవో?
భావింపగ రాదు నిన్నుఁ బ్రవిమల రూపా!
మావారశనము పెట్టెద
రేవలనం దిఱుగవలదు యింటికిరావే. 773

కు॥ అని పలికిన పల్కులు
తన చెవులకు మధురమగుడు దానికి ననె నా
వనితకు నన్నంబిప్పుడు
గొనిపోవగఁ గలిగెననుచుఁ గోమలి సనగన్. 774

ఆ॥ దాని వెనుక బోయి తరుణి రూపకమిదె
యన్న మిటకుఁ దెమ్ము అనిన నదియు

నిచట నెంత దవ్వు ఇటు రమ్ము అనుచును
జనియె హర్మ్యతలమునకును గొనుచు. 775

వ॥ అతండు విధిప్రేరితుండై వంచన యెఱుంగక పోయి యశనం బడుగుటయు నదియు నీవు గొనిపోవవలయునే యిక్కడనె భోజనంబు సేయు మనుటయు నా పడఁతి యొక్క చోటనున్నది దాని దిగవిడిచి యెట్లు గుడుతుం గొనిపోవలయు ననుటయు నవ్వేశ్య యిట్లనియె. 776

క॥ నీ వారగించు మిచ్చట
భావజసమతేజ! వెనుక బడఁతికిఁ గొనిపో
నావుఁడు నాకఁటి పెల్లున
భావింపక భోజనంబు పరగం జేసెన్ 777

వ॥ అప్పుడిందురేఖ యాతం దన్య సతీప్రీతుండగుట యెఱింగి తన వలనం జిక్కమికి విచారించి వీనిం బొందకుంటినేని జన్మంబు నిష్ఫలంబ యని తలంచి సుమతితో విచారించి యౌషధం బన్నంబులో గలపి పెట్టిన నతండును యెఱుంగక భుజియించి కందుకావతి మీఁది తగులంబు మాని సర్పదష్టుండునుం బోలె నుండి కొంత తడవునకు సేదదేఱి యిందురేఖం దగిలి యుండెనంత, 778

ఆ॥ కందుకావతియును కడు శ్రమంబున క్షుత్తి
వేధబొంది పెంపు వృద్ధిమాలి
వరుని రాకలేక తెఱువులు వెదకుచు
నడలుచున్న యట్టి యవసరమున 779

ఆ॥ పిన్ననాఁడు దూతి పిదపనువేశ్యయు
గృహిణియు తంతువిక్రియయు నగుచు
వెనుక నిన్ని పనులు విడిచున్న తలతోడ
నున్నగొంటు వనిత యొకతె వచ్చె. 780

వ॥ వచ్చిన దానిం జేరంబిలిచి రూపవంతుం డింతకు మున్నశనార్థియై పురంబు లోపలికి వచ్చి యిదెరాక తడవు సేసె నతనింబొడగానవే యనుటయు నయ్యింతి

తోడ నీ పట్టణంబున నా యెఱుంగనిది లేదు నేనెచ్చటం బొడగా ననుటయు నతిదుఃఖితయై యెలుంగెత్తి యేడ్చుటయును నూరార్చి నీకింత శోకింప నేల నా గృహంబునకు రమ్ము నీ కాంతు నఱసి తెచ్చెద ననుటయుం బ్రహృష్ట హృదయయై దాని యింటికింబోయి మజ్జన భోజనంబులు దీర్చి దాని చేతం దన పురుషుని నిలుకడ రయింపుచుం గొంతకాలంబున్నం దత్సమయంబున 781

కII పసిబాలుఁడు రూపునఁ జె
న్నసలారెడు వైశ్యుఁడొకఁడు నా తెఱువున దా
మసలుచును కందుకావతిఁ
బొసగగఁ బొడగనియె రాకపూర్ణేందుముఖిన్. 782

వII ఇట్లు పొడగని తనలోన, 783

ఉII ఆ సతిమేను బంగరు శలాకయొ యున్నత చన్నుదోయి యే
యీ సరి చక్రవాకములొ యిందునిభాస్యము హంసయానమున్
బాసర సింగిణీ ధ్వనులు పల్కులుగా రచియించె కాముఁడీ
బూసల............ పేక్ష యెడ పుష్పశరావళి నన్ను నింపెడిన్. 784

వII ఇట్లు వైశ్యకులబాలకుండు కందుకావతింజూచి యనంగశరపీడితుండై యజ్జరభింబొందు చేసుకొని యప్పా య............ని నా హృదయేశ్వరిం జేసి ప్రాణంబులు శరీరంబును నిలునట్లు సేయవే యనుటయు నయ్యింతి యియ్యకొనిపోయి యనేక విధంబుల బుజ్జగించి దృష్టాంతంబులు చూపి నీ పురుషుండెవ్వతెం దగిలి యుండెనో వానికింత వెఱవనేమిటికి కామోపభోగంబు లేని యౌవనంబు నిరర్థకంబు జారసంభోగంబులు వాసి యందు సౌఖ్యంబు నొందుమని చెప్పిన విని విషణ్ణచిత్తయై యుండియుం దనలోన, 785

సీII తలిదండ్రి చెలుల బాంధవుల నెల్ల విడిచి
కులశీలముల పట్టు కుఱుచఁ జేసి
యిచ్ఛానురక్తనై యెవ్వరి మెచ్చక
యిలువీడి త్రుళ్లుచు నితనిఁ దగిలి

వచ్చితివాఁడును నిచ్చట దిగవిడిచి
యే వంకఁ బోయెనో యెఱుఁగ రాదు
తివిరి నాకెవ్వరు దిక్కులేకున్నచో
నీ యింతి ప్రాణంబు లెలమిఁగాచె

ఆ॥ లలన యాడినట్టి పలుకులు సేయంగ
నొడబడకను నున్న వెడలనడచు
మొదల యెల్లనాఁడె యిదియుఁ గావలసింది
చెడ్డసతుల గోష్ఠి చెడుట యరుదె. 786

వ॥ ఇట్లు కందుకావతి డోలాయమానమానసయై కొంత తడవు చింతించి చిత్తంబొక్కింతఁ జేసికొని యల్లన నొడంబడియె. నజ్జరభియు దూరంబున నాఁగియున్న వైశ్యపుత్రుని గూఢంబగు గృహంబున నిలిపి కందుకావతి నతని కడకుంబంపిన నదియును నతని వచనంబులకు సిగ్గు విడచి యొక్క సెజ్జ నున్న సమయంబున నొక్క మూషకయుగ్మంబు గృహంబు వెన్ను వెంటం గలహించుచున్న సమయంబున వానింజూచి వైశ్యపుత్రుండొక్క విల్లునుం గోలయుం బుచ్చుకొని యా మూషకంబుల రెంటినిం గూలనేసి తన ధనుఃకౌశలంబును దోర్గర్వంబునుం దానె మెచ్చి పొగడుకొన్న నక్కందుకావతియును, 787

క॥ మును చేసిన విక్రమములు
మనమునఁ దలపోసి యపుడు మానిని వృషకే
తను దలఁచి యంతలోనన
సనియెను పరలోకమునకు సంతాపితయై. 788

క॥ జీవము విడచిన పడతిని
భావింపుచు వైశ్యసుతుఁడు పరవశుఁడగుచున్
యే వలనఁ బోక వరచుచు
చేవ చెడగవచ్చె నేమిసేయుదు ననుచున్. 789

క॥ కృతనిశ్చయుఁడై చచ్చుట
మతమని తలపోసి యతఁడు మఱి యిచ్చటనే

మృతమైన దగును కార్యము
మతమలరగ జేయకున్న మంచిదె తలపన్. 790

క॥ ఏనుండి యెల్ల సొమ్ములు
దానముగాఁ జేయవలయు తరుణీ! నాకున్
జానుగ గంధపు మ్రాకులు
పూని యొనర్పించెదను విభూతిగ వెలయన్. 791

వ॥ అని విచారించి మరణోద్యోగుండై యా రాత్రి గడపి మరునాఁడు పురంబునం గల తన మిత్రులతో తాను ప్రియురాలితో ననుగమనము సేయుచుండ ధనంబంతయు దానంబు సేయవలయునని చెప్పి యందఱు రండని చాటించి సర్వజనుల రప్పించి ధనంబంతయు వెదచల్లి చందనకాష్ఠంబుల సొదవేర్చి కందుకావతి నలంకరించి దానితోడం గూడి శ్మశానప్రదేశంబునకుంబోయి యున్న సమయంబున వృషకేతుండును నిందురేఖయును నా వార్త సుమతిచేత విని చూడవలయునని విచారించి, 792

క॥ పతితోడుత ననుగమనము
సతిసేయుంగాని పతులు సతికై యెందున్
మృతులౌట వినము సన్మతి
జతురతనిది చూడవలయు సరగున పదమా. 793

క॥ అనివారు మువురు నొక్కటఁ
జనుదెంచి పరేతభూమి సనఁజొచ్చి జనుల్
మునుకొని చూడగ సొదపై
మనమలరగ నున్న దాని మానిని తిలకన్. 794

ఆ॥ చూచుచుండ వాఁడు స్రుక్కక యప్పుడ
యఖిల జనులు విస్మయంబు నొంద
శిరసుఁ దెంచుకొనియె బరసతీసంయోగ
మరయఁ బ్రాణహాని యగుట నిజము. 795

క॥ అంత వృషకేతుఁడును మన
సెంతయుఁ గలుగంగ నతివ నేర్పడ రూపం
బంతయుఁ గనుగొని సతిఁ దన
యింతి యగుట యప్పుడెఱిఁగి హృదయము లోనన్ 796

క॥ చింతించి యంతలోనన
కంతుని శరవహ్నిచేతఁ గాలుచు నిలపై
నంతనపడి మృతుఁడైనను
నింతులఁ గడుఁదగిలి చచ్చుటెక్కడ నరుదే. 797

క॥ విషసర్పము గఱచిన రో
చిషముక్తుండైన జనుని చెలువునఁ జచ్చిన
వృషకేతుఁ జూచి యోర్వక
విషదిగ్ధయుఁబోలె నపుడు వేశ్యయుఁ జచ్చెన్. 798

వ॥ ఇందురేఖయును దశమావస్థంబొందిన దాని దాసియైన సుమతి యిందు రేఖావృషకేతనులంజూచి తన జన్మంబు నిరర్థకంబని యప్పుడ తానును ప్రాణవిముక్తయయ్యె, పరివేష్టించియున్న పురజనంబులిందఱి మరణంబులకు సాహసంబులకు నద్భుతంబంది రని కథచెప్పి బేతాళుఁడు నరేంద్రా! యిందఱి మరణకారణంబులు నాకుం జెప్పుమని యడుగుటయు భూవల్లభుఁడు, వైశ్య పుత్రుండప్పుడు వెన్నున నున్న మూషకయుగ్మంబుఁ జావనేసి తనలావు పొగడుటఁ జూచి వృషకేతనుం బాసి యితనిం గూడిన పొందుగాదని పోవం దగునని తలంచి యా యింతి మరణంబునం బొందె, వైశ్యుండును మది గలంగి దీని తోడం జావకున్నం దన సర్వస్వాపారంబును రాచవారు గొందురిందునం జావు దప్పదని తలంచి సరసుండగుటం జేసి, 799

క॥ తానుండి యన్ని సొమ్ములు
దా నా భ్యాగములు వెట్టి తరుణిం గదియన్
భూనుతుఁడై యా కొమలం
దా నరిగెను దోషగుణ విదగ్ధుండగుచున్. 800

ఆ॥ వీరుఁడయిన యట్టి వృషకేతుఁ డల తన
కాంత చావు నెఱుఁగఁ గని మనమున
తన కృతపు వృ.......... సి దీనికి
మరణ ముచితమనుచుఁ బరగఁ జచ్చె. 801

ఆ॥ వాని వలనఁ బ్రీతిమానుగాఁ గలుగుటఁ
జేసి చచ్చె వేశ్య భాసురముగ
కొమ్మదప్పనురికి........ రాలిన భంగి
నక్క మతము దప్పి చిక్కినట్లు. 802

ఆ॥ ఇందురేఖతోడ నీతని మును గూర్చి
యిపుడు వీరిఁ బిలిచి యిటకుఁ దెచ్చి
వారు చావ నేను ధీరతనుండుటే
యనుచుఁ జచ్చె సుమతి యది నిజంబు. 803

క॥ అని యా నరపతి చెప్పిన
విని యటు బేతాళుఁడపుడు వృక్షంబునకున్
జనుటయు దోడనె జని యా
జననాథుఁడు పట్టికట్టి సరభసలీలన్. 804

వ॥ కొనివచ్చు నెడ నరేంద్రా! యొక్క కథ విని నవధరింపుమని యిట్లనియె. 805

## కథ 25

ఆ॥ అవనినాథ! ధర్ముఁడను రాజు దాక్షిణా
త్యుఁడు గలండు దొల్లి భండనమున
బలియులైన భూమిపతులతోఁ గలహించి
తూలి రాజ్యమెల్లఁ గోలుపడియె. 806

వ॥ ఇట్లపహతరాజ్యుండై యెక్కడ నిలువ నవకాశంబు లేక చంద్రావతియును లావణ్యవతియును నను భార్యను ............ (సు) తనుందోడ్కొని యొక్కరుండు నిజపురంబు వెడలి దూరంబు వోయిన నలసగమనలు పరవశలై నడువ నేరకయున్న

నిరువురం జూ ........... ల్లనె మహారణ్యంబు దరియం జనునెడ మయూర పింఛాంబరులును గుంజామయ శిరోభూషణులును నయిన కిరాతులు శార్దూలచర్మపరీతంబులైన వృక్షగృహంబులునుం గలిగి భయం కరంబైన ఖిల్లీభల్లూకాది మృగసంకులంబునునైన వనంబు చేరెనంత, 807

ఉ॥ ఆ యవనీశు వెట్టిన యనర్ఘ్యములైన విభూషణంబు లా
బోయలు చూచి యాసపడి పుచ్చుకొనం జనుదెంచునంత న
త్యాయతకాయుఁడొక్కరుఁడు నందఱదాఁకి కిరాతులన్మహా
కాయులఁ జంపి తాను ఘనకాయము నొప్పగఁ జచ్చెనచ్చటన్. 808

ఉ॥ ఆ నరనాథుఁడీల్గుటయు నంగన లచ్చటువాసి కూఁతురుం
దాను రయంబునం జనియెఁ దల్లడమందుచు వల్దచన్ను లా
పీన పిఱుందులుం దొడలు పెంపగుగొప్పులు దూలుచుండఁగా
నానతగాత్రులై పొదలయంతరముల్ సని మ్రొగ్గి స్రుక్కుచున్. 809

క॥ పులిగాంచిన లేడుల గతి
నెలఁతలు భయచలితలగుచు నీలోత్పల దీ
ప్తులు దొలఁగి క్రందు కొనగా
నలుకుచుఁ జూచుచును నరిగి రుగ్రాటవులన్. 810

తే॥ లుంగవల్లీలవంగవల్లులఁ బెనంగి
కమలసౌరభ్యచలమలఁ గరము రమ్య
మగు సరోవర తీరవనాంతరమునఁ
జొచ్చి డాగిరి తలఁకుచు సుదతులంత. 811

వ॥ ఆ ప్రదేశంబు కప్పుడు మృగయార్థంబు చండసింహుండను క్షత్రియవరుండు పుత్రసహితుండై వచ్చి యచ్చోటం దిఱుగుచున్న నింతులపాద పద్మాంకితంబు లయిన భూరజంబులు చూచి యిచ్చోట నారీద్వయంబు మెలఁగిన యది కుఱుచపాదంబులదియును దీర్ఘపాదంబులయదియును నని నిశ్చయించి నంత కొడుకు సహర్షమనస్కుండగుచు దండ్రికిట్లనియె. 812

కు॥ అడుగొయ్యన నరసి విరిం
బొడగని యటఁ దోడుకొనుచుఁ బోయెదమేనిన్
నిడుపగు పదతలములు గల
పడఁతుక నీకుఁ దగు పిదప భామిని నాకున్. 813

చ॥ అని సమయంబు చేసికొని యారయుచున్వనభూమిలోన న
వ్వనితలఁ గాంచి దీనమున వాలిన వక్త్రసరోరుహంబుల
న్నను జెమటల్గడల్కొను తనూలతలన్ భయమొందు చూడ్కులన్
బెనఁగిన వేణులం గలిగి పెద్దయు డస్సియు నొప్పు నారులన్. 814

కు॥ కని తోడ్కొని నిజనగరం
బునకుం జని రాత్రివచ్చి భూపతులు సురూ
ప నివాసులైన యింతుల
తనుమధ్యల గోరి యతిముదంబొదవంగన్. 815

చ॥ సమయము [1]దప్పియన్య సవిచారితమై వరియించె మేదినీ
రమణుఁడు చండసింహుఁడు తిరంబుగ దత్సుతుఁడైన సింహవి
క్రముఁడు కుమారశేఖరుఁడు కన్యక దల్లి బయోరుహాక్షి నిం
పమర వరించె నయ్యిరువురందును ప్రేమవహించిరిద్దఱున్. 816

వ॥ అని కథ చెప్పి బేతాళుండు వెండియు విక్రమసేనున కిట్లనియె. 817

కు॥ కొడుకునకుం దండ్రికి న
ప్పడతులయం దుదయ మైరి బహుపుత్రులు పెం
పడరగ దత్కులసంభవు
లొడబడ నేమౌదు రధిప! యొండొరువులకున్. 818

కు॥ అని బేతాళుండడిగిన
జననాయకుఁడెంతయను విచారుండై దా
విని నిర్ణయ మొనరిచి చె
ప్ప నశక్యంబగు టెఱింగి పలుకక తనలోన్. 819

1. దప్పక.

తే॥ కోఁతి యందంద పండులు కొఱికి చించి
చిక్కువచ్చిన వెంట్రుకల్ చిక్కువచ్చు
మనిన తెఱఁగున వీఁడు నన్నడిగె దీని
నెట్టు సూచింతు నొక్కొ నేనిది యెఱుంగ 820

వ॥ అని చింతింపుచుం బోవుచున్న రాజువలన సంతుష్టుండై బేతాళుం డిట్లనియె.
821

చ॥ ధరణిప! నీదు సత్యమును ధైర్యము నస్ఖలితప్రతాపముల్
సురనరపన్నగాదులకుఁ జూచినవారికి విన్నవారికిం
గరమనురక్తి మేనఁ బులకల్వొనరింపగఁ జాలు విస్మయా
దరములు మైశిరంబులు గలల్పగ జాలు ధరిత్రిలోన నీ
సరియె ధరాధినాథులు విశాలగుణాకర వైరిభీకరా! 822

క॥ నీకు నొక హితవుఁ జెప్పెదఁ
జేకొనుమీ క్షాంతిశీలుఁ జిరతరపాప
వ్యాకులత నమ్మవలవదు
యా కడ వంచింపు వాని నది యెట్లనినన్. 823

వ॥ నిన్ను గనుంగొని బేతాళునకు నమస్కరింపు మష్టాంగంబులు ధరిత్రి
సోఁపియని నియోగింపంగలండు నీవపుడు మోసపోక యిట్లను నాదు బుద్ధింజేసి,
824

క॥ నే మ్రొక్క నెవ్వరికి మును
సామంతులచేత మ్రొక్కు సతతము గొందున్
ధీమణి! యష్టాంగముల ప్ర
ణామము చందంబు సూపు నా కెఱుఁగంగన్. 825

క॥ అని వానిఁ బంచి మ్రొక్కిం
చి నరేశ్వర! ఖడ్గమెత్తి శీఘ్రుతఁ దలఁ ద్రుం
చి నివె వధింపుము బేతా
ళునికిం బరితోష మెసగ లోకప్రణుతా! 826

వ॥ ఇట్లు విపరీతంబయ్యెనేని వాఁడు త్రైలోక్యవిభూషణంబైన నిన్నుంబశు వధించి భూతతృప్తిచేసి విద్యాధరచక్రవర్తి కాగలవాఁడెల్ల భంగిని నిట్లు సేయునని యెఱుంగు మిది సకల మనోరథంబులు నీకు సిద్ధించునని చెప్పి బేతాళుండు తత్ప్రదేశంబున శక్తిభరంబులు విడిచిపోయిన నన్నరేంద్రుండు శవంబు మోచికొని క్షాంతిశీలు నొద్దకుం జనుదెంచె. నంత రాత్రి చతుర్భాగశేషం బయ్యె నంత. 827

ఉ॥ ఆ నరనాథు జూచి యతిహర్షము గైకొని దుష్టభిక్షుఁ డ
న్నా! నిజశౌర్యధైర్య సుమహత్వములన్నియు బోల లేరు ధా
త్రీనరనాథులంచును నుతించి మనోరథ సిద్ధియయ్యె నిం
కేన ధరిత్రియంతయును నేలితినంచు మదిం దలంచుచున్. 828

వ॥ బహుచితాభస్మనిర్మితంబై విచిత్రలాంఛనంబులు గలిగి యుద్దండ మండల మధ్యంబున శవంబు నుత్తానంబుగా బెట్టి దక్షిణాభిముఖుండై బేతాళాహ్వానంబు సేసి రక్తకుసుమమాల్యంబుల నర్ఘ్యాదివిధులం బూజించి విక్రమసేనుం జూచి నీకు మనోరథంబులు సఫలంబులయ్యెడి కృతార్థుండవై సాష్టాంగ నమస్కారంబు సేయుమని పంచిన నన్నరేంద్రుండతని కిట్లనియె. 829

ఆ॥ వినవె యిట్టి మ్రొక్కు వినవేను జూచి ము
న్నెఱుఁగ నేను మీరలిట్టులనుచు
మొదల మ్రొక్కి జూప పిదప నే మ్రొక్కెద
ననిన దైవ నిహతుఁడగుటఁ జేసి 830

క॥ అక్కట! భిక్షుండప్పుడు
మ్రొక్కుటయును నృపతి ఖడ్గమున వాని శిరం
బక్కటిక లేక వ్రేసెను
తక్కక బేతాళు పలుకుఁ దలచినవాఁడై 831

వ॥ ఇట్లు దెంచి యా శిరంబు నుపహారంబిచ్చి వాని వక్షంబు వ్రచ్చి హృదయ పద్మంబువుచ్చి విక్రమసేనుండు బేతాళునిం బూజించినం బ్రసన్నుండై, 832

క॥ విక్రమసేనుని నక్కడ
చక్రధర ఖ్యాతిఁ బోలె జగములలోఁ బూ

జాక్రమ మరుదగునని ని
ర్వక్రంబుగ నపుడె వలికె వరదుం డగుచున్ 833

వ॥ అయ్యవసరంబునం బుష్పవృష్టి గురిసె, నంత బ్రహ్మవిష్ణు ప్రముఖ నిఖిల దేవగణపరివృతుండై పరమేశ్వరుం డచ్చోటి కవధరించి వచ్చి విక్రమసేనుం గరుణార్ద్రదృష్టిం జూచి నీవు నా యంశంబున సోమకులంబునందు విక్రమాదిత్యుండవై పుట్టి యిప్పుడు విక్రమసేనుండనం బ్రఖ్యాతికెక్కి రాజవంశ భూషణుండవైతివి భోగాపవర్గ సుఖావహంబైన విద్యాధర రాజపదవిం బొందుమని వరంబిచ్చి యంతర్హితుండయ్యె నంత. 834

ఉ॥ ఆ ధరణీశ్వరుండు త్రిపురారి వరంబునఁజేసి యప్డు వి
ద్యాధరచక్రవర్తి విభవాతిశయంబునఁ దేజరిల్లి వి
ద్యాధరులెల్లఁ గొల్వ విభవాధికుఁడై పరికేఁగుదెంచి ల
క్ష్మీధరమూర్తి రాజ్యము సమృద్ధిగఁ జేయుచునుండె నున్నతిన్. 835

శా॥ పాతాళంబున బన్నగేశ్వర ఫణాప్రవ్యక్త రత్నప్రభన్
భూతంబై తుహినోత్కరామలరుచుల్ భూమండలి న్స్ఫూరితం
బై తారాపథమందుఁ దారక సముద్యత్కాంతిశోభిల్లి వి
ఖ్యాతి న్విక్రమసేను కీర్తి యమరెన్ గంగా ప్రవాహాకృతిన్. 836

క॥ అని యా విప్రుడు నాకున్
వినగా బేతాళ పంచవింశతి కథలిం
పొనర నెఱిఁగించి యెంతయు
ననునయ పూర్వక సమంత్రమతి దయ నిచ్చెన్. 837

వ॥ అట్టి సిద్ధమంత్ర ప్రభావంబునంజేసి బేతాళుని వాహనంబుగా నొనరించి తత్ప్రభావంబున నతిగుహాగహనంబులు గడచి నా పుణ్యంబునం జేసి సపరివారుండనై నిన్ను గంటినని మృతుండయ్యె. నతండు విక్రమసేను చరితంబు విని హర్షంబు నొందె. 838

* * *